# వరంగల్ వార్త

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు

బుధవారం 2, అక్టోబర్ 2024 16 పేజీలు


## పిల్లలు తల్లిదండ్రులకు ప్రేమ ఆప్యాయతలను పంచాలి




16లో.. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా

# ఎంగిలి పూలతో బతుకమ్మ సంబరాలు షురూ..



బతుకమ్మ సంబరాలు షురూ...

పల్లె పదం పాటలతో అంబరాన్ని అంటనున్న బతుకమ్మ సంబరాలు...

బతుకమ్మ సంబరాలతో పల్లెలన్నీ పూలవనాలే...

తెలంగాణ రాష్ట్ర సాధనలో బతుకమ్మ పండగ కీలకం...

ములుగు జిల్లా, ప్రభాత వార్త: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆత్మీయ అనురాగాల ఆనందాల నడుమ, తీరొక్క పూల పండగ అయిన బతుకమ్మ సంబరాలకు పల్లెలు, పట్టణాలు ముస్తాబవుతున్నాయి. ఎంగిలిపూల బతుకమ్మ పండుగతో తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ సంబరాలకు నాంది పలుకుతోంది.ఈ తొమ్మిది రోజులు పల్లెలన్నీ పూలవనాలేనా... అనేలా తలపిస్తాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామాలలో చెరువులు కుంటలు పుష్కలంగా ఉండడంతో బతుకమ్మ సంబరాలు ఘనంగానే ఉంటాయి. పల్లె పదాలతో కలిసిన జానపదంతో మహిళలు, యువతులు పాదం కలిపి ఎనలేని ఉత్సాహంతో పాడే పాటలతో ఊరు వాడ పులకరిస్తుంది.

2 లో..

# కొండా..కేటీఆర్ మధ్య వార్




16లో..

సోషల్ మీడియా వేదికగా బీసీ మహిళా మంత్రి సురేఖకు అవమానం


గతంలో సైతం తాటతీస్తా అని అనుచిత వాఖ్యలు చేసిన కేటీఆర్

కేటీఆర్‌ది అగ్రవర్ణ అహంకారమా..?

బీఆర్ఎస్‌పై మండిపడుతున్న బీసీ, చేనేత సంఘాలు

తెలంగాణలో హీటెక్కిన రాజకీయం

హన్మకొండజిల్లాబ్యూరో- ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ అటవీ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖపై పింకు పార్టీ సోషల్ మీడియా వేదికగా ట్రోలింగ్ వ్యవహారం కాస్తా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రాజకీయం హీటెక్కింది. మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి కేటీఆర్ ఇరు పార్టీల మధ్య వార్ నడుస్తోంది. కాగా గతంలో కూడా కేటీఆర్ మంత్రి కొండా సురేఖపై తాటతీస్తా అనే అనుచిత వాఖ్యలు సైతం చేయడంతో మాజీ మంత్రి కేటిఆర్‌పై తెలంగాణ రాష్ట్రంలోని బీసీ సంఘాలు మండిపడ్డ విషయం విధీతమే.




# విద్యార్థుల తల్లిదండ్రుల రక్తం పీలుస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు

ఫీజులు చెల్లిస్తేనే సెలవులకు ఇంటికి పంపిస్తాం

అంతా మా ఇష్టం.. మాకెదురు ఎవరూలేరు

విద్యాభారతి పాఠశాల యాజమాన్యం నిర్వాకం

మహబూబాబాద్,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నేటి నుండి పండగ సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లడానికి రాగా ఫీజు కడితేనే పంపిస్తామంటూ పిల్లలను తరగతి గదిలోనే బందించిన సంఘటన మంగళవారం మున్సిపాలిటి పరిధిలోని విద్యాభారతి పాఠశాలలో చోటుచేసుకుంది. తల్లిదండ్రుల తెలిపిన వివరాల ప్రకారం ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజుల పేరుతో తమ రక్తాన్ని పీల్చి పిప్పిచేస్తున్నారని వారు మండిపడ్డారు.

2లో..

# ఎంగిలి పూలతో

మొదటిపేజీ తరువాయి

**స్వరాష్ట్ర సాధన కాంక్షను ఎలుగెత్తి చాటిన బతుకమ్మ పండుగ...**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉద్యమ స్ఫూర్తిని పెంచిన బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోఎంతో ప్రత్యేకమైనది. ఉద్యమ సందర్భంలో బతుకమ్మతో ఊరేగింపులు చేసిన తెలంగాణ ప్రజలు తమ తమ స్వరాష్ట్ర అస్తిత్వాన్ని,రాష్ట్ర సాధనలో సగర్వంగా చాటుకున్నారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ తరువాత బతుకమ్మ పండుగకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. విదేశాలలో కూడా బతుకమ్మ ఉత్సవాలకు విపరీతమైన ఆదరణ పెరిగింది.తెలంగాణా ప్రజల ఇంటి పండుగ బతుకమ్మ పండుగ సంబరాలను అందరూ మన సంస్కృతి సంప్రదాయాలను,మన భావితరాలకు భద్రంగా అందించాలనే ఆశయాలతో ముందడుగు వేద్దాం. ఆశ్వయుజ మాసంలో జరుపుకునే అతిపెద్ద పండుగ దసరా.అయితే ఈ దసరా పండుగను దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాలలో నివసిస్తున్న వారి సంస్కృతి, సాంప్రదాయాల ప్రకారం జరుపుకుంటారు. అలాగే తెలంగాణలో కూడా దసరా పండుగను బతుకమ్మ సంబరాలతో మొదలుపెట్టి విశేషంగా జరుపుకుంటారు. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన ఈ బతుకమ్మ పండుగ మన రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక.

**బతుకమ్మ పండుగ వేడుకలు ఎప్పటి నుంచి మొదలు..**

భాద్రపద బహుళ అమావాస్య అంటే మహాలయ అమావాస్య నుంచి బతుకమ్మ వేడుకలు మొదలై ఆశ్వయుజ శుద్ధ అష్టమి అనగా దుర్గాష్టమి పర్వదినంతో ముగుస్తాయి. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ రోజుల్లో మహిళలు,యువతులు రంగు రంగుల పూలతో బతుకమ్మను త్రికోణాకారంలో పేర్చి, అలంకరించిన ఆ బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ, ఆ చప్పట్లకు అనుగుణంగా లయబద్ధంగా అడుగులు వేస్తూ బతుకమ్మ పాటలు పాడతారు.ఈ బతుకమ్మ సంబరాలు తొమ్మిది రోజుల పాటు జరుగుతాయి.నేటి నుంచి(అక్టోబర్ 2) మొదలై అక్టోబర్ 10 దుర్గాష్టమితో ముగియనున్నాయి. అయితే ఈ ఏడాది అక్టోబరు 11 ఉదయం 11 గంటల వరకు అష్టమి తిథి ఉంది. అందుకే ఆ రోజు కూడా ముగింపు వేడుకలు జరుపుకోవచ్చు. ఇది వారి సంప్రదాయాన్ని అనుసరించి ఉంటుంది.

**పూలను పూజించే పండుగ...**

పూలతో దేవుడిని పూజించడం సర్వసాధారణం. కానీ ఆ పూలనే పరమ పవిత్రంగా పూజించడం ఒక్క తెలంగాణలోనే ప్రత్యేకం. ప్రకృతిని అమ్మగా భావించి పూజించే గొప్ప పండుగ ఇది. బతుకమ్మ అనగా బతుకును ఇచ్చే అమ్మ అని అర్థం. శివుని భార్య గౌరీదేవీ మహిషాసురునితో పోరాడి అతన్ని వధించిన అనంతరం అలసిపోయి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు మూర్ఛపోయిందని, ఆమె మూర్ఛ నుంచి తేరుకోవడానికి వివిధ రీతుల్లో గౌరీదేవిని స్తుతించారని జానపదుల ప్రతీతి.ఇవే కాకుండా మరికొన్ని కథలు పల్లెల్లో ప్రచారం ఉన్నాయి.

**తీరొక్క పూలతో బతుకమ్మ ముస్తాబు...**

బతుకమ్మల కోసం ప్రత్యేకంగా సిబ్బి అనే వెదురుతో చేసిన కంచం లేదా చిన్న సైజు తబుకు అని పిలిచే ఇత్తడి, రాగి, స్టీలు, అల్యూమినియం పాత్రలో వారి స్థాయికి తగ్గట్టు ఏదో ఒకటి వాడుతుంటారు. ముందుగా గుమ్మడి ఆకు లేదా బీర ఆకులు వంటి ఏదైనా పెద్దగా, వెడల్పుగా ఉండే ఆకులను పళ్లెంలో పరుస్తారు.గుమ్మడి పువ్వును తొలుతగా పెడతారు. అనంతరం తంగేడు పువ్వులతో మొదలు పెట్టి, గునుగ పువ్వు, చామంతి, గడ్డిపూలు, అల్లి, కట్ల, పట్టుగుచ్చులు ఇలా రకరకాల పూలతో అందంగా వరుసగా పేర్చి తీర్చిదిద్దుతారు.బతుకమ్మపై పసుపుతో తయారుచేసిన గౌరమ్మను ప్రతిష్ఠిస్తారు.బియ్యపు పిండితో చేసిన దివ్వెతో దీపం వెలిగించి పూజిస్తారు.ప్రస్తుతం పండుగలో సహజ సిద్ధమైన పూల బతుకమ్మలు కనుమరుగ వుతున్నాయి. పూల ధరలు పెరగడంతో పట్టణాలలో కాగితపు బతుకమ్మలు వచ్చాయి. తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ విశేషాలు..

**మొదటి రోజు–ఎంగిలి పూల బతుకమ్మ:**

మహాలయ అమావాస్య రోజు నుంచి ప్రారంభమయ్యే బతుకమ్మ మొదటిరోజు వేడుక మొదలవుతుంది. తెలంగాణలో దీన్ని 'పెత్రామస' అని కూడా అంటారు. ఈ రోజు నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేసి బతుకమ్మకు నివేదిస్తారు.

**రెండో రోజు– అటుకుల బతుకమ్మ :**

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అటుకుల బతుకమ్మ వేడుక జరుగుతుంది. ఈ రోజు సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

**మూడో రోజు–ముద్దపప్పు బతుకమ్మ :**

మూడో రోజు ముద్ద పప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి బతుకమ్మకు సమర్పిస్తారు.

**నాలుగో రోజు– నానే బియ్యం బతుకమ్మ :**

ఈ రోజు నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేసి బతుకమ్మకు నివేదిస్తారు.

**ఐదో రోజు– అట్ల బతుకమ్మ :**

ఈ రోజు బతుకమ్మకు అట్లు లేదా దోశలు నైవేద్యంగా సమర్పిస్తారు.

**ఆరో రోజు అలిగిన బతుకమ్మ :**

ఆరవ రోజైన ఆశ్వయుజ పంచమి నాడు బతుకమ్మను అలిగిన బతుకమ్మగా పూజిస్తారు. ఈ రోజున అమ్మవారు అలిగి ఉంటారని ఏమి తినరని అంటారు.అందుకే కొన్ని ప్రాంతాలలో నైవేద్యమేమి సమర్పించరు.

**ఏడో రోజు– వేపకాయల బతుకమ్మ :**

ఈ రోజు వేపకాయల బతుకమ్మకు బియ్యంపిండిని బాగా వేయించి వేపపండ్ల ఆకారంలో తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.

**ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ :**

ఈ రోజు నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి నైవేద్యం తయారు చేసి బతుకమ్మకు నివేదిస్తారు.

**తొమ్మిదో రోజు– సద్దుల బతుకమ్మ :**

ఆశ్వయుజ అష్టమి నాడు దుర్గాష్టమి మహా పర్వదినం రోజున బతుకమ్మకు ఐదు రకాల నైవేద్యాలు తయారు చేస్తారు. పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ పులిహోర, కొబ్బరన్నం, నువ్వులన్నం.ఇలా ఐదు రకాల నైవేద్యాలను అమ్మవారికి సమర్పిస్తారు.

తెలంగాణాలో బతుకమ్మ సంబరాలకు ఆడపడుచులు అందరూ అత్తవారింటి నుంచి కన్నవారింటికి చేరుకుని ఈ పూల పండుగ సంబరాలు జరుపుకుంటారు. మహిళలతో పాటు మగవారు కూడా బతుకమ్మ అలంకారానికి పూలను సేకరిస్తారు ఆ తరువాత ఇంటిల్లపాదీ కూర్చుని ఆ పూలతో బతుకమ్మను తయారు చేస్తారు.

సాయం సంధ్య వేళ స్త్రీలందరూ ఈ బతుకమ్మలను తలపై పెట్టుకుని ఊరిలో దేవాలయాల దగ్గర గానీ, బొడ్రాయి దగ్గర కానీ బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ బతుకమ్మలను కొలచి, అనంతరం గ్రామాల్లో ఉన్నచెరువులు,కుంటల దగ్గరికి ఊరేగింపుగా బయలుదేరి నీటిలో నిమజ్జనం చేస్తారు.

## విద్యార్థుల తల్లిదండ్రుల రక్తం పీలుస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు

మొదటిపేజీ తరువాయి

ఇటీవల అకాల వర్షాలకు పంటనష్టపోయి తీవ్ర ఇబ్బందులు కురుకపోయామని ఆ బాదలో నుండి తేరుకోక ముందే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఫీజుల పేరుతో వేదించడంతో తమ నెత్తిపై బండరాయి పడినట్లైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగ తర్వాత ఫీజులు చెల్లిస్తామని చెప్పినప్పటికీ వారు వినకుండా మీరు ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండని ఫీజులు కడితేనే విద్యార్థులకు పంపిస్తామని ఖరాకండిగా తేల్చిచెప్పారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల సిబ్బందికి వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారికి ఫోన్ చేయగా మీటింగ్‌లో ఉన్నానంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పారని వారు ఆరోపించారు.

**డిఈవో వివరణ:**

ముస్సిపాలిటి పరిధిలో ఉన్న విద్యాభారతి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు, యాజమాన్యానికి ఫీజు విషయంలో వాగ్వివాదం చోటుచేసుకుందని పిల్లలను ఇంటికి పంపించడంలేదని జిల్లా విద్యాశాఖ అధికారిని వివరణ కొరగా నేను ఢిల్లీలో ఉన్నానని ఎంఈవోను పంపిస్తానని సమాధానం చెప్పారు.

## ఎంబీబీఎస్ సీట్లు సాధించిన బాలికలు అభినందించిన మండల ప్రజలు

నల్లబెల్లి, అక్టోబర్ 1, ప్రభాతవార్త

ఇటీవల ఎంసెట్ కౌన్సిలింగ్‌లో నల్లబెల్లి మండలం లోని బాలికలు ఎంబిబిస్ సీట్లు సాధించి మండల ప్రజల మెప్పును పొందారు. మండల కేంద్రానికి చెందిన కల్లెం పాపిరెడ్డి– గీత దంపతుల కూతురు హిమశివానిరెడ్డి మహాత్మగాంధీ జ్యోతిరావుపూలే ఊర్సు గుట్ట కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించి ఇటీవల జరిగిన ఎంసెట్ ఫలితాల్లో 720 మార్కులకు గాను 559 మార్కులు సాధించి ఓపెన్ కేటగిరిలో ఎంబిబిఎస్ విద్యార్హత సాధించింది. ఈ నేపథ్యంలో మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన ఇంబడి కరుణాకర్– స్వప్న దంపతుల కూతురు సుహాని ఇటీవల జరిగిన ఎంసెట్ పరీక్షల్లో కౌన్సిలింగ్‌లో భాగంగా 720 మార్కులకు గాను 645 మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఆటు బంధుమిత్రులు, ఇటు మండల ప్రజలు వారిని అభినందించారు. బాలికను సమాజంలో పురుషుల కంటే అన్ని రంగాలలో రాణించి ముందుకు సాగుతుండటం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## ఆశాలకు జాబ్ చార్టు ప్రకారమే విధులను అప్పగించాలి

నర్సంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త

ఆశా వర్కర్లకి తగ్గ పారితోషకమని చెప్పి పనులు చేపించుకుంటూ వారితో పారితోషికం లేనటువంటి అనేక పనులు చెబుతున్నారని ఇలాంటి పనులు చెప్పకూడదు అని ఆశ వర్కర్స్ యూనియన్ బీఆర్‌టీయు అనుబంధ సంఘం బాంజిపేట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకురాలు రమ, మండల అధ్యక్షురాలు పామా మాట్లాడుతూ జాబ్ చార్టు ప్రకారం పనులు చెప్పాలని అన్నారు. పారితోషకం లేని పనులు చెబితే వాటికి ప్రత్యేక పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్ణిమ, మంజుల, సంధ్య, శోభ, సరోజన, రేఖ తదితరులు పాల్గొన్నారు.

**నల్లబెల్లిలో....:**ఆశా కార్యకర్తలకు జాబ్ చార్టులో పేర్కొన్న విధంగా విధులను అప్పగించాలని కోరుతూ మండలంలోని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్ ఆర్డులో ఉన్న పనులను మాత్రమే మేము చేయలని మాకు జాబ్ చార్టు ఇవ్వటం జరిగింది. కావున జాబ్ చార్టులో ఉన్న పనులు మాత్రమే మాతో చేయించాలని అదనంగా వేరే పనులు చేయాలని చెప్పినచో ఆ పనులకి సంబంధించి గైడ్‌లెన్స్, ఆ పనులకి సంబంధించిన ప్రత్యేక పారితోషికం ఇస్తేనే మేము చేస్తామని లేనిచో ఆ పనుల విషయంలో మమ్మల్ని ఒత్తిడి చేయొద్దని బీఆర్‌టీయు అనుబంధ ఆశా యూనియన్ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కే. లలిత, ఏ.అనిత, ఎం.శ్రీలత, పీ.జ్యోతి, ఎం.జయ పాల్గొన్నారు.

## సెయింట్ మేరీస్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబురాలు

హసన్ పర్తి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:

హసన్ పర్తి మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ, దసరా సంబురాలను విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. పదవ తరగతి, 9వ తరగతి విద్యార్థినీలు వివిధ రకాల పూలను సేకరించి, రంగురంగులతో బతుకమ్మలను స్వయంగా పేర్చారు. చిన్న పిల్లలు సైతం రంగురంగుల దుస్తులను ధరించి కోలాటాలతో పాఠశాలలో పండుగ వాతావరణం సృష్టించారు. చిన్న పిల్లలను అందంగా అలంకరించి వారి తల్లులు సైతం వేడుకల్లో పాల్గొనడం జరిగింది. రెండు గంటల పాటు బతుకమ్మ పాటలతో విద్యార్థులు తెలంగాణ సాంప్రదాయ, సంస్కృతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాకాల తిరుమలేశ్వర్ రెడ్డి బతుకమ్మ సంబరాలను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ మహిళలకు ఎంతో గౌరవ ప్రతిష్టలను తీసుకొచ్చే బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులపాటు సంతోషాలతో జరుపుకొని ఆనందాలను పంచుకోవాలని సూచించారు. అనంతరం జమ్మి చెట్టుకు పూజలు చేసి, రావణాసుర దహన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం కల్పనా రెడ్డి, గద్దం వెంకటేశ్వర్లు, గంజి బద్రి నారాయణరెడ్డి, ఎలుక రాజు సదానందం, పాఠశాల బృందం విజయరాణి, అంజద్, రవి నాయర్, భయ్యా సదానందం, ప్రత్యూష, విజిత, అనురాధ, సంధ్యారాణి, రజని, కీర్తన, స్వప్న, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.


## ద్వేషించకుండా వయోవృద్ధుల సంక్షేమానికి సహకరించాలి

చెన్నారావుపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త

ద్వేషించకుండా వయోవృద్ధుల సంక్షేమానికి సహకరించాలని మలివయసులో ఉన్న వారిని ద్వేషించకుండా వారి సంక్షేమం కోసం సహకరించాలని తహసీల్దార్ ఫణికుమార్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం చెన్నారావుపేట జాగృతి విద్యానికేతన్ నందు వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం ఘనంగా జరిగింది. అతిథులుగా పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ పెద్దలు ఇంటికి మామిడి తోరణాలు లాంటి వారని పెద్దలు ఉన్న ఇల్లు శుభగృహమని అన్నారు. పెద్దలను రక్షించుటలో ప్రభుత్వపరంగా సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీవాణి, ఎస్ఐ రాకేష్‌రెడ్డి, సంఘ అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్యలు మాట్లాడుతూ సంఘం ఏర్పడి ఆరు నెలలు అయిందని దీనిలో సభ్యులు 120మంది ఉన్నారని అందులో 50 మందికి ఐడి కార్డులు అందించామన్నారు. కాగా సిద్ధార్థ విద్యాలయాల వ్యవస్థాపకులు కందిగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వృద్ధుల సంఘానికి తన సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని ఈ సంఘానికి ఒక వేదికను ఏర్పరుచుటకు తన సొంత ఖర్చులతో గదిని నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సభ్యులు వరంగంటి మల్లయ్య, పత్తి సంజీవరెడ్డి, ముత్యం సాంబయ్య, గట్ల కృష్ణ కంది నారాయణరెడ్డి, తోట ఆనందం, పరకాల కొమురయ్య, దొనికల వీరయ్య, సాదు మధుసూదన్‌రెడ్డి, కోరె కట్టయ్య, తాళ్లపల్లి కొమ్మాలు, ఆడెపు సత్తయ్య, సిద్ధ కుమారస్వామిలు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి

నెక్కొండ, అక్టోబర్ 1, ప్రభాతవార్త



గుర్తు తెలియని వ్యక్తి రైలు క్రింద పడి మృతిచెందిన సంఘటన నెక్కొండ మండల కేంద్రంలో ఎరుకల వాడ దగ్గర రైల్వే ప్లై ఓవర్ బ్రిడ్జి కింద చోటు చేసుకుంది. బిక్షాటన చేసుకునే మగ వ్యక్తి వయసు అందాజ 40 సంవత్సరాలు గల వ్యక్తి చనిపోయి ఉండగా ఆ సమాచారం అందుకున్న దయ్యాల సదానందం నెక్కొండ గ్రామ సెక్రటరీ పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించనచో 8712685236 నెంబర్‌కి ఫోన్ చేయాలని ఎస్ఐ తెలిపారు.

# ఆరోగ్యవంతులుగా ఉండాలంటే తరుచూ రక్తదానం చేయాలి

-వైద్యకళాశాల

ప్రిన్సిపాల్ డా.గోపాల్‌రావు

*జనగామ టౌన్,అక్టోబరు 1 ప్రభాతవార్త :*

ఆరోగ్యంగా ఉండాలని కోరుకునే ప్రతీ ఒక్కరూ తరుచు రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని జనగామ ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలరావు అన్నారు. మంగళవారం (అక్టోబరు 1)న స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా జనగామ జిల్లా ఆస్పత్రిలో గల రక్తనిధి కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ గోపాలరావు మాట్లాడుతూ జనగామ రక్తనిధి కేంద్రాన్ని బలోపేతం చేయాలని అందుకు స్థానికంగా ఉండే స్వచ్ఛంద సంస్థలు, యువకులు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ఈరోజు రక్తదానం చేసిన దాతలను ఆయన అభినందించారు. రక్తదానం చేయడం వల్ల శరీరంలోని శుద్ధి జరిగి ఆరోగ్యవంతంగా ఉంటామని, యువకులలో ఉన్న అపోహలు తొలగించుకోవాలని ఆయన సూచించారు. రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యుడు కృష్ణజీవన్ బజాజ్,



జనగామ ఫీల్డ్ ప్రాపర్టీ కమిటీ జాయింట్ సెక్రటరీ రాజ్‌కుమార్ రోడ్రిక్స్ తొలుత రక్తదానం చేసి మొదలైన ఈరోజు శిబిరంలో వివిధ సంస్థల నుంచి దాతలు పాల్గొని 31యూనిట్ల రక్తదానం చేసినట్లు రక్తనిధి అధికారి డా.పి.కరుణాకర్‌రాజు తెలిపారు. రెడ్‌క్రాస్, లయన్స్‌క్లబ్‌ల ప్రతినిధులు, ఐఎంఎ పాస్టర్స్ పాలొనగన్న ఈ శిబిరంలో వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ అన్వర్, ఆర్ఎంఒ లక్ష్మీనారాయణ, నర్సింగ్ సూపరింటెండెంట్ సంగీత, పలుమార్లు రక్తదానం చేసిన మల్లిగారి రాజు, రెడ్‌క్రాస్ జనగామ సొసైటీ చైర్మన్ డా.డి.లవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని, అలాగే ప్రతీ ఒక్కరూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరాలని ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు, లయన్స్ క్లబ్ జనగామ అధ్యక్షుడు వై.సంజీవరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జనగామ జిల్లా అధ్యక్షుడు జి.ప్రమోద్‌కుమార్ గుప్తా, సామ్యుల్ కరుణాకర్, రవికుమార్, సిహెచ్.ప్రభాకర్, వైద్యప్రముఖులు డా.ప్రభాకర్, డా.ఎల్.అశోక్‌కుమార్, డా.మోర్తాల దివ్య తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు

*మరిపెడ,అక్టోబర్1,ప్రభాతవార్త:*



మున్సిపాలిటి కేంద్రంలోని గ్లోబల్ కేరళ మోడ్ స్కూల్‌లో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పాఠశాల ఆవరణలో పెట్టి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడి కోలాటం వేశారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## వరద బాధితులకు నిత్యవసర సరుకుల పంపిణీ

*మరిపెడ,అక్టోబర్1,ప్రభాతవార్త:*



గత నెల సెప్టెంబర్ 1న సంభవించిన అకల వరదల కారణంగా నష్టపోయిన మరిపెడ మండలం సీతారాం తండా వాసులకు మంగళవారం మున్సిపాలిటిలోని సెయింట్ అగస్టీన్ పాఠశాల యాజమాన్యం చేయూతనిచ్చింది. స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ దీన, కరస్పాండెంట్ సిస్టర్ షీనాటోమ్, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ ఫ్రాన్సీలు స్పందించి పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల నుండి విరాళాలు సేకరించి నిత్యవసర సరుకులను కొనుగోలు చేసి బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా తండావాసులు స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్లు జ్యోతిస్, ట్విన్సీ ఆగ్నస్, ఉపాధ్యాయుడు శేఖర్, ఉపాధ్యాయురాళ్ల విజయ, అశోకకుమారి, పాఠశాల విద్యార్థి నాయకులు ఎల్.చరణ్, శ్రీజ, ఇందు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే చర్యలు తప్పవు

-జనరల్‌బాడి సమావేశంలో

ఎమ్మెల్యే మురళీనాయక్

*మహబూబాబాద్,అక్టోబర్1,ప్రభాతవార్త:*



అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే చర్యలు తప్పవని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళినాయక్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన జనరల్‌బాడి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేవిధంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. పత్తిపాక వెళ్లే రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఒక్కరిద్దరి కోసం సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని అన్నారు. పట్టణంలో విద్యుత్ సమస్యలపై తనకు ఫోన్‌లు వస్తున్నాయని ట్రాన్స్‌కో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని నియోజకవర్గంలో అర్హులైన వారికి 3500ఇళ్లు వస్తాయని అన్నారు. విద్యుత్ అధికారులు ప్రభుత్వాన్ని బద్నాం చేయవద్దని హెచ్చరించారు. అధికారులకు ప్రాధాన్యం ఇచ్చి గౌరవిస్తున్నామని ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే వేటు తప్పదన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి,వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్లు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ధర్మాపురం ఊరచెరువులోకి నీళ్లను తీసుకొచ్చిన బీఆర్ఎస్‌నాయకులు

*దేవరుప్పుల, అక్టోబరు 1 ప్రభాతవార్త :*

దేవరుప్పుల మండలం ధర్మాపురం గ్రామంలోని ఊరచెరువులో నీళ్లను నింపి రైతుల పక్షాన నిలిచిన ధర్మాపురం బీఆర్ఎస్ నాయకులు మాజీమంత్రి పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు గూడూరు గ్రామం వద్ద ఉన్న కాలువను రాంసింగ్ తండా వద్ద ఉన్న కాలువను జేసీపీతో పూర్తిగా మరమ్మతు చేయించి కాలువకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను మట్టిని, బండరాళ్లను, చెత్తాచెదారాన్ని తొలగించి ఊర చెరువుకు నీళ్లను తీసుకొచ్చిన ధర్మాపురం బీఆర్ఎస్ నాయకులు మరో రెండురోజులలో ఊర చెరువు పూర్తిగా నిండేలా కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అనంతోజు కృష్ణమూర్తి, గండిపెల్లి యాకయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గూడూరు గ్రామమూల మలుపు వద్ద ఘోర రోడ్డుప్రమాదం

-పలువురికి గాయాలు

*పాలకుర్తి, అక్టోబరు 1 ప్రభాతవార్త :*



గూడూరు మూలమలుపువద్ద అదుపుతప్పి లారీ బోల్తాపడిన సంఘటనలో అదే గ్రామానికిచెందిన ముగ్గురు మహిళలకు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం నెలకొంది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పాలకుర్తి మండలకేంద్రం గూడూరు గ్రామంలో అతివేగంగా వస్తున్న యుపీ 11 ఏటి 3212నంబరుగల లారీ సహారా పూర్ ఉత్తర్‌ప్రదేశ్‌నుంచి విజయవాడకు ఫైబర్ డోర్స్ మెటీరియల్‌తో వెళ్లుతున్న క్రమంలో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో రోడ్డుపక్కనే ఉన్న గూడూరు గ్రామానికి చెందిన బెల్లి గౌరమ్మ, ఉప్పునూతుల రమ, ఉప్పునూతుల రమ్యలకు తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సీఐ మహేందర్‌రెడ్డి ఎస్ఐ సాయిప్రసన్నకుమార్ పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా,ప్రమాద సంఘటన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి అధైర్యపడవద్దని అన్నివిధాలు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అదేవిధంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకుని బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. కిందపడిన లారీని జేసీబీ సహాయంతో బయటకు తీసి పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## సూదనపల్లి పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

*కురవి,అక్టోబర్1,ప్రభాతవార్త:*



మండలంలోని సూదనపల్లి పాఠశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధరావత్ వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థినిలు తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఉపాధ్యాయ బృందం చిన్నం ప్రదీప్‌కుమార్, అంజద్‌పాషా, బాలరాజు, సరోజ, శుభ, సారంగం, ప్రగతి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

*ఎడ్యుకేషన్ కేయూ,అక్టోబరు 1 ప్రభాతవార్త :*

కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని మహిళ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలను కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్యసుంకరి జ్యోతి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయక పండుగలలో బతుకమ్మ పండుగకు ప్రత్యేకమైన స్థానం ఉందని తెలుగు ప్రజలు ఘనంగా జరుపుకునే పూలపండుగ బతుకమ్మ అన్నారు. మారుతున్న కాలంలో పండుగలు సాంప్రదాయాలు ముందు తరాలకు అందించడానికి ఇటువంటి సాంప్రదాయ వేడుకలు ఎంతో దోహదపడుతాయని అన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి మాట్లాడుతూ తెలంగాణప్రజలు ఎంతో ఆత్మవిశ్వాసంతో జరుపుకునే పండుగలలో బతుకమ్మ పండుగ చాలా గొప్పదని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.పుల్ల రమేష్ కేంద్రం సంచాలకులు డా.శ్రీలత, సహాయక రిజిస్ట్రార్ అశోక్‌బాబు, కళాశాల పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డా.ఆర్.ఆదిరెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దం బతుకమ్మ పండగ

## -న్యూ కేంబ్రిడ్జిలో ఘనంగా

## ముందస్తు బతుకమ్మ సంబరాలు

*కాటారం, అక్టోబర్ 1, ప్రభాతవార్త*

సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దం బతుకమ్మ పండగ అని కేంబ్రిడ్జి పాఠశాల నిర్వాహకులు అన్నారు. మంగళవారం న్యూ కేంబ్రిడ్జి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆనందోత్సహాల నడుమ బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థినీలు, ఉపాధ్యాయినీలు, సిబ్బంది బతుకమ్మ ఆటలను ఆడి కనువిందు చేశారు. ఈసందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ.. పువ్వులను పూజించే సంస్కృతి తెలంగాణలో ఉందన్నారు. దేశంలోని మట్టిని, నీళ్లను, గురువులను పురాతనమైన సంస్కారం మనదని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. బతుకును గురించి, జీవన విధానాన్ని తెలియజేసే పండుగే బతుకమ్మ పండగ అని అన్నారు. అంతేకాకుండా తెలుగు



సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకమైన బతుకమ్మ పండుగ విశిష్టతను యావత్ ప్రంచానికి తెలంగాణ ప్రజలు చాటడం గర్వకారణ మన్నారు. విద్యార్థులలో పండుగల గూర్చి అవగాహన కల్పించి వారిలో మన సంస్కృతి యొక్క స్ఫూర్తిని నిలపడం కోసం బతుకమ్మ సంబరాలను పెద్ద ఎత్తున నిర్వహించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు బతుకమ్మ సంబరాల నేపథ్యంలో వారిలో నూతనోత్తేజం నింపేందుకు గాను బహుమతులను అందజేసి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో న్యూ కేంబ్రిడ్జి పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

*చిట్యాల, అక్టోబర్ 1, ప్రభాతవార్త*



మండలంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తుగా బతుకమ్మ సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలకు బుధవారం నుండి ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో ముందస్తుగా3 బతుకమ్మ ఉత్సవాలను ఏర్పాటు చేశారు. తీరొక్క పూలతో విద్యార్థినీలు బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు ఆలపించడం పాఠశాలలు పండగ వాతావరణాన్ని తలపించాయి. మండలంలోని నైన్‌పాక ప్రాథమిక పాఠశాల, మోడల్ స్కూల్, స్థానిక హైస్కూల్, కాకతీయ హైస్కూల్‌లలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాముకుంట్ల తిరుపతయ్య, శ్రీరామ్ రఘుపతి, రమేష్, ఎండి రాజ్ మహమ్మద్, ఉపాధ్యాయులు అనిల్ గవాస్కర్, విక్రముద్దీన్, శ్యాంసుందర్, సదానందం, హాసీనీ, నీలిమారెడ్డి, సరళా దేవి, సుజాత, విజయలక్ష్మీ, కల్పన, బుజ్జమ్మ, లలిత, బుర్ర సదయ్య, రాజమౌళి, రామనారాయణ, ఉస్మానాలి, గడ్డం శంకర్, సాంభమూర్తి, భాస్కర్, రవీందర్, ధనలక్ష్మీ, డి.వాణి, వెంకటేశ్వర్లు, దివ్య, నర్మదా, జ్యోష్ణ, అయేషా, శ్రీకాంత్, కుమారస్వామి, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# అంధ కళాకారులకు ఆర్థికసాయం

*పాలకుర్తి, అక్టోబరు 1 ప్రభాతవార్త :*

పాలకుర్తి మండలకేంద్రానికి చెందిన అంధ కళాకార సోదరులు మారోజు భీష్మాచారి మారోజు శంకరాచారిలకు ఆర్థికసాయం అందచేశారు. అంధ కళాకారుల జీవన స్థితిగతులపై డాక్టర్‌రాపోలు సత్యనారాయణ రాసిన కథనం పలు పత్రికల్లో ప్రచురితమైన కథనాలు సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లో వైరల్ కాగా పుష్పగిరి స్పందించి అంధ కళాకారుల ఇంటికి వచ్చి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దాతల సహకారంతో ఆర్థికసాయం అందచేశారు. అంధ కళాకారులకు దాతలు తేజ డైమండ్స్ అధినేత వంగల శ్రీనివాస్, మదనపల్లి భాస్కరాచారి, రాయలసీమ, ఎంఎస్ ఆచార్య, కందుకూరి రమేష్ ఆచారి, గడియారం నాగరాజు, అడ్వకేట్ కమ్మరి హరికృష్ణ, మారోజు భీష్మాచారిల సౌజన్యంతో ప్రతినెల ఆర్థికసాయం అందచేస్తామని, వారి పిల్లల చదువులకు తోడ్పాటు అందచేస్తామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వీరితో ప్రదర్శనలు ఇప్పించాలని, కళాకారుల పెన్షన్ మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సోమనాథ కళాపీఠం అధ్యక్షులు రాపోలు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన గురుకులంలో మంచి వసతులతో విద్యా బోధన

*కాటారం, అక్టోబర్ 1, ప్రభాతవార్త*



కాటారం మండలకేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల, కళశాలలో మంగళవారం తల్లిదండ్రుల మీటింగ్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని పాఠశాలలో మంచి విద్యాబోధనలు అందుతున్నాయని, మంచి వసతులు ఉన్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో ఇలాగే కొనసాగించాలని సలహాలు, సూచనలు అందజేశారు. ప్రిన్సిపాల్ అన్ని విధాల విద్యార్తులకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని, ఉపాధ్యాయుల సహకారం ఉండాలని అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు గాను ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లాలు, హెచ్.రాజేందర్, మాధవి, డిప్యూటీ వార్డెన్ శ్రీనివాస్, వెంకటయ్య, బలరాం, చారీ, రామకృష్ణ, పిడి మహేందర్, పిఇటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేష్, కళశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలోని పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేకవైద్యశిభిరం

*గార్ల, అక్టోబర్1 ప్రభాతవార్త:*



నిత్యం రోడ్లును, డ్రైనేజీని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాలను కాపాడాలనే నిత్యం కృషి చేస్తున్న పంచాయితీ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యబాగోగులు చూడాల్సిన బాధ్యత మనందరిదని ఎంపిడిఓ మంగమ్మ సూచించారు. సెప్టెంబర్27 నుండి అక్టోబర్2 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మేజర్ గ్రామపంచాయితీ కార్యాలయం ఆవరణంలో వైద్యసిబ్బంది ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిశిరాన్ని ఆమే ప్రారంభించారు. ఈసందర్భంగా వైద్యసిబ్బంది పారిశుద్ధ్య కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించి తగిన మందులు అందించారు. అనంతరం ఆమే మాట్లాడుతు పరిసరాల పరిశుభ్రత పనులలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం చేయరాదని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. పంచాయితీ కార్యదర్శి కిషన్‌నాయక్, వైద్యసిబ్బంది ఎంఎల్‌హెచ్ నందిని, ఏఎన్‌ఎం పంజాలపద్మ, ఆశావర్కర్ పుష్ప, బిల్‌కలెక్టర్ పిడమర్తిదాసు, కిషోర్, పంపు ఆపరేటర్ ఆకారపు శ్రీనివాస్, ఎలక్ట్రీషియన్ సైజాద్, ఫీల్డ్‌అసిస్టెంట్ మల్లిఖార్జున్, సిబ్బంది సైదాఖాన్, కిరణ్, రాజశేఖర్, శ్రీను, రాజు, అరవింద్, దుర్గా, రాధా, అనసూర్య, తదితరులున్నారు.

# కాటారం వార్త

కాటారం,కాళేశ్వరం, మల్హర్‌రావు, మహాముత్తారం

# ఆదర్శలో అలరించిన బతుకమ్మ సంబరాలు

*కాటారం, అక్టోబర్ 1, ప్రభాతవార్త*



కాటారం మండలకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ముందస్తు బతుకమ్మ సంబరాలు అలరించాయి. విద్యార్థినీలు రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి సాంప్రదాయ దుస్తులలో తరలి వచ్చి సంబరాల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను చాటి చెప్పే విధంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ బతుకమ్మలకు, సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆదర్శ విద్యాసంస్థల ఛైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ జనగామ కృషిత, విద్యార్తులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజేపి సత్తా చాటాలి

## -సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ జన్నె మొగిలి

*చిట్యాల, అక్టోబర్ 1, ప్రభాతవార్త*



త్వరలో రానున్న స్థానిక సంస్తల ఎన్నికల్లో బిజేపి సత్తా చాటుతూ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలని బిజేపి సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ జన్నె మొగిలి అన్నారు. మండలకేంద్రంలో బిజేపి మంల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా కన్వీర్ జన్నె మొగిలి మాట్లాడుతూ..ప్రపంచ, దేశ వ్యాప్తంగా ప్రధాని మోడి గాలి వీస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తుందని గుర్తు చేశారు. మోడీ పరిపాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని స్పష్టం చేశారు. ప్రతి భారతీయుడు జాతీయ పార్టీ అయిన బిజేపిని ఆదరించి, ప్రధాని మోడికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను గడపగడపకు చేర్చి పార్టీ అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గజనాల రవీందర్, యువ మోర్చా మండల అధ్యక్షుడు మైదం శ్రీకాంత్, ఎస్టీ మోర్చ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, శక్తి కేంద్ర ఇంచార్జ్‌లు చింతల రాజేందర్, చిన్నవేని సంపత్, సారంగం, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ అంబేద్కర్ డిగ్రీ అడ్మిషన్ల గడువు పెంపు

*గార్ల, అక్టోబర్1 ప్రభాతవార్త:*

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి డిగ్రీ బిఏ, బికాం, బిఎస్సి కోర్సులలో అడ్మిషన్లకు గడువు ఈనెల15వ తేది వరకు పొడిగించినట్లు గార్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో పెర్కొన్నారు. గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్ 211లో ప్రవేశం పొందగోరు విద్యార్థులు మీసేవా కేంద్రంలో ఆన్‌లైన్ ధరఖాస్తులు చేసుకొని ధరఖాస్తు ఫారం, ఒరిజినల్ సర్టిఫికేట్లు, ఒక జత జీరాక్సు సెట్‌ను తీసుకొని స్టడీసెంటర్‌లో సంప్రదించి వెరిఫికేషన్ చేసుకోగలరని సూచించారు. పూర్తి వివరాలకు 7382929811 సెల్‌నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ పెర్కొన్నారు.

# పదేండ్ల కళను పది నెలల్లో పూర్తి చేశా

**-ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**

ప్రభాతవార్త- బాలసముద్రం:

పదేళ్లలో కలలు కన్న చరిత్ర నీది- పది నెలల్లో పడిలేచిన కెరటంలా అభివృద్ధి చేసిన చరిత్ర నాదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం.. బీసీ ఐక్యత అంటున్న నువ్వు నీ చుట్టూ ఒక్కరన్న బీసీలను ఎదగనిచ్చావా అని ప్రశ్నించారు. నీ వెంట ఉన్న పుప్పాల ప్రభాకర్, సాంబయ్యలను ఎంత అనగదొక్కినవో మాకు తెలువదా అన్నారు. నేను రెడ్డి అయినా నా చుట్టూ మొత్తం బీసీ నేతలే ఉంటారు చూడు.. నా దగ్గర అన్ని కులాల వాళ్లు ఉన్నారు. కానీ నీ దగ్గర కులాలు ఏంటంటే కబ్జాల కులం, దోపిడి కులం, గుండాల కులం, కాంగ్రెస్ వాళ్లు గుండాలు, రౌడీలు అంటున్నావ్, నిన్న జరిగిన తంతులో నువ్వు కొట్టిచ్చిన తోట పవన్ ఉన్నాడు. ఆయన గుండాన.. అవును నేను ఆస్ట్రేలియా పర్యటనకు పోయిన అక్కడ పదేండ్ల తెలంగాణ ఉత్సవాలకు నాకు ఆహ్వానంయ వస్తే కుటుంబంతో పోయిన మాట వాస్తవమే.. ఆస్ట్రేలియా పర్యటనకు నన్ను



ఆహ్వానించింది. నీ కవితక్క, మాజీ శిష్యుడు, నీ బాధితుడు కొరబోయిన విజయ్, అక్కడ నీ గురించి, నీ పార్టీ గురించి బాధితులు అంటున్న మాటలు నువ్వు, నీ గురువు చచ్చిపోవాలి. నవ్వు కోడకు ఉన్న దాన్ని తీసావ్ అంటున్నావ్ నేను తీస్తే నువ్వు మళ్లీ మద్రాస్‌కి పోవాలి బిడ్డ గుర్తుంచుకో.. నీ రాజకీయ నేపథ్యం కబ్జాలు, వసూళ్లు, గుండాగిరి.. ఇది నీకు నేను ఇచ్చే చివరి సమాదానం. బిడ్డా.. గుర్తుపెట్టుకో కడుపు మండిన వాళ్ల కంటే పెద్ద గుండా ఎవరు ఉండరు.. తీరు మార్చుకో, కబ్జాలు చేసిన భూములను తిరిగి ఇచ్చేయ్. నీ వ్యక్తిగత జీవితం దెబ్బకొట్లోద్దు అని చూస్తున్న వినయ్..? నా ఫోన్ తెరిస్తే నీ బ్రతుకు శంకరగిరి మాన్యాలే గుర్తుపెట్టుకో.. నా సహనాన్ని పరిక్షించకు నేను నోరు విప్పితే నీ పార్టీలో నిన్ను ఉంచరు యాదుంచుకో... వినయ్ అండ్ కో టీం ఇప్పటికైనా తీరు మార్చుకోండన్నారు. నా దగ్గర ప్రత్యక్ష ఆధారాలు ఉన్నాయి. మీరు ఎవరిని ఎక్కడ బెదిరింపు చేశారో, ఎవరి భూములను లాక్కున్నారో అన్ని ఉన్నాయి. 25 శాతం పనులు మీరు చేస్తే 75 శాతం పనులను నిధులు సమకూర్చి కాళోజి కళాక్షేత్రం పూర్తి చేసినం, నేను మీరు చేసిన కొద్దోగొప్పో పనులను చెప్తున్నా.. అసలు ఏమిచేయని నాయిమ్ నగర్ బ్రిడి ప్రజలను నేను చేసిన చెప్పుకోవడం నీ రాజకీయ విజ్ఞతకే వదిలేస్తున్న నువ్వు నాకు 48 గంటలు ఇవ్వడం కాదు నేనే 12 గంటలలో పూర్తి ఆధారాలతో మీడియా ముఖంగా నిరూపిస్తా.. గతంలో నీ అనుచరులు పెద్దమ్మగడ్డ శ్మశాన వాటిక కూల్చివేసిన దోషులపై కేసు నమోదు చేయించిన. మరి పెద్దమ్మగడ్డ బాధితులకు ఆ రోజు నువ్వు ఏమి చేశావ్ ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకో అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సీ పుల్లా పద్మావతి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ పాల్గొన్నారు.

## నవోదయ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

శాయంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త



శాయంపేట మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మామిడి అనురాధ, ప్రిన్సిపాల్ మామిడి పృథ్వి ఆధ్వర్యంలో విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మను తయారు చేసి ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పృథ్వి మాట్లాడుతూ ఇలాంటి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లల్లో తెలంగాణ యొక్క సాంస్కృతిని ముందు తరాలకు తెలియజేసినట్లుగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, రాజేందర్, సందీప్, వెంకట్, స్వాతి, నాగలత, ప్రసూన్న, జయ, మాధవి, మౌనిక, సంధ్య, సౌమ్య, విద్య, జ్యోష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

ప్రభాతవార్త- సుబేదారి:



హైదరాబాద్ గాంధీ భవన్‌లో గాంధీ జయంతి పురస్కరించుకొని బుధవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవదళ్ అధ్యక్షులు మద్దెల జితేందర్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ సేవాదళ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు మంగళవారం తెలిపారు. మోహన్‌గౌడ్ మాట్లాడుతూ ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ హాజరవుతున్నట్లు చెప్పారు. వరంగల్ జిల్లాలో సేవాదళ్ కార్యకర్తలు రక్త దాన శిబిరానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని హోన్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేయడమే మా లక్ష్యం

**-మాజీ ఎంపిపి మెతుకు తిరుపతిరెడ్డి**

శాయంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త



శాయంపేట మండలం గోవిందాపూర్ బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటిని ఎన్నుకున్నట్లు మాజీ ఎంపిపి మెతుకు తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాభోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా మంగళవారం గోవిందాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ విస్తృత సమావేశం నిర్వహించి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ పార్టీ అధ్యక్షునిగా దాసి శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నర్ర రాజు, ఉపాధ్యక్షులు బొత్స మహేందర్, బైరి రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి రాజేశ్వరరావు, ప్రచార కార్యదర్శి కాల్వల సతీష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, మాజీ మండల అధ్యక్షులు గుర్రం రవీందర్, మాజీ ఎంపిటిసి, ఎంపిసిల ఫోరం అధ్యక్షులు మేకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ప్రసాద్, బైరి శ్రీను, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ, గడిపె విజయ్, మోహన్, కరుణ్‌బాబు పాల్గొన్నారు.

## ఘనంగా పూల పండుగ

ప్రభాతవార్త- సుబేదారి:

బతుకమ్మ పండుగను పురస్కరించుకొని బాలసముద్రంలోని శ్రీనివాస గురుకుల పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ముందస్తుగానే పూల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు వివిధ రకాల పూలను, తంగేడు, టేకు పూలతో పెద్ద బతుకమ్మను పేర్చి దాన్ని చుట్టు సాంప్రదాయా నృత్యాలు, చేస్తూ బతుకమ్మ పాటలు పాడుతూ ఆనందించారు. బతుకమ్మ పండుగ యొక్క విశిష్టతను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. ఈ ఉత్సవానికి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. పిల్లలతో పాటు వారి మాతృమూర్తిలు కూడా పిల్లలతో జత కలిసి నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యుగేందర్, ఉపాధ్యాయులు వినయ్, విజయ్, రజినీకాంత్, సురేష్, ప్రసాద్, లింగారెడ్డి, మహేష్, అనురాగ్, అనూష, గీత లావణ్య, మానస, నవ్యస్ఫూర్తి, సింధూజ, కిర్పాల్‌కార్ రాధిక, రజిని పాల్గొన్నారు.




## చైర్మన్ మకు న్యాయం చేయాలి

**-ఆవేదన వ్యక్తం చేస్తున్న మత్స్యకార్మికులు**

శాయంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త



చలివాగు ప్రాజెక్టులో కొందరు వ్యక్తులు మాత్రమే చేపలు పట్టి స్వార్ధపూరితంగా లాభం పొందుతున్నారని మత్స్యశాఖ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మాందారిపేట, శాయంపేట, పెద్దకొడపాక గ్రామాల మత్స్య కార్మికులు సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ చైర్మన్ గండి రాజమౌళి ఎన్నికల ముందు కార్మికుల అందరికీ న్యాయం చేస్తానని హామి ఇచ్చినట్లు తెలిపారు. మూడు సార్లు జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించినప్పటికీ మత్స్య కార్మికులకు న్యాయం చేయడం లేదని వాపోయారు. 1400 మంది ఓటర్లు ఉన్నారని అందులో 50మంది మాత్రమే చలివాగు ప్రాజెక్టులో చేపలు పట్టుకుంటున్నారని మిగతా వారికి అవకాశం లేకుడా పోయిందని అసహనం వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి ఏడు లక్షలు చెరువుల రకం చెలినంచినట్లు తెలిపారు. చేపలతో జీవనం కొనసాగించే మత్స్య కార్మికులు ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నట్లు అన్నారు. ఇప్పటికైనా చైర్మన్ రాజమౌళి జోక్యం చేసుకొని మత్స్యకార్మికులందరికీ తగు న్యాయం చేసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. బండారు పైడి, కుక్కల పెద్ద సంతోష్, నిమ్మల రాజు, నిమ్మల ముత్తయ్య, సాదు కుమారస్వామి, కూరాకుల శ్రీధర్ పాల్గొన్నారు.

## మిషన్ భగీరధ ఇంటింటికి నల్ల కార్యక్రమంలో శిక్షణ తరగతులు

**-ఎంపీడీవో ఎన్.విజయ్ కుమార్**

ప్రభాతవార్త ఎల్కతుర్తి:

ఎల్కతుర్తి మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎన్.విజయ్‌కుమార్ అధికారులు విలేఖర్లతో ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇంటింటికి నల్ల శాశ్వత పరిష్కారం అనే అంశంపై ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమానికి గ్రామీణ స్థాయి మంచినీటి సహాయకుడి శిక్షణ కార్యక్రమం ఉంటుందని మిషన్ భగీరధ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ శిక్షణ నాలుగు రోజులపాటు ఎంపీడీవో కార్యాలయంలో ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఏఈ శభాష్ రెడ్డి, ట్రైనర్ ప్రవీణ్ మాట్లాడుతూ.. రెండో రోజు పైప్లైన్ మరమ్మతులు, మూడో రోజు ఎలక్ట్రికల్, నాలుగో రోజు నీటి నాణ్యత అనే అంశాలపై శిక్షణ ఇచ్చి సభ్యులకు ధ్రువీకరన పత్రం అందజేయడం జరుగుతుందని మిషన్ భగీరధ ఏఈ సుభాష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరధ గ్రిడ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.శ్రీనివాస్, గ్రిడ్ ఏఈ ఏ.రాము, మిషన్ భగీరధ ఇంట్రా ఏఈ దొడ్డ సుభాష్ రెడ్డి, ట్రైనర్ బి.ప్రవీణ్, మిషన్ భగీరధ హెల్పర్స్ కె.ఆదిలక్ష్మి, మద్దె మొండయ్య పాల్గొన్నారు.



# బీసీలకు రాజ్యాధికారం రావాలంటే ఐక్యంగా ఉండాలి

**చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించాలి**
**చట్ట సభల్లో ఎంఎల్ఏ, ఎంఎల్‌సీలు ఉండాలి**
**బీసీల అధికారం రావాలంటే రాజకీయ పార్టీ అవసరం**
**జనాభా దామాషా ప్రకారం రాజ్యాధికారం ఇవ్వాలి**
**బీసీల కుల గణనను తెలంగాణ ప్రభుత్వం చేపట్టాలి**
**తెలంగాణ రావడంలో సకల జనుల సమ్మెలో పాల్గొన్నారు**
**పోరాడింది బీసీలు, అధికారం చేజిక్కుంచుకున్నది అగ్రకులాలు**
**అడుక్కునే స్థాయి నుండి ఇచ్చే స్థాయికి బీసీలు ఎదగాలి**
**మాజీ ఎంపీపీ, బీసీ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాడపు దేవేందర్**

**ములుగు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** బీసీలకు రాజ్యాధికారం వచ్చినప్పుడు అందరు బాగుపడుతారని బీసీ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ ఆశాడపు దేవేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని సోమాజీ గూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ సమాజ్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుని హోదాలో బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్‌లు మరియు రాజ్యాధికారం సాధించాలని మాట్లాడటం జరిగింది. చట్ట సభల్లో ఎంఎల్ఏలు, ఎంఎల్‌సీలు, రాజ్య సభ సభ్యులు అధిక మొత్తంలో ఉండాలని అప్పుడే రాజ్యాధికారం వచ్చి బీసీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సమాజంలో నూటికి 70 శాతం మంది బీసీలు ఉన్నారని అలాంటిది రాజ్యాధికారంలో కేవలం 25 శాతం మాత్రమే ఉన్నారని ఆయన అన్నారు. బీసీల కు అధికారం రావాలంటే బీసీలు అందరు ఐకమత్యంగా ఉండాలని, అప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆయన పిలుపునిచ్చారు. బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు కల్పించాలని బడ్జెట్ సైతం కేటాయించాలని, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీల కుల గణనను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని, వారి జనాభా శాతం తేల్చి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు పెంచాలని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో బీసీలు సకల జనుల సమ్మెలో పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడింది బీసీలు రాజ్యాధికారం చేజిక్కించుకున్నది అగ్రనాయకులని ఆశాడపు దేవేందర్ తెలిపారు. అడ్డుకునే స్థాయి నుండి అధికారం చేజిక్కునే స్థాయికి బీసీలు ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీలు అంతా ఐకమత్యంతో ఉండి రాజ్యాధికారం చేజిక్కునే దిశగా అడుగులు వేయాలని ఆశాడపు దేవేందర్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీసీలు అంతా ఐకమత్యంగా ఉండి ఒక రాజకీయ పార్టీ ఏర్పాటు చేసుకొని మనమే రాజ్యాధికారం దక్కించుకొని చట్టాలు తయారు చేసి దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# గౌడ కులస్థుల ఆత్మీయతను చూరగొన్న పెద్ద మనిషి



**రెండవ సారి గౌడ సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన గట్టు శంకర్**
**తాత వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న యువ నాయకుడు**

**వెంకటాపూర్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో జరిగిన గౌడ సంఘం అధ్యక్షునిగా గ్రామానికి చెందిన గట్టు శంకర్ గౌడ్ అధిక మెజార్టీతో ఎన్నికయ్యారు. ఆయన చేసిన మంచి పనులను దృష్టిలో ఉంచుకొని సంఘ సభ్యులు అతనికి 65 ఓట్లు వేసి రెండవ సారి గెలిపించుకున్నారు. ఉపాధ్యక్షునిగా మేరుగు మల్లయ్య, డైరెక్టర్లుగా బుర్ర సదానందం, బుర్ర అశోక్, వీరగాని రమేష్, మామిండ్ల సంపత్, పెరుమాండ్ల విక్రం, కొండ శంకర్, జనగాం రవి, కారుపోతుల చిన్న రాజు, కొండ తిరుపతి, కాసగాని ఓదెలు, చిర్ర హరీష్, చిర్ర గణేష్‌లు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో గౌడ సంఘం నాయకులు గట్టు కుమార స్వామి, గట్టు చిన్న రాజయ్య, చిర్ర వీరయ్య, రాజు, తుఫాన్, రావర్తి రమేష్, కారుపోతుల యాదగిరి, చర్లపల్లి సతీష్, అంతటి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా గట్టు శంకర్ తాత గారైన గట్టు లక్ష్మయ్య సుదీర్ఘ కాలం గౌడ సంఘం అధ్యక్షునిగా పనిచేశారు. ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ముందుకు పోతున్నాడు.

**గౌడ కులస్థుల సంక్షేమానికి పాటుపడుతా**
**నూతన అధ్యక్షులు గట్టు శంకర్ గౌడ్**



లక్ష్మీదేవిపేట గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని గట్టు శంకర్ గౌడ్ అన్నారు. అధ్యక్షునిగా భారీ మెజార్టీలో ఓట్లు వేసి గెలిపించుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా పట్ల మీరు చూపించిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కొత్తగా సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సభ్యత్వం వచ్చేలా పాటుపడుతానని ఆయన తెలిపారు.




## జంపన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 70 మంది నిరుపేదలకు కంటి ఆపరేషన్లు

**ములుగు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :**



జంపన్న చారిటబుల్ ట్రస్టు ఇప్పుడు పేదలకు వరంగా మారింది. జంపన్న ట్రస్ట్ ప్రారంభించిన కొద్ది కాలంలోనే ప్రజల్లో మంచి ఆదరణ పొందుతుంది. నిరుపేదలకు తనవంతు సహకారం అందించాన్నదే లక్ష్యంగా జంపన్న చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ భూక్య జంపన్న నాయక్ కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వృద్ధులకు ఒక పెద్ద కొడుకు వలె ఆలోచించి హైదరాబాద్ శంకర కంటి హాస్పిటల్ సిబ్బందితో ములుగు జిల్లాలోని తన కార్యాలయంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వృద్ధుల కోసం మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి 300 మందికి ఆదివారం అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. మొదటి విడతలో భాగంగా సోమవారం 70 మందికి హైదరాబాద్‌లోని శంకర్ కంటి హాస్పిటల్‌లో ఆపరేషన్ నిర్వహించారు. భూక్య జంపన్న నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసి శంకర్ కంటి ఆసుపత్రికి తరలించి ఆయన కూడా ఆసుపత్రికి చేరుకొని ఆయన ఆధ్వర్యంలో ఆపరేషన్‌లు నిర్వహించారు. వృద్ధుల యోగక్షేమాలు చూసుకుంటూ కంటి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసుకుని దగ్గరుండి మంగళవారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ చేరుకున్నారు. కంటికి ఆపరేషన్ చేయించుకున్న వృద్ధులు, మహిళలు మాట్లాడుతూ జంపన్న అందించిన సహకారం మేము జీవితంలో ఎన్నడు మరిచిపోలేమని తెలిపారు. ఆపరేషన్ కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా మంచి వసతి, భోజనం కల్పించి ఒక కన్న కొడుకులా చూసుకున్న జంపన్న నాయక్ ఇంకా మాలాంటి పేదలకు సహాయం చేస్తూ ముందుకెళ్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నామని వారు తెలిపారు.

## గ్రామపంచాయతీ వర్కర్ సాంబయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**ములుగు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :**



ములుగు మండలంలోని మల్లంపల్లి గ్రామపంచాయతీ వర్కర్ అయిన ఇనుముల సాంబయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ములుగు ఎంపీడీఓకు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఈఐటిసి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎండీ. అంజాద్ పాషా పాల్గొని మాట్లా డుతూ గ్రామ పంచాయతీ పరిధిలో వర్కర్‌గా చేరి ట్రాక్టర్ నడుపు కుంటూ వేతనాలు ఓ నెల వచ్చిన రాకపోయినా పనిచేస్తున్న సాంబయ్యకు ప్రమాదవశాత్తు దెబ్బలు తగిలి పక్కటెముకలు విరగడం జరిగింది. కావున రాష్ట్ర ప్రభుత్వం సాంబయ్యకు వైద్య చికిత్స అందించి ఆదుకోవాలని స్థానిక ఎంపీడీఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి గుడిమల్ల సదయ్య ఏఐటియుసి మండల కార్యదర్శి పూద రమేష్ గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు మామిడి సుధాకర్, ఆర్.ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం అన్ని కమిటీలు రద్దు

**ములుగు జిల్లా అధ్యక్షులు నక్క బిక్షపతి**



ములుగు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ములుగు జిల్లాలో అన్ని డివిజన్లు, మండల, గ్రామ కమిటీలు రద్దు చేసినట్లు అంబేద్కర్ జిల్లా సంఘం అధ్యక్షులు నక్క బిక్షపతి తెలిపారు. ములుగు జిల్లాలోని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ అనిన మండలాల గ్రామ కమిటీలను రాష్ట్ర అధ్యక్షుల అనుమతితో రద్దు చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు నక్క బిక్షపతి తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానాలను ముందుకు తీసుకుపోయేలా నూతన కమిటీలను రానున్న రోజుల్లో వేసుకుంటామని అప్పటి వరకు ఎలాంటి కమిటీలు లేవని తెలిపారు. త్వరలో మండల స్థాయి, గ్రామ స్థాయిలో కమిటీలు బలోపేతం చేయుటకు సంఘ నాయకులు ముందుకు రావాలని నక్క బిక్షపతి పిలుపునిచ్చారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన బీసీ సమాజ్ నాయకులు

**ములుగు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :**



బీసీ సమాజ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాడపు దేవేందర్ ప్రజాపతి ఆధ్వర్యంలో మంగళవారం రోజు ములుగు జిల్లా కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కుమ్మరి సంఘం కమ్యూనిటీ హాలు, కుమ్మరి వృత్తి దారులకు ఆర్థిక సాయం కోసం జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి బాబురావు, ఓదెల శరత్, పైడిపాల కుమార్, పైడిపాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# పసర గ్రామంలో మౌలిక సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ధర్నా

**గోవిందరావుపేట, అక్టోబర్ 01, ప్రభాతవార్త :** పసర గ్రామంలో మౌలిక సమస్యలు పరిష్కరించాలని, పంచాయితీ అధికారులు నిర్లక్ష్యం విడనాడాలని సిపిఎం పార్టీ ములుగు జిల్లా కమిటీ సభ్యుడు గొంది రాజేష్ అన్నారు. మంగళవారం సిపిఎం పార్టీ పసర గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పసర గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం ఆదిరెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో 4,5,6,7,8,9 వార్డుల్లో చెత్తచెదారం పేరుకుపోయి దోమలు ఈగలు స్వైర విహారం చేస్తున్నాయని అన్నారు. దీంతో మలేరియా టైఫాయిడ్ డెంగ్యూ జ్వరాలు సోకి వందలాదిమంది మంచం పట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం విడనాడి గ్రామంలో ఫాగింగ్ చేపట్టాలని అదేవిధంగా గ్రామ పరిసరాలలో గడ్డి మందు పిచికారి చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పసర రాంపూర్ బొడ్రాయి హైవే రోడ్డు పై వీధి దీపాలు వెలగక 8 నెలలు అవుతుందని, 10, 11, 12 వార్డుల్లో వీధి దీపాలు లేక వీధులన్ని సిమ్మ చీకట్లు కమ్ముకున్నాయని ఆయన అన్నారు. దసర పండగ వస్తున్నందున గ్రామంలో అన్ని వీధుల్లో విద్యుత్ దీపాలు అమర్చాలని కోరారు. ఎర్రకుంట స్మశాన వాటికకు సంబంధించిన మోటార్ చెడిపోయి 15 రోజులైనా ఇంతవరకు రిపేరింగ్ చేయించలేదని వెంటనే అధికారులు మోటార్ రిపేరు చేయించి నీళ్ల వచ్చే విధంగా చూడాలని కోరారు. లేని యెడల ఆందోళన ఉధృతం చేస్తామని



హెచ్చరించారు. అనంతరం గ్రామ పంచాయతీ అధికారులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట మండల ప్రధాన కార్యదర్శి తీగల ఆగిరెడ్డి, మండల కమిటీ సభ్యుడు సోమ మల్లారెడ్డి గ్రామ కార్యదర్శి కడారి నాగరాజు పిఎసిఎస్ డైరెక్టర్ సప్పిడి ఆదిరెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు జుట్టబోయిన రమేష్, సువర్ణ, సరళ, యానాల ధర్మారెడ్డి, కళ్లెం నారాయణరెడ్డి, ఎర్రలక్ష్మీనారాయణ, మొగిలి, మహేష్, అశోక్, అంజనేయులు, మహిళా సంఘం నాయకురాలు, మంచాల కవిత, కౌసల్య, పాయం శారద, కలమ్మ, నాగేశ్వరమ్మ, ముత్తక్క, మేకల ఐలయ్య, సామ సమ్మక్క, బషిక కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# గాలికి వదిలేసిన మేడారం సమస్యలు





**మరో నాలుగునెలల్లో మినీ మేడారం జాతర**

**పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్న ఆయాశాఖల అధికారులు**

**నీడ లేక ఎండలోనే అవస్థలు పడుతున్న భక్తులు**

**పట్టణాలకే పరిమితమైన ఎండోమెంట్ అధికారులు**

**తాడ్వాయి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** లక్షలాది మంది భక్తులు మేడారంలో నెలకొన్న సమస్యలను గాలికి వదిలేశారనే ఆరోపణలు వస్తున్నాయి. బుధ, గురు వారాల్లోనే కాకుండా సెలవుదినమైన ఆదివారం సైతం ఇసుక వస్తే రాలని విధంగా భక్తులు లక్షలలో వస్తున్నారు. రోడ్లన్నీ భక్తుల వాహనాలతో నిండుతున్నాయి. చిలకల గుట్ట, ఐటిడిఏ క్యాంపు కార్యాలయం ఆవరణ, జంపన్నవాగు ఏరియా, ఆర్టీసీ వై జంక్షన్ ఏరియాల్లో వాహనాలు నిలుపుకుంటున్నారు. గద్దెలపై దేవతల దర్శనం అనంతరం పరిసరాల్లోకి వెళ్తున్నారు. గద్దెలపైన బరకాలు సక్రమంగా లేకపోవడంతో ఎండలోనే దైవదర్శనం చేసుకుంటున్నారు. అదే విధంగా గద్దెల ఆవరణలో సైతం గోనె తట్టలు వేయలేదు. ఎండ తీవ్రత వల్ల కాళ్లు కాలి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండోమెంట్ అధికారులు మేడారాన్ని వదిలేసి పట్టణాలకే పరిమితమైయ్యారని విమర్శలు వస్తున్నాయి.

**మరో నాలుగు నెలల్లో మినీ మేడారం జాతర :**

వచ్చే ఫిబ్రవరిలో మినీ జాతర ఉంటుంది. మరో నాలుగు నెలలు మాత్రమే ఉంది. రెండు దఫాలుగా జారతపై నిర్వహించిన సమస్యల్లో జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ అధ్యక్షతన స్త్రీ ,శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సమస్యలపై దృష్టి పెట్టాలని అధికారులను హెచ్చరించారు. మినీ మేడారం సమీపిస్తుంది. ఆయా శాఖల అధికారులు చాలా జాగ్రత్తగా ఉండాలని, పదే పదే ఆదేశాలు జారీ చేశారు. భక్తులరద్దీ రోజు రోజుకు పెరుగుతోంది. అయినప్పటికీ అధికారులు ఆ చెవితో వినడం, ఆ చెవితో వదలడం పరిపాటిగా మారింది. జాతరపై ఎంత నిర్లక్ష్యమో ఇట్టే అర్థమవుతుంది. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి సమస్యలపై దృష్టి పెడితే బాగుటుంది.

**భక్తుల్లో పెరుగుతున్న అభద్రతా భావం :**

మేడారం వచ్చిన భక్తులకు భద్రత లేక పోవడంతో అభద్రత భావంలో ఉంటున్నారు. పోలీస్ అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవడంలో కొద్ది మందిని మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం రోజు అయితే ఇసుక వేస్తే రాలని విధంగా భక్తులు వస్తున్నారు. దొంగలు చోరికి పాల్పడే అవకాశాలు న్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. గదెదల ప్రాంతం జంపన్నవాగు, ఐటిడిఏ క్యాంపు ఆవరణ ఏరియాల్లో పోలీసులను అధికంగా ఉంచినట్లయితే దొంగల బెడదను నివారించేందుకు ఆస్కారం ఉంటుంది. గతంలో కూడా ఆదివారం రోజున గుర్తు తెలియని వ్యక్తులు గద్దెలపైకి దర్శనం చేసుకుంటున్న మహిళ మెడపై గొలుసు, మరో భక్తుడి జేబులో పర్సును కొట్టేసిన సంఘటన విధితమే. దొంగలను దృష్టిలో పెట్టుకొని పోలీసు అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు

# సీతారామచంద్రస్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక

**ఏటూర్‌నాగారం, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామివారి ఆలయ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులుగా అలువాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కత్తెర శ్రీనివాస్,ఉపాధ్యక్షులుగా దన్నపునేని కిరణ్, చెన్న రాంబాబు, కోశాధికారిగా తాడూరి దీన బాంధవ స్వామి, సహాయ కార్య దర్శిగా గద్దం వినయ్, ప్రచార కార్య దర్శులుగా పెండ్యాలసంతోష్, సిరిపురం చంద్రశేఖర్, సహాయ ప్రచార కార్యదర్శిగా సిసింద్రి, సాంస్కృతిక కార్య దర్శులుగా బాల్నె ప్రసాద్, బాలాజీ బ్రహ్మం, ఇర్ప వడ్ల భిక్షపతి, కార్యవర్గ సభ్యులుగా సర్వ అక్షిత్ కుమార్, భట్టు రమేష్, గద్దం మహేష్, అంగాల వీరన్న, మామిడి రాంబాబు, శ్రీనివాస్, కొండల్, కృష్ణ, రమేష్, శివుడు, వెంకటేష్, మధు, శివ, సతీష్‌లు ఎన్నుకున్నారు. గౌరవ



సలహాదారులుగా కాకులమర్రి చక్రధరరావు, ఇర్ప వడ్ల వెంకన్న, తుమ్మ మల్లారెడ్డి, నూకా ప్రభాకర్, తాడూరి రఘు, పో గుల లక్ష్మీనారాయణ, నూతి రమేష్, దేవేందర్, అశోక్, లాలయ్య, రమేష్, రమేష్, సంపత్‌రావు, సాంబయ్య, వెంకటేశ్వర్‌రావు తదితరులు ఎన్నికైనారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని త్వరలోనే ఆలయ ప్రహరీ గోడ నిర్మాణం, యాగశాల, పంక్షన్‌హాల్‌నిర్మాణ పనులు చేపడతామని అన్నారు. తన కమిటీకి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఏటూర్‌నాగారం వార్త

# అన్నారం డబుల్ ఇండ్లకు మోక్షం ఎప్పుడో....?

**లక్షలతో నిర్మించి లక్షణంగా వదిలేసిన వైనం**

**సంబంధిత శాఖ అధికారుల పట్టింపేది .... ?**

**నిల్వ నీడ లేక ఇబ్బందులు పడుతున్న లబ్దిదారులు**

**ప్రజా ప్రతినిధులకు పట్టింపే లేదు ..**

**నిర్లక్ష్యంగా అధికారులు**

**లబ్దిదారుల ఘోష తగులుతుందని ఆరోపణలు**



**తాడ్వాయి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** పేద ప్రజలకు నీడ కల్పించుటకు మంజూరైన డబుల్ ఇండ్లకు మోసం ఎపేఉడు కలుగుతుందో అని ప్రశ్నిస్తు న్నారు. మండలంలోని గంగారం గ్రామ పంచాయతీలో 40 మంది లబ్దిదారులకు గతంలో ఇండ్లు మంజూరైనాయి. ఒక్కొక్క ఇంటికి రూ. 5.30 లక్షల వంతున 20 మంది లబ్దిదారులకు అన్నారంలోగల ప్రభుత్వ భూమిని ఎంపిక చేసి నిర్మించారు. ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి దశలో ఉన్నాయి. ఇంకా కావాల్సి న పనులు చాలా ఉం దగా, ఇండ్ల నిర్మాణానికి కావాల్సి న డబ్బులను కమిటీ సంఘం పంచాయతీరాజ్ శాఖ ఏఇ జాయింట్ ఎకౌంట్‌లో వేశారు. అసంపూర్తిగా మిగిలిన పనులను పూర్తి చేసి లబ్దిదారులకు అప్పటించాలని పలు దఫాలుగా కోరారు. ఇప్పటి వరకు డబుల్ ఇండ్లను అసంపూర్తిగానే వదిలేశారు. ప్రజా ప్రతినిధులు కానీ, అధికారులు కానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదంటున్నారు. ఇండ్లు మంజూరైన లబ్దిదారులు ఎప్పుడు ఇళ్లలోకి వెళతామోనని ఆనందంతో ఎదురు చూస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా పట్టించుకోవడం లేదు. ఇళ్లు నిర్మించినప్పటికీ చేయాల్సి న పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. చాలా ఏళ్లుగా ఇండ్ల నిర్మాణ పనులు నిలిచి పోయాయి. పంచాయతీ రాజ్ శాఖ అధికారి పనుల బాధ్యతలు అప్పగించాలి. అతనే మిగతా పనులు చేయాల్సి న బాధ్యత ఉందంటున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయితే లబ్దిదారులు ఇళ్లలోకి చేరుతామని అంటున్నారు. కాలయాపనతోనే కాలం గడస్తుందని ఆరోపిస్తున్నారు. పనులు పూర్తయితే లబ్దిదారులకు న్యాయం చేసిన వారవుతారు.

# విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

**ఏటూర్‌నాగారం, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** మనం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మారుమూల గిరిజన ప్రాంతాలైన చింతలపాడు, బూటారం, ఎక్కెల గ్రామాలలోగల అంగన్‌వాడీ కేంద్రాల్లోని 30 మంది చిన్నారులకు మనం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు



చౌలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మనం వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి చౌలం వికాష్, కుర్సం శశికుమార్, ఎసిడిపివో ప్రేమలతో సూపర్ వైజర్ అఫ్రిన్, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సహాయకులకు శిక్షణ

**గోవిందరావుపేట, అక్టోబర్ 01, ప్రభాతవార్త :** గోవిందరావుపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నాడు ఏర్పాటు చేయడం జరిగింది. మంచినీటి సహాయకులకు నాలుగు రోజులు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, మంగళవారం నాడు వాటర్ క్వాలిటీ సరఫరాపై అవగాహన కల్పించామని, మిగతా మూడు రోజులలో హ్యాండ్ పంప్స్ మోటార్లు వాటి ఉపయోగంపై శిక్షణ ఇవ్వబడునని ఎస్.ఇ. మల్లేష్ తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ మల్లేష్, డిఈ ఇంట్ర సునీత, డిఈ గ్రిడ్ సతీష్, ఏఈ ఇంట్రా హారిక, ఎంపీడీవో జి. జవహర్ రెడ్డి మరియు ఎంపి ఓ శరత్ బాబు, పంచాయతీ కార్యదర్శులు 18 గ్రామ పంచాయితీల మంచి నీటి సహాయకులు పాల్గొన్నారు.

# ప్రాధాన్యత రంగాలకు రుణాలు

**- జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా**

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ : ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా అన్నారు. మంగళవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా అధ్యక్షతన రుణాలు మంజూరు, రుణాలు రెన్యువల్, తదితర అంశాలపై బ్యాంకర్లతో జిల్లాస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీ జరిగిన రైతులకు తిరిగి రుణాలు అందేలా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. రుణ లక్ష్య సాధనలో బ్యాంకర్లు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. రైతు వేదికలో ప్రతీనెలా




సమావేశాలు నిర్వహించి రుణ ప్రగతి సాధించేందుకు మండల వ్యవసాయ అధికారులు కృషి చేయాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలు మహిళా శక్తి రుణ లక్ష్యసాధన 120శాతంగా ఉండాలని సూచించారు. ఈ సమన్వయ సమావేశంలో డీఆర్‌డీవో వసంత, ఆర్బీఐ ఏజీఎం శ్రావ్య, నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, ఎల్డీఎం శ్రీధర్, డీఏవో రామారావునాయక్, ఇతర బ్యాంకు అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణకు ప్రభుత్వం కృషి

**-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**-చెల్పూర్‌లో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన కలెక్టర్**

గణపురం, అక్టోబర్ 1, ప్రభాతవార్త



మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణకు ప్రభుత్వం కృషి చేస్తుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం మండలంలోని చెల్పూర్‌లో ఏర్పాటు చేసిన మిల్లెట్ చిరుధాన్యాల ప్రాసెసింగన యూనిట్‌ను ఆయన పరిశీలించారు. మహిళా గ్రామ సమాఖ్య సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పున్‌ప్రారంభించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, డిపిఓ నారాయణ రావు, డీఆర్డీఓ అవినాష్, డిపిఎం రవి, ఏపీఎం కో-ఆర్డినేటర్లు వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.

## రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ

**- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

పాలకుర్తి, అక్టోబరు 1 ప్రభాతవార్త :



రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రైతన్నలకు భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల మండలాల పార్టీ ముఖ్యకార్యకర్తలచే సమీక్ష సమావేశాను మండలకేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన నియోజకవర్గం తొర్రూరు మండలకేంద్రంలో రైతు రుణమాఫీ సంపూర్ణంగా చేయాలని చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చి ఆరుపథకాలు అమలు చేయడంలో కాంగ్రెస్‌పార్టీ అట్టర్‌ఫ్లాఫ్ అయ్యిందని ఎద్దేవా చేశారు. దీనిపై ప్రతీ రైతు స్పందించి నియోజకవర్గంలో చేపట్టే ధర్నా కార్యక్రమానికి స్వచ్ఛందంగా రావాలని, రైతుబంధు, రైతు భరోసా ఎకరాకు రూ.15వేలు, రైతు కూలీలకు రూ.12వేలు రాలేదని, రైతులు పండించిన పంటకు క్వింటాళ్‌కు రూ.500 బోనస్ అదనంగా రాలేదని, ఎన్నికల సమయంలో అధికారం కోసం దాదాపుగా 420వరకు అసాత్యమైన 420హామీలుఇచ్చి నెరవేర్చడంలో తెలంగాణ కాంగ్రెస్‌పార్టీ విఫలమైందన్నారు. హైడ్రా పేరుతో హైడ్రామా ఆడుతు ప్రజలను దృష్టి మరల్చడానికి డైవర్ట్‌చేస్తు కాంగ్రెస్‌పార్టీ హైడ్రామా ఆడుతుందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నవీన్‌కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు కడుదుల కరుణాకర్‌రెడ్డి, మండలాల పార్టీ కమిటీ సభ్యులు మండలాల, గ్రామపార్టీల అధ్యక్ష, కార్యదర్శులు, రైతు కమిటీ నాయకులు, మహిళా నాయకులు, యూత్, సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం వివరాలు సేకరించాలి

**-ఎల్ఆర్ఎస్ ధరఖాస్తులను పరిష్కరించాలి**

**-వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

మహబూబాబాద్,అక్టోబర్1,ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలను పక్కాగా సేకరించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో వారు మాట్లాడుతూ ఈ నెల 3నుండి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ప్రతినియోజకవర్గంలోని ఒక మున్సిపల్, గ్రామంలో కుటుంబ వివరాలను ఇంటింటికి తిరిగి సేకరించాలని దీనికి నోడల్ ఆఫీసర్‌ను నియమించాలన్నారు. ఈ నెల 8లోపు పూర్తిచేయాలని 9న స్క్రూట్నీ ఉంటుందని, 10న రిపోర్ట్ సబ్మిట్ ఉంటుందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ధరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెండుపడక గదులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయో వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సన్నవడ్లకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 అదనంగా బోనస్ అందజేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి వడ్లను సేకరించాలన్నారు. రైతులకు ఏ ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబాబాద్ నుండి జెడ్పీసీఈవో నర్మద, ఆర్డీవోలు నర్సింహారావు, అలివేలు, ఏడీఎస్ఎల్ఆర్ నర్సింహామూర్తి, డిపిఒ హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు శాంతకుమార్, వెంకటేశ్వర్లు, నరేష్‌రెడ్డి, పౌరసరఫరాల అధికారిని కృష్ణవేణి, డిటిసిపిఓ పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ జీవన శైలిని మార్చుకోవాలి

**-వయోవృద్ధుల సంక్షేమంకై హెల్ప్‌డెస్క్ నెంబర్ 14567**

**-జిల్లా అధనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్‌టోప్పో**

మహబూబాబాద్,అక్టోబర్1,ప్రభాతవార్త:



మారుతున్న కాలానికి అనుగుణంగా సీనియర్ సిటిజన్స్ తమ జీవనశైలిని మార్చుకోవాలని జిల్లా అధనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్‌టోప్పో అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను 14567 నెంబర్‌ను ఏర్పాటు చేశామని ఎమైనా సమస్యలు ఉంటే తెలుపాలన్నారు. ప్రతి ఒక్కరు సీనియర్ సిటిజన్స్‌ను గౌరవించాలన్నారు. సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 1 వరకు ఈ వారోత్సవాలను నిర్వహించడం జరిగిందన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని గుర్తించి సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ అధికారిని వరలక్ష్మి, జెడ్పి సీఈవో నర్మద, అడిషనల్ డీఆర్డీవో శాంతికుమారి, సిడిపిఓలు శిరీష, కమల, విజయలక్ష్మి, ఎల్లమ్మ, లక్ష్మి, చంద్రశేఖర్, సారంగం తదితరులు పాల్గొన్నారు.

# నేడే పెత్రమాస

**-తెలంగాణ పూల జాతర ప్రారంభం**

**-పుట్టింటికి పరుగులు పెడుతున్న ఆడపడుచులు**

**-తొమ్మిది రోజులు ఆటపాటలతో సంబరాలు జరుపుకోనున్న మహిళలు**

**-ఓరుగల్లు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు**

హన్మకొండజిల్లాబ్యూరో- ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో పెత్రమాస నాడు ప్రతి యేడు జరుపుకునే అత్యంత ప్రతిష్టాత్మక పండుగలలో బతుకమ్మ పండుగ ఒకటి. ఆడపడుచులు బతుకమ్మలతో తొమ్మిది రోజులు ఆటాపాటలతో నృత్యాలతో సంబరాలు జరుపుకునే బతుకమ్మ వేడుకలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పూలజాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలకు, కళాశాలలకు అక్టోబర్ నుండి 15వరకు బతుకమ్మ దసరా సెలవులు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా పట్టణాలలో ఉన్న ఆడపడుచులు పల్లెలకు పయణం అయ్యారు. గ్రామీణ ప్రాంతాలలో చెరువు గట్ల మీద కూడలిలో ఆటాపాటలతో ఆడే బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకొనుటకు ఆడపడుచులు సిద్ధమయ్యారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి అధికారులు ఏర్పాటు చేసిన స్థలాలలో బతుకమ్మలను ఆడేందుకు చిన్న పిల్లలు మొదలుకొని పెద్దల వరకు మహిళలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకోనున్నారు. ఓరుగల్లు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు బతుకమ్మ ఆట స్థలాలను గుర్తించి తగు ఏర్పాట్లు చేశారు. పోలీసు యంత్రాంగం సైతం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. పట్టణాలు ఖాళీ అయి పల్లెలకు వస్తున్న జనంతో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ప్రైవేటు వాహనాలలో జనం ప్రయాణం చేస్తుండటంతో రోడ్లన్ని రద్దీగా మారాయి. ఉద్యోగ రిత్యా, చదువుల రిత్యా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో విద్యనభ్యాసిస్తున్న విద్యార్థినీలు, యువతతో పాటు మహిళలంతా పల్లెబాట పట్టారు. నగరాల నుండి గ్రామీణ ప్రాంతాలల్లోకి మహిళలు రావడంతో పల్లెలన్ని సందడిగా మారాయి.

# సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయండి

## రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ నగర మేయర్, కలెక్టర్, సిపిలు, అధికారులతో మంత్రి సమీక్ష

**పోచమ్మ మైదాన్ కార్పొరేషన్, ప్రభాతవార్త**

బతుకమ్మ, దసరా పండుగ ఉత్సవాల్లో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను అదేశించారు. మంగళవారం కరీమాబాద్ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన జిల్లా యంత్రాంగం, జిడబ్ల్యుఎంసి సంయుక్త ఆధ్వర్యంలో రంగలీలా మైదానం (ఉర్సు గుట్ట) కరీమాబాద్ ప్రాంతంలో సద్దుల బతుకమ్మ, దసరా పర్వదినం సందర్భంగా నిర్వహించిన సమావేశానికి మంత్రి కొండా సురేఖ మేయర్ గుండు సుధారాణి, నగర పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేలతో కలిసి సమీక్షించారు. సమర్థ నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచుల ఎ ంతో భక్తి శ్రద్ధలతో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మ జరుపుకుంటామని వారి సౌకర్యార్థం అవసరమయ్యే ఏర్పాట్లు చేయాలన్నారు. బతుకమ్మ జరుపుకునే అన్ని ప్రాంతాల వద్ద మైదానం చదును, రహదారిపై గుంతలు పూడ్చాలని, డస్టింగ్, లైటింగ్, మంచినీటి సౌకర్యం, తదితర మౌలిక సదుపాయాలతో పాటు చెరువుల్లో గుర్రెపు డెక్క తొలగించాలన్నారు. ఆయా పనులు వేగవంతంగా చేపట్టి బుధవారం నాటికి పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ ఆటస్థలాల వద్ద ప్రతిరోజు శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. దసరా పర్వదినం సందర్భంగా రంగలీలా మైదానంలో అంగరంగ వైభంగా జరుపుకునే వేడుకలకు దసరా కమిటీ కోరిన విధంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. తగినంత లైటింగ్, పారిశుధ్యం, మంచినీటి సౌకర్యం, సీటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, మహిళ, పురుషుల పోలీసులతో పటిష్ట పోలీసు బందోబస్తు, సిసి కెమరాల ఏర్పాటు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, నగరం నలుమూలల నుంచి ప్రజలు వచ్చేలా టిఎస్ ఆర్టీసి ద్వారా బస్సుల ఏర్పాటు, పార్కింగ్, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా వైద్య అంబులెన్సు, అగ్ని మాపక యంత్రం ఏర్పాటు, ఆయా చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. తెలంగాణ సాంప్రదాయ, సాంస్కృతి ప్రతిబింబించే విధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన అంతర్గత రహదారుల్లో గుంతలను పూడ్చాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అంకిత భావంతో ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.

నగర మేయర్ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అన్ని విభాగాల అధికారుల సహకారంతో పండుగల ఏర్పాట్లును విజయవంతం చేయాలని బల్దియా కమిషనర్ ఆయా విభాగాలతో ఇప్పటికే సమావేశాలు ఏర్పాటు చేసి విజయవంతం చేయడానికి తగు సూచనలు చేయడం జరిగిందన్నారు. సద్దుల బతుకమ్మ పండుగ వరకు గుర్రపు డెక్క సకాలంలో తొలగింపుతో పాటు ప్రణాళిక ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడానికి జిడబ్ల్యుఎంసి ముందుకు వెళ్లుతుందని అన్నారు. మంత్రి సూచన మేరకు బల్దియా తరుపున చేపట్టవలసిన కార్యక్రమాలను సమీక్షించుకుని ఏమైనా అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులు ఉంటే కమిషనర్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటారని బల్దియా తరుపున అదనపు ఏర్పాట్లు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. నగర పరిధిలోని చెరువుల వద్ద చేయాల్సి న ఏర్పాట్ల గురించి కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి వేగవంతంగా

పూర్తి చేయడానికి అధికారులకు తగు సూచనలు చేశారని మేయర్ తెలిపారు.

కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ దసరా నిర్వహించుకొనుటకు శాఖల అధికారులను ఆదేశించారు. బల్దియా సంబంధిత శాఖల అధికారులతో ఆయా పనులు త్వరితంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగర పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ మాట్లాడుతూ వేడుకలు ప్రశాతంగా నిర్వహించుటకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు భారీ వాహనాలు ప్రధాన రహదారిపై రాకుండా మళ్లించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, పల్లం పద్మరవి, డిసిపి సలీమా, కార్పొరేటర్లు మరుపల్ల రవి, పల్లం పద్మ రవి, డిసిపి సలీమా, అదనపు కలెక్టర్ సంధ

్యారాణి, అదనపు కమిషనర్ రాజేందర్ రెడ్డి, పోలీసు, ఇరిగేషన్, ఎపిడిసిఎల్, ఫైర్, మెడికల్ అండ్ హెల్త్ తదితర శాఖల అధికారులు, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు సంజయ్, గుండు పూర్ణచందర్, మధుసూదన్, రాంమూర్తి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.





# హైడ్రా పేదల జోలికి రావొద్దు

## వస్తే ఎర్రజెండా అండగా ఉంటుంది

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

**పోచమ్మ మైదాన్ కార్పొరేషన్, ప్రభాతవార్త**

గ్రేటర్ వరంగల్‌లో హైడ్రా పేదల జోలికి పోవద్దని, హైడ్రా పేరుతో పేదలను భయాందోళనలకు గురి చేయడం తగదని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్‌లో గల అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పేదల ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరించాలని సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.బాషామియా అధ్యక్షత వహించగా కూనంనేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైడ్రా ప్రభుత్వ భూములను, చెరువులు, కుంటలను ఆక్రమించిన పెద్దల కట్టడాలను కూల్చాలని, పేద, మధ్య తరగతి వర్గాలను ఇబ్బంది పెట్టరాదని అన్నారు. రాష్ట్రంలో చెరువులు, కఉంటల వివరాలపై శ్వేత పత్రం ప్రకటించాలని, వాటిలో పరిరక్షించాల్సి స్థలాల్లో పేదల నివాసాలు ఉంటే వారికి ప్రత్యామ్నాయం చూపాలని సూచించారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు అప్పులు చేసి అన్ని రకాల అనుమతులు తీసుకుని ఇల్లు కట్టుకుంటే కూల్చడం సరికాదన్నారు. వారికి అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కబ్జాలకు గురవుతున్న




భూములను పరిరక్షించి పేదలపరం చేసిన ఘనత సిపిఐదే అన్నారు. తాము లక్షలాది మందికి ఇండ్ల స్థలాలను ఇప్పించామన్నారు. హైడ్రా పేరుతో అలాంటి పేదల జోలికి పోవద్దని, వరంగల్ నగరంతో సహా రాష్ట్రంలో ఎక్కడికి హైడ్రా వచ్చినా పేదలు అడ్డుకుంటారని హెచ్చరించారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా గుడిసె వాసులకు పట్టాలు ఇస్తామని మాట ఇచ్చారని, హైడ్రా పేరుతో ఆందోళన చెందుతున్న పేదలకు ప్రభుత్వం మరోసారి ప్రకటన చేసి భరోసా ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా పేదలు ఇబ్బంది పడినా ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే చెరువులు, కుంటలు ఆక్రమించిన వారిలో ఏ పార్టీ వాళ్లు ఉన్నారో లెక్కలు తీయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, ఆశోక్, స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, నాయకులు బుస్సా రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# మాలలు ఐక్యతను చాటుకోవాలి

**హసన్ పర్తి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:**

మాలల హక్కులు కొనసాగాలంటే వారంతా ఏకతాటి పైకి వచ్చి ఐక్యతను చాటుకోవలసిన అవసరము ఉందని రిటైర్డ్ డిఎస్పీ దామర నరసయ్య పేర్కొన్నారు. మంగళవారం హసన్ పర్తి మండల కేంద్రంలోని విజయ గార్డెన్‌లో జరిగిన మాలల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 20న జరిగే ఉమ్మడి వరంగల్ జిల్లా మాలల ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని మాల కుల బాంధవ్యాయులందరూ విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో ఉన్న మాలలు తమ ఐక్యతను చాటుకోవలసిన అవసరం ఉందని గుర్తు చేశారు. హసన్ పర్తి మండల మాల సంఘం అధ్యక్షుడు పోతరాజు ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దావారవి, రిటైర్డ్ హెచ్‌ఎం, పోతురాజు రాజేందర్, సోషల్ మీడియా ఇన్చార్జి దండి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ తండ్రి సాంబయ్య, రిటైర్డ్ టీచర్ పాపయ్య, పోతరాజు మల్లికార్జున్, చుక్క ప్రభాకర్, పప్పుల కుమారస్వామి, సురేందర్, బిక్షపతి, రమేష్, గరిగే అనిల్, రాజు, కనకం మనోహర్, పోతరాజు మధుకర్ తదితరులు పాల్గొన్నారు.




# బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు



**నడికూడ, ప్రభాతవార్త:**

విద్యార్థులకు ధసరా సెలవులు ప్రారంభం కానున్నందున స్కూళ్లల్లో ముందస్తుగా మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పరకాల పట్టణంలోని ఎస్.ఆర్ డిజి స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ట్రెడిషనల్ డ్రేస్సుల్లో అలరించారు. రంగు రంగుల పువ్వులతో బతుకమ్మలు తయారుచేసి కోలాట ఆటలతో, బతుకమ్మ పాటలతో సందడి చేశారు. పిల్లలతో పాటు స్కూల్ టీచర్లు కూడా వేడుకల్లో పాల్గొన్నారు.

# పసునూటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించిన మంత్రి



**పోచమ్మ మైదాన్ కార్పొరేషన్, ప్రభాతవార్త**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 22వ డివిజన్ 80 ఫీట్ రోడ్డులో పసునూటి న్యూరో అండ్ మల్టీ స్పెషాలిటీ ప్రైవేట్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖకు హాస్పిటల్ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం మంత్రి సురేఖను పట్టుశాలువాతో సత్కరించి కాకతీయ కళాతోరణం జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గజ్జల అభిలాష్, న్యూరో సర్జన్, డాక్టర్ గజ్జల సందీప్ ఐ, స్పెషలిస్టు, కుటుంబ సభ్యులతో పాటు స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమార స్వామి, రాష్ట్ర చేనేత సంఘం అధ్యక్షులు చిప్ప వెంకటేశ్వర్లు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎగ్జిబిషన్ ప్రారంభించిన మంత్రి

**పోచమ్మ మైదాన్ కార్పొరేషన్, అక్టోబర్ 01, ప్రభాతవార్త**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లల్లో ఒత్తిడిని నివారించడానికి వారిలో ఉత్సాహాన్ని నింపడానికి ఎగ్జిబిషన్లు ఉపయుక్తంగా ఉంటాయని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ ఎంజిఎం రోడ్డులోని ఇస్లామియా కాలేజీ గ్రౌండ్స్‌లో ఓం చండీశ్వరి ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సెలవుల్లో పిల్లలకు కావల్సిన వినోదాన్ని పంచేందుకు ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన నిర్వాహకులు మిర్యాల శ్రీకాంత్, కొక్కుల సతీష్ తదితరులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాల్, నవీన్ రాజ్, చిప్ప వెంకటేశ్వర్లు, ఇన్స్‌పెక్టర్ తుమ్మ గోపి తదితరులు పాల్గొన్నారు.



# 6న జిల్లాలో ఎన్ఎల్ఎం బృందం పర్యటన

**-జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా**

*జనగామ టౌన్,అక్టోబరు 1 (ప్రభాతవార్త) :*

ఈనెల 6వ తేదీన కేరళ నుంచి నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం (ఎన్ఎల్ఎం బృందం) జనగామ జిల్లా పర్యటించనున్నట్లు, ఈనేపథ్యంలో గ్రామీణాభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించనున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌భాషా తెలిపారు. జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా అధ్యక్షతన మంగళవారం జిల్లాలోని ఎన్ఎల్ఎం బృందం పర్యటనపై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం జిల్లాలోని దేవరుప్పల మండలంలోని ఐదు గ్రామాలు, స్టేషన్‌ఘన్‌పూర్



మండలంలోని ఐదు గ్రామాలు, జనగామ మండలంలోని ఐదు గ్రామాలు, కొడకండ్ల మండలంలోని ఐదు గ్రామాలను మొత్తం 20గ్రామాలను సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా డీఆర్‌డీఏ, హౌజింగ్, పంచాయతీరాజ్, ల్యాండ్ రికార్డ్స్ శాఖలకు సంబంధించిన ఏంజీఎన్ఆర్ఈజీఎస్, దే-ఎన్ఆర్ఎల్ఎం, పీఎంఏవై, ఎన్ఎస్ఏపీ, పీఎంజీఎస్వై, ఎస్ఏజీవై, డీఐఎల్ఆర్ఎంపీ, పీఎంకెఎస్వై, డీడీయు-జీకెవై, ఆర్బెటీ, స్వామిత్వ, బీబీపీ పథకాలకు సంబంధించిన పనులను తనిఖీ చేసి పర్యవేక్షించనున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ప్రతీ గ్రామానికి ఒక సమన్వయ అధికారిని నియమించాలని తెలిపారు. అన్ని రికార్డులను, ఫైళ్లను ఏడు రిజిస్టర్‌లను పనులకు సంబంధించిన బిల్లులను, వర్క్‌సైడ్ బోర్డులను, జాబ్‌కార్డులకు సంబంధించి అన్ని వివరాలను సరిచూసుకోవాలని, సక్రమంగా నిర్వహించాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని, ముందస్తు యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డీఆర్‌డీవో వసంత, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో స్వరూప, జడ్పీ సీఈవో సరిత, ఈఈ పీఆర్ శ్రీనివాసరావు, డీఈఈలు, ఈఈ హౌజింగ్ దామోదర్‌రావు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

జనగామ



వార్త

జనగామ టౌన్, పాలకుర్తి,దేవరుప్పల,తరిగొప్పుల, లింగాలఘణపురం

## అష్టదళ పాద పద్మారాధన పూజ

*చిల్పూరు, అక్టోబరు 1 (ప్రభాతవార్త) :*



చిల్పూ రు మండలకేంద్రంలో శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో అత్యంత వైభవంగా ఆలయంలో మంగళవారం పురస్కరిం చుకుని స్వామివారికి అష్టదళ పాద పద్మారాధన పూజ, బంగారు పద్మాలతో నిర్వహించారు. దేవాలయ మాజీ చైర్మన్, శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు -కిరణ్మయి దంపతులు ప్రత్యేకపూజ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమం కార్యనిర్వహణాధికారి ఎస్.మోహన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించగా జూనియర్ అసిస్టెంట్ కె.మోహన్, అర్చకులు బి.రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో బతుకమ్మ పండుగ ముందస్తు సంబరాలు

*తరిగొప్పుల/ చిల్పూర్, అక్టోబరు 1 (ప్రభాతవార్త) :*



తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మను రంగురంగుపూలతో పేర్చి ఆడపిల్లలు ఆటపాటలతో ఆకట్టుకున్న ముందస్తు బతుకమ్మ వేడుకలు తరిగొప్పుల మండలకేంద్రంలోని స్థానిక జిల్లా ప్రజాపరిషత్ ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రవీందర్, జానకి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ బతుకమ్మ పండుగ ఎంతో సంస్కృతి సాంప్రదాయ విశిష్టత కలిగి ఉంటుందని, అందరూ భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ అందరికి తుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

- చిల్పూరు మండలంలో న్న జడ్పీ పాఠశాలలో, శ్రీపతిపల్లి, మల్కాపూర్, లింగంపల్లి, చిన్నపెండ్యాల పాఠశాలల్లో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మను రంగురంగుల పూలతో పేర్చి ఆడపిల్లలు ఆటపాటలతో ఆకట్టుకున్న ముందస్తు బతుకమ్మ వేడుకలు మండలకేంద్రంలోని స్థానిక జడ్పీపాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్.మోహన్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ అందరూ భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పండుగ జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ అందరికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.సంపత్, ఎం.రాజు, ఎం.సత్యం, ఎన్.వసంత్‌రావు, కె.అరుణ, కె.సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

## మండలప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన శ్రీధర్‌రావు

*చిల్పూరు,అక్టోబరు 1 (ప్రభాతవార్త) :*



ఈనెల 2న తెలుగు సాంప్రదాయ పండుగ సందర్భంగా చిల్పూరు మండలంలో ఉన్న శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్, శాశ్వత ధాత పొట్ల పల్లి శ్రీధర్‌రావు తెలంగాణ ఆడబిడ్డలందరికి, మండలనరపజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రతీ ఇంటిలో బతుకమ్మ పండుగ పర్వదినంగా జరుపుకోవాలని సంతోషంగా ఉండాలని పేర్కొన్నారు. వీరితోపాటు పొలాపెల్లి రంజిత్‌రెడ్డి, మామిడాల లింగారెడ్డి, గడ్డమీది సురేష్, కొయ్యడ రాందాస్, రంగురమేష్ పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్ అర్హత కలిగిన వారు ఇ-పాస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి

*జనగామ టౌన్,అక్టోబరు 1 (ప్రభాతవార్త) :*

2024- 25 సంవత్సరానికి గాను స్కాలర్‌షిప్ అర్హత కలిగిన విద్యార్థిని విద్యార్థులు అందరూ ఇ-పాస్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి డాక్టర్ బి.విక్రమ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని ఎస్సీ పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ అర్హత కలిగిన విద్యార్థిని విద్యార్థులందరూ ఇంటర్నెట్ ద్వారా ఇ-పాస్ వెబ్‌సైట్‌లో ఎస్ఎస్‌సి మెమో రిజిస్ట్రేషన్/ హాల్‌టికెట్ నంబర్‌తో ఆధార్‌కార్డు నెంబరు ఒకవేళ ఏదైనా పేరులో మార్పులు చేర్పులు ఉంటే ఎస్ఎస్‌సీలో ఉన్న విధంగా ఆధార్‌కార్డులో మీ-సేవ నందు మార్పులు చేసుకోవాలన్నారు. ఎస్ఎస్‌సి మెమో, ఆధార్‌కార్డులోని వ్యక్తిగత వివరాలు ఒకేవిధంగా ఉన్నట్లయితే ఆ విద్యార్థిని విద్యార్థులకు ఒక గుర్తింపు నంబర్ జెనరేట్ అవుతుందని, ఈ నెంబర్‌తో మీ సేవలో బయోమెట్రిక్ వివరాలు ఇవ్వ వలసి ఉంటుందన్నారు. అప్లికేషన్ ఐడీ నంబర్‌ను సంబంధిత కళాశాలలో ఇచ్చి మిగతా దరఖాస్తు పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. 2024-25సంవత్సరానికి ఆదాయ పరిమితి 2లక్షల నుంచి 2.50లక్షలకు పెంచడం జరిగిందన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఈవిషయాన్ని గమనించాలని తెలిపారు.

## విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

*రఘునాథపల్లి, అక్టోబరు 1 (ప్రభాతవార్త) :*

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్ది మోడల్‌స్కూల్‌లో మంగళవారం మాదక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు సైబర్‌నేరాలకు దూరంగా ఉండాలని దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు పెద్దలపట్ల మర్యాదగా నడుచుకుంటూ ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదిగి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. మాదకద్రవ్యం లాంటి చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మాదకద్రవ్యాలు వాడినట్లు తెలిస్తే వారిపై కేసులు పెట్టేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.నరేష్‌యాదవ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకుడు

*దేవరుప్పుల, అక్టోబరు 1 (ప్రభాతవార్త) :*



దేవరుప్పుల మండలకేంద్రానికి చెందిన కారుపోతుల రాజయ్య-లక్ష్మీ దంపతుల కుమారుడు నరేష్ టీఆర్టీ2024 ఫలితాలలో ప్రకటించిన పీఈటీ, పీడీ రెండు కేటగిరిలలో మొదటిస్థానంలో నిలిచి రెండు ఉద్యోగాలు సాధించాడు. ఇటీవలె ప్రకటించిన 2017గురుకుల బీఈడీ ఫలితాలలో కూడా పీఈటీ ఉద్యోగం సాధించాడు. మొత్తం మూడు ఉద్యోగాలకు ఎంపికై కారుపోతుల నరేష్ తన సత్తా చాటాడు. పట్టుదలతో ముందడుగు వేస్తే సాధించలేనిది ఏదీ లేదని నరేష్ నిరూపించాడు. ఆశయ సాధనకు పేదరికం అడ్డుకాదని సక్సెస్‌ను అందుకున్నాడు. ఈ యువకుడు మామూలుగా ఒక్క ప్రభుత్వ ఉద్యోగం రావడమే గొప్ప అనుకునే ఈ రోజుల్లో ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించడం నరేష్ కుటుంబ సభ్యులకే కాకుండా తమ గ్రామ ప్రజలకు కూడా ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, సహనం, ఓరుపతోకూడాన టాలెంట్, ఏ నాటికైనా గమ్యాన్ని చేరుతుందని, విజయంపట్ల తమ కుటింబీకులు నరేష్ కష్టాలను తలుచుకుంటూ ఆనంద బాష్పాలు కార్చారు. ఇలాంటి యువత సాధించే విజయాలు తమ తోటివారికి తదుపరి తరాలకు స్ఫూర్తినిస్తాయంటూ నరేష్ సక్సెస్‌ను పలువురు గ్రామస్థులు అభినందించారు.

## మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరం

*తరిగొప్పుల, అక్టోబరు 1 (ప్రభాతవార్త) :*



మండలపరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల సిబ్బందికి మంచినీటి సహాయక శిక్షణ శిబిరం ఎంపీడీవో ఆలేటి దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వి.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ గ్రామాలలోనెలకొన్న చిన్న చిన్న సమస్యలను సిబ్బంది చేసుకునే ఉద్దేశంతో ఈ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ అందరూ శిక్షణ పూర్తి చేసుకుని గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా కలుషిత నీరుకు తావులేకుండా ప్రజలకు మంచినీటిని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలియచేశారు. ఈకార్యక్రమంలో మిషన్ బగీరథ ఈఈ, శ్రీకాంత్, ఎంపీవో మాలత, మిషన్ భగీరథ ఏఈఈ నాగరాజు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

*నర్సంపేట,అక్టోబర్ 1, ప్రభాతవార్త*

జెడ్పీహెచ్ఎస్ గురిజాల మరియు ప్రాథమిక పాఠశాల గురిజాలలో మంగళవారం బతుకమ్మ పండుగను కన్నుల పండుగగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జి.రామచంద్ర రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పండుగలలో రాష్ట్రమంతా తొమ్మిది రోజులు కన్నుల పండుగగా జరుపుకునే గొప్ప పండుగ అని అభివర్ణించారు.తెలంగాణ పండుగలు జనజీవన స్రవంతి నుంచి ఆవిర్భవించాయని తెలంగాణ ప్రజల జీవనశైలిని తరతరాల సంస్కృతిని ప్రజల ఐక్యతను కుల మత భేదాలు లేకుండా ప్రజలంతా కలిసిమెలిసి జరుపుకునేటువంటి పండుగలని పేర్కొన్నారు.బతుకమ్మ పండుగ ఆడబిడ్డలకు గౌరవం ఇచ్చే పండుగన ఈ పండుగను మన పాఠశాలలో జరుపుకోవడం సంతోషకరమైన విషయమని అన్నారు.గురిజాల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ప్రాథమిక పాఠశాల విద్యార్థినిలు కోలహలంగా సాంప్రదాయ దుస్తులలో వివిధ పాటలకి నృత్యాలు గ్రామ ప్రజలను ఎంతగానో అలరించాయి.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పార్థసారథి, ఎమ్ఏ సాదత్ చంద్రకళ, నాగరాణి, రమాదేవి, రజిని, స్రవంతి, ఎండి రాయబోస్, రవికుమార్, రవీందర్, చంద్రమౌళి, కనకస్వామి మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**-ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్‌లో బతుకమ్మ సంబరాలు నిర్వహించుకున్నారు. కళాశాలలోని జాతీయ సేవా పథకం, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.మల్లం నవీన్ మాట్లాడుతూ మన తెలంగాణ జాతీయ పండుగ అయిన బతుకమ్మకు ప్రత్యేక స్థానం



ఉందని ప్రకృతిని పూజించే పండుగ ఇదన్నారు. ప్రతి ఒక్కరు తమ ఆచార, సాంప్రదాయాలను గౌరవించి గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

**నల్లబెల్లిలో.....:** మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం నుండి బతుకమ్మ పండుగ సెలవులు ఉండడం చేతి మంగళవారం పాఠశాలల్లోని బాలికలు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా బతుకమ్మని పేర్చి ఆ బతుకమ్మలను ప్రత్యేక తులసి చెట్టు ఏర్పాటు చేసుకొని తులసి చెట్టు చుట్టూ పేర్చి కోలాటాలు బతుకమ్మ పాటలు తెలంగాణ పల్లె పాటలు పల్లె సుద్దులు పాడుకుంటూ బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. బాలికలతో తోడుగా మహిళా ఉపాధ్యాయురాలు పాటలు పాడుతూ తెలంగాణసంస్కృతి సాంప్రదాయాలను గుర్తు చేసుకున్నారు. మొత్తంగా అన్ని గ్రామాల ప్రభుత్వ ప్రైవేటు పాటశాలల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి.

**దుగ్గొండిలో....** :మండలంలోని తిమ్మంపేట శ్రీఆదర్శవిద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి ఆడబిడ్డలు ఆట, పాట, రంగు రంగుల హరివిల్లుల అందమైన సుగందాలు విరజల్లే అందాల పూలను ఒక క్రమంలో పేర్చి విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం పరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అక్కపెల్లి సాంబశివుడు మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు జీవన విధానానికి ప్రతీకగా నిలిచే పండుగ దేశవ్యాప్తంగా జరుపుకునే తీరొక్క పూల పండుగ ఇది ఆడపడుచుల పండుగ అని అన్నారు. గౌరమ్మను పసుపు, కుంకుమ పూలు, పండ్లు, పలారాలతో పూజించే ఈ పండుగను ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కాకుండా దేశ విదేశాల్లో కూడా ఈ పండుగను జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దండు కరుణాకర్, దండు రాజు, మచ్చిక రజిత, మామునూరి రాణి విద్యార్థులు పాల్గొన్నారు.

**చెన్నారావుపేటలో.....:** మండలంలోని జల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తుగా పాఠశాలలో చుదువుతున్న విద్యార్థులు రంగురంగుల పూలను సూకరించి అందమైన బతుకమ్మలను పేర్చారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ ఆడి పాడారు.

**-హెచ్ఎంకు సన్మానం.....:** జల్లి పాఠశాల హెచ్ఎం సరళను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఇటీవల పాఠశాల హెచ్ఎం నూతనంగా మండల విద్యాశాఖ అధికారినిగా బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరళను తోటి ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరచారి, జగన్మోహన్, వెంకటేశ్వరరావు, అశోక్, బిక్షపతి, శైలజ, అనిత, సరిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**నెక్కొండలో.....:** మండల కేంద్రంలో గల గౌతమి విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ వేశాదారణలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆట పాటలతో కనువిందు చేశారు. ఈ వేడుకల్లో కరస్పాండెంట్ మురళీధర్, ప్రిన్సిపల్ కల్పన, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.




**నర్సంపేట,నల్లబెల్లి,చెన్నారావుపేట, దుగ్గొండి, నెక్కొండ, ఖానాపురం**

## అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ అడ్మిషన్ల గడువు పొడగింపు

**-అక్టోబర్ 15వరకు**

*నర్సంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త*



డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ (బీఏ,బీకాం,బీఎస్సీ) కోర్సుల్లో 2024-25విద్యా సంవత్సరం ప్రవేశాల గడువును అక్టోబర్ 15వరకు పొడగించినట్లు నర్సంపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ మరియు అధ్యాయన కేంద్రము కో ఆర్డినేటర్ డా.పూర్ణచందర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఆయా కోర్సుల్లో స్టడీ సెంటర్లలో చేరడానికి విద్యార్హతలు,ఓపెన్ ఇంటర్, రెగ్యులర్ ఇంటర్, ఐటిఐ,డిప్లమా,వివరాలకు వెబ్‌సైట్‌లో పొందవచ్చుని వెల్లడించారు.ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజును అక్టోబర్ 15వరకు ఫీజు చెల్లించలేకపోయిన వారు కూడా అక్టోబర్ 15వ తేదీ లోపు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు.పూర్తి సమాచారం కొరకు ఆన్‌లైన్‌లో నమోదు తదితర అంశాలపై సందేహాలుంటే సమీపంలోని అధ్యాయన కేంద్రంలో సంప్రదించాలని లేదా హెల్ప్ డెస్క్ నంబర్లు 994937969 టోల్‌ఫ్రీ నెం.7382929577,9133297849లో సంప్రదించోచ్చని సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

**-సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య**

*నర్సంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త*

ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలు ఒక్కటే మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య అన్నారు. మంగళవారం లక్నెపల్లి, రామవరం గ్రామశాఖ మహాసభలు గ్రామ కార్యదర్శి కా.కత్తి పెద్ద కట్టయ్య అధ్యక్షతన కల్నెపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు పోరాటాలే మార్గం అని అన్నారు. కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య కులాలు, మతాల మధ్య చీలిక తీసుకువచ్చి విద్వేషాలు రెచ్చగొట్టి పాలన సాగిస్తున్నదని, దేశంలో ప్రజల ప్రజాస్వామిక హక్కులు కాలరాసి, నియంతృత్వ పాలన తీసుకురావడానికి బిజెపి నాయకత్వంలోని మోడి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటలను సాగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయడంలో మినవేశాలు లెక్కిస్తున్నదని, ప్రధానంగా రైతు రుణమాఫీ అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని హామీల అమలుకు ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కా.ఈసంపెల్లి బాబు, కా.భూక్య సమ్మయ్య, కోరబోయిన కుమారస్వామి, గ్రామ శాఖ కార్యదర్శులు ఎండీ కతేబ్, రాజులపాతి సూరయ్య, మండల కమిటీ సభ్యులు కమతం వెంకటేశ్వర్లు, రెండు గ్రామాలకు చెందిన పార్టీ సభ్యులు పాల్గొన్నారు.




## గంగమ్మ ఒడిలోకి బొడ్డెమ్మతల్లి

**-ముగిసిన బొడ్డెమ్మ ఆట... ప్రారంభమవుతున్న బతుకమ్మ**

*నల్లబెల్లి, అక్టోబర్ 1, ప్రభాతవార్త*



తెలంగాణ జాతీయ పండుగ బతుకమ్మ పండుగలో భాగంగా ముందుగా జరిగే బొడ్డెమ్మ పండుగ గత 9 రోజులుగా మహిళలు మండలంలోని అన్ని గ్రామాల్లో అంగరంగ వైభంగా ఘనంగా నిర్వహించారు. మంగళవారంతో బొడ్డెమ్మ పండుగ 9 రోజులు పూర్తి చేసుకొని సమీప చెరువులో మహిళలు భక్తి శ్రద్దలతో కోలాటాలు, వీడ్కోలు పాటలు, తెలంగాణ పల్లె సుద్దులను ఆలపిస్తూ నిమజ్జనం చేశారు. మొత్తానికి గంగమ్మ ఒడిలోకి బొడ్డెమ్మ తల్లిని చేర్చామని భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించామని మండలంలోని అన్ని గ్రామాల మహిళలు పేర్కొన్నారు. నేటి నుండి బతుకమ్మ పండుగ ప్రారంభం అవుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల్లో కులాలకు అతీతంగా మహిళలు బొడ్డెమ్మ తల్లిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

## నాచినపల్లి గ్రామవాసి కట్ల రమేష్‌కి డాక్టరేట్

*దుగ్గొండి, అక్టోబర్ 1, ప్రభాతవార్త*



మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన కట్ల దయాకర్ తమిళనాడు టీచర్స్ ఎడ్యూకేషన్ యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవంలో మంగళవారం తమిళనాడు గవర్నర్ ఎన్.రవి చేతుల మీదుగా డాక్టర్ పట్టా అందుకోవడం జరిగిందన్నారు. హయ్యర్ సెకండరీ స్టూడెంట్ అకాడమిక్ రెసిలి యాన్ సెల్ఫ్ కాన్ఫడెన్స్ ఏమోషనల్ అడ్జస్ట్‌మెంట్ అండ్ టీచర్ స్టూడెంట్ కాంప్లిటిక్స్ అనే అంశంపై పరిశోధన చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు డాక్టర్ చేతుల మీదుగా పట్టా అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బందువులు, స్నేహితులు, గ్రామస్తులు పట్టా పొందడంతో కృతజ్ఞత తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో ఎన్‌సిటిఇ చైర్మన్ పంకజ్, అరోరా, న్యూడిల్లీ చీఫ్ గెస్ట్‌గా వచ్చారన్నారు.

# గ్రామ సమస్యలు పరిష్కరించాలి

**-ఎంసిపిఐ(యు) మండల సహాయ కార్యదర్శి మర్త నాగరాజు**

*నల్లబెల్లి, అక్టోబర్ 1, ప్రభాతవార్త*

మండలంలోని రంగాపురం గ్రామపంచాయతీలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలంటూ గ్రామ పంచాయతీ కార్యదర్శి రామారావుకి ఎంసిపిఐయు పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంసిపిఐయు నల్లబెల్లి మండల సహాయ కార్యదర్శి మార్త నాగరాజు మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగ వస్తున్న సందర్భంగా గ్రామంలో వీధిలైట్లను ఏర్పాటు చేయాలని అలాగే గుంతలుగా ఉన్న రోడ్ల పునర్నిర్మానం చేయాలని రంగపురంలో అన్ని కాలనీలకు ఎల్ఈడీ వీధిలైట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే ఎస్సీ కాలనీలో సరైన సదుపాయాలు లేక వీధిలైట్లు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే ఏర్పాటు చేయాలని అన్నారు. మహిళలు ఆడవలసిన బతుకమ్మ స్థలాన్ని పరిశీలించి ఆ స్థలాన్ని పరమతులుగా చేయాలని ఎంసిపిఐయు పార్టీ నుండి డిమాండ్ చేశారు.

# మండలంలో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

గార్ల, అక్టోబర్1 ప్రభాతవార్త
మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు, ప్రభుత్వ డిగ్రీకళాశాల, కస్తూరిబా, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ముందస్తుగా బతుకమ్మ స oబరాలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విశ్వశాంతి విద్యాలయం, నిర్మలాహైస్కూల్, సమతహైస్కూల్, ప్రవేటు పాఠశాలలో యాజమాన్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే, తెలంగాణ ప్రతీక బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలకు దసరా సెలవులు రావడంతో ముందస్తుగా పాఠశాలలో బతుకమ్మ వేడుకల కోసం ప్రకృతి పరంగా దొరకే తీరొక్క పూలను సేకరించి శ్రద్దగా బతుకమ్మలను పేర్చి ఆయా పాఠశాలల ప్రాంగణంలో ముగ్గులతో రంగవల్లి వేసి మధ్యలో బతుకమ్మలను చేర్చారు. ఈకార్యక్రమంలో తెలంగాణ బతుకమ్మ పాటలతో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయురాలు చుట్టు



తిరుగుతు చప్పట్లు చేస్తు, కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు. ఈసందర్బంగా డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు, కస్తూరిబా పాఠశాల ప్రత్యేక అధికారిణి ఉషారాణి, గిరిజన ఆశ్రమపాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగయ్య, ప్రవేటు పాఠశాలల ప్రిన్సిపాల్స్ వసుపులేటి.రమేష్, సిస్టర్ జీన్సి, జవ్వాజి సరోజిని, రంగారావు,లు మాట్లాడుతు తెలంగాణ సాంప్రదాయ పండుగలలో బతుకమ్మ పండుగ మహిళలకు అత్యంత ప్రితిప్రాప్తమైన పండుగని, దేవుళ్ళకు సమర్పించి పూజించే పూలను పూజించే విశిష్ట సాంప్రదాయం తెలంగాణ రాష్ట్రంలో ప్రతీకని, అనాదిగా వస్తున్న బతుకమ్మ సాంప్రదాయం, విశిష్టత,ల గూర్చి విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో ప్రవేటు పాఠశాలల ఉపాధ్యాయులు శ్రీనివాస్, మనీర్, విజయరాజ్, ఉపేందర్, రవికృష్ణ, రాజేందర్, కార్తికేయ, శారధ, సంధ్య, రహమున్నిసా, షహనాజ్, రేణుక, సమీన, లలిత, అస్మజమీనా, హారిక, రమీల, స్వాతిసింధు, రాజ్యలక్ష్మి, నాగమాల, రవి, నరేష్, శేఖర్, ప్రవీణ్, సురేందర్, బాలస్వామి, శ్రీనివాస్, శివకృష్ణ, జ్యోతి, సరిత, శిరోమణి, కళ్యాణి, రోషిణి, లక్ష్మ, శిజి, సినిసౌందర్య, ఫరిజానా, సుల్తానా, భీమ్‌సింగ్, భాస్కర్, అనిల్, సునిత, డిగ్రీకళాశాల అధ్యాపకులు, పాల్గొన్నారు.

## టిపిటిఎఫ్ మండల నూతన కమిటి ఏకగ్రీవం

గార్ల, అక్టోబర్1 ప్రభాతవార్త:




మండల టిపిటిఎఫ్ నూతన కమిటి ఏకగ్రీవంగా ఎనుకోవడం జరిగిందని ఎన్నికల నిర్వహణ అధికారులు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సంఘం సీనియర్ నాయకులు శీలంశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన మండల నూతన కమిటి ఎన్నికలో ఎన్నికల నిర్వహణ అధికారులుగా ఉప్పలయ్య, రమేష్ పాల్గొనగా మండల టిపిటిఎఫ్ అధ్యక్షులుగా పి.యాదగిరినాయక్, ప్రధానకార్యదర్శిగా జి.బాలాజీనాయక్,లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పి.వెంకటరెడ్డి, కవిత, జిల్లాకౌన్సిలర్‌గా కే.హనుమంతు, మహిళా ప్రతినిధులుగా రోజారమణి, సిహెచ్ తిరుపతి, పార్వతి, ఆడిట్ కమిటి బాధ్యులు యు. వెంకటస్వామి, కమిటి గౌరవ సలహాదారులుగా ఎస్సి శ్రీనివాస్, ఎస్. వెంకటేశ్వర్లు, ఎస్‌కే మీరా, కార్యదర్శిగా జి.సంతు, రామనాథం, టి.రమేష్, లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈసందర్బంగా ఎంపికైన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతు పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను విడుదల చేయాలని, పిఆర్సిని ప్రకటించాలని, డిఎస్సి నియామకాలకు ముందు ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం మరింత బలోపేతానికి మావంతు కృషి చేస్తామన్నారు. మాపై నమ్మకం ఉంచి ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన త్రికుర్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## గర్భిణీస్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలి

దుగ్గొండి, అక్టోబర్ 1, ప్రభాతవార్త



గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకుంటే జన్మనిచ్చే పిల్లలు ఆరోగ్యవంతంగా జన్మిస్తారని ప్రాథమిక వైద్యాధికారి కిరణ్‌రాజ్ అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలకు కీటక జనిత వ్యాధులపై అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలతో డెంగూ, మలేరియా, బోదకాలు వస్తాయన్నారు. గ్రామాల్లో సిబ్బంది గర్భిణీ స్త్రీల నమోదు చేయాలన్నారు. దోమలు రాకుండా దోమ తెరలు వాడాలన్నారు. ఆశాలు, ప్రజలకు అందుబాటులో ఉండి అనునిత్యం సేవలందించాలన్నారు. మన చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డాక్టర్లు దుర్గారాణి, వనమాల, హెచ్‌ఈవో సాంబయ్య, సూపర్వైజర్ సంధ్యారాణి, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, రజిత, సరస్వతి, బుజ్జమ్మ, ఆశాలు, జయశ్రీ, సరళ, విజయలక్ష్మి, శారద, నిర్మళ, హెల్త్ అసిస్టెంట్ రహెమాన్ తదితరులు పాల్గొన్నారు.

## భూమిని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

చెన్నారావుపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త



గ్రామాలకు సంబంధించిన భూమిని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ మండలంలోని లింగగిరి గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామ మాజీ సర్పంచ్ మాదారపు భాస్కర్, పరకాల రాజన్నల ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామ నివాసి అయిన సముద్రాల సుదర్శనచారి అనే వ్యక్తి ప్రభుత్వ భూములపై కన్నేశాడన్నారు. సర్వే నెంబర్ 700ల్లో 15గుంటల భూమి మాత్రమే ఉందన్నారు. కానీ ఇతను సాదాబైనామాలో చుట్టు ప్రక్కల రైతులను మోసం చేశాడన్నారు. 302/1/3, 305/1, 305/2, 305/3, 305/4, 305/6, 311/1, 311/2 సర్వేనెంబర్లలో దౌర్జన్యంగా సర్వే నెంబర్ల మీద సదరు వ్యక్తి మొత్తం నాలుగు ఎకరాల 9 గుంటల భూమని పట్టా చేయించుకున్నాడన్నారు. ఇట్టి సర్వే నెంబర్‌లో గల భూమి బతుకమ్మ స్థలంగా ఉందన్నారు. ఈ స్థలాన్ని అమ్ముదానికి అతను యత్నిస్తున్నాడన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి భూములకు హద్దులు ఏర్పాటు చేసి అతనిపై చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో మాదారపు చంద్రయ్య, చీకటి రాజు, మెడబోయిన కుమార్ ఉన్నారు.

## వాకర్స్ ఇంటర్నేషనల్ 303 గవర్నర్‌గా ఎన్నికైన డా.పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్

నర్సంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త



పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజ్ విజయవాడలో ఈ నెల 29వ తేదిన ఆదివారం జరిగిన 159వ కౌన్సిల్ మీటింగ్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ ఎలెక్టెడ్ 2025 డా.పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ ప్రకటించారు. 2018లో నర్సంపేటలో ఏర్పాటైన నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికై ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాలు మొక్కలు నాటడం యోగ కార్యక్రమాలు చేపట్టడం, మహిళా దినోత్సవానికి పలు రకాల కార్యక్రమాలు చేయడం. కంటి పరీక్షలు నిర్వహించడం, పేద పిల్లలకు కోవిడ్ సమయంలో ఇమ్యూనిటీ శక్తి కొరకు పండ్లను అందజేయడం ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు గత ఆరు సంవత్సరాలుగా నిర్వహిస్తూ రెండు సంవత్సరాలు వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటి గవర్నర్‌గా, వాకర్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్ సెక్రటరీగా చేయడం జరిగింది.




జయశంకర్ భూపాలపల్లి, భూపాలపల్లి రూరల్, మల్హర్‌రావు, రేగొండ

## ఏ.ఐ.కె.ఎం జిల్లా కన్వీనర్‌గా పులి రమణారెడ్డి

టేకుమట్ల, అక్టోబర్ 01, ప్రభాతవార్త



ఆల్ ఇండియా కిషన్ మహాసభ జిల్లా కన్వీనర్‌గా పులి రమణారెడ్డి ఎన్నికైనట్లు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేష్ ప్రతిక ప్రకటనలో తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన. పులి రమణారెడ్డి రైతు సమస్యల కోసం రైతు జిల్లా కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మారపల్లి మల్లేష్ తెలిపారు. అనంతరం జిల్లా కన్వీనర్‌గా ఎన్నికైన పులి రమణారెడ్డి మాట్లాడుతూ, రైతుల సమస్యల కొరకు నా పై నమ్మకంతో జిల్లా కన్వీనర్‌గా నియమించిన మారెపల్లి మల్లేష్‌కు విప్లవ అభినందనలు తెలియజేశారు.

## విద్యుత్‌ఘాతానికి గురైన యువకుడు మృతి

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 1, ప్రభాతవార్త



భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు చల్లూరిపల్లెలో చల్లూరి రంజిత్(29) అనే యువకుడు విద్యుత్ ఘాతానికి గురై మరణించాడు. వివరాల్లోకి వెలితే..ఉదయం నీటి ట్యాంకులో ఉన్న మోటరను నడవల్లేదని మోటార్‌ని చెక్ చేస్తున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్ అయి విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో వరంగల్ ఎంజిఎంకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నట్లు తెలిసింది.

## మిర్చిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గార్ల, అక్టోబర్1 ప్రభాతవార్త:
మిర్చిపంటలో వ్యాపించే ముడత రోగం, నల్లివంటి సమస్యల పరిష్కారం కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కెవికె మల్యాల శాస్త్రవేత్తలు కిషోర్, క్రాంతికుమార్, మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధి రాజుతండా, మర్రిగూడెం గ్రామాలలో కెవికె మల్యాల శాస్త్రవేత్తలు కిషోర్, క్రాంతికుమార్,లతో కలిసి క్షేత్రస్థాయిలో మిర్చిపంటలను సందర్శించి శాస్త్రవేత్తలు రైతులకు పలుసూచనలు చేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతు పైముడత రోగనివారణకు 1లీ.నీటిలో ఫిప్రోనిల్ 2మి.లీ, 19:19:19 1లీ.నీటికి 5మి.లీ చొప్పున కలిపి నేలపూర్తిగా తడిసే వరకు పిచకారి చేయాలని సూచించారు. కింది, పైముడత నివారణకు డైఫెన్‌థయూరాన్ 2గ్రా. లీ.నీటికి, 13:0:45 అనే మందును5గ్రా.తో కలిపి పిచకారి చేయాలని సూచించారు. ఇంకా నల్లినివారణకు ఫిప్రోనిల్ 80శాతంమందును0.2గ్రా., లేదాఫిప్రోనిల్, ఇమిడాక్లోప్రైడ్ అనే మిశ్రమ మందును02.గ్రా లీ.నీటికి, 19:19:19 అనేపోషకాలను 5గ్రా.ను కలిపి పిచకారి చేయాలని తెలిపారు. పంటల రోగాల నివారణకు, పంటదిగుబడికి శాస్త్రవేత్తల, వ్యవసాయ అధికారుల సలహాలు తప్పక తీసుకోవాలని వారు పేర్కొన్నారు.

# ప్రపంచ దేశాలకు గాంధీజి ఆదర్శమూర్తి

**-సత్యాగ్రహంతోనే తెల్ల దొరలను తరిమికొట్టాడు**

**-అహింసతోనే స్వాతంత్ర్యం సిద్దించింది**

**-నేడు గాంధీ జయంతి**



మహబూబాబాద్, అక్టోబర్01, (ప్రభాతవార్త): ప్రపంచ దేశాలకు గాంధీజి ఆదర్శమూర్తి. సత్యాగ్రహంతోనే హింసను జయించిన మహనీయుడు మహాత్మ గాంధీ. అహింస మార్గం ద్వారానే భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టిన మహనీయుడు మహాత్మగాంధీ. గాంధీజీ 1869అక్టోబర్2న గుజరాత్‌లోని పోరుబందర్‌లో జన్మించారు. ఇతని పూర్తి పేరు మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ. తండ్రి కరమ్‌చందగాంధీ, తల్లి పుత్లీబాయి. రాజ్‌కోట్‌లో పాఠశాల విద్యను పూర్తి చేశాడు. గాంధీ చిన్నతనంలో చూసిన సత్యహరిశ్చంద్ర, శ్రవణ కుమారుడు నాటకాలు అతనిపై ఎంతో ప్రభావాన్ని చూపాయి. భవనగర్‌లో ఉన్నత విద్యను అభ్యసించి బారిష్టరు చదవడానికి ఇంగ్లాండ్ వెళ్లాడు. తిరిగి వచ్చిన తర్వాత బొంబాయిలో న్యాయవాద వృత్తి చేపట్టాడు. వృత్తిలో భాగంగా దక్షిణాఫ్రికా వెళ్తున్న క్రమంలో ఆంగ్లేయులు నల్లజాతీయుడనే ద్వేషంతో అవమానించి రైలు నుండి దింపివేశారు. వారు చేసిన అవమానాన్ని భరించలేక నల్లజాతీయులందరిని కూడగట్టి సత్యాగ్రహం చేసి అక్కడి ప్రజలలో రాజకీయ, సామాజిక స్పృహ కలిపించాడు. స్వదేశానికి తిరిగి వచ్చాక భారతదేశ పరిస్థితులను గమనించి స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా ఆనాటి ప్రముఖులు గోఖలే, తిలక్ తదితరు లతో కలసి ఉద్యమాన్ని ప్రారంభించాడు. అందులో ముఖ్యంగా సహాయ నిరాకరణ, విదేశీ వస్త్ర బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం, 1942లో క్విట్ ఇండియా ఉద్యమాలు నిర్వహించి అనేకసార్లు జైలుకు వెళ్లారు. అతనికి చిన్నతనంలోనే కస్తూరిబాయితో వివాహం జరుగగా ఆమె కూడా అతని ఉద్యమాలకు తోడుగా నిలిచింది. గాంధీజికి భార్యవియోగం జరిగినప్పటికి స్వాతంత్రోద్యమాన్ని విడువలేదు. దేశ స్వాతంత్ర్యం కోసమే తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు మహాత్మగాంధీ. గాంధీజీ నడిపిన అహింస పోరాటం ఫలితంగానే 1947ఆగస్టు15న దేశానికి స్వాతంత్ర్యం సిద్దించింది. దేశ స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు కృషిచేసిన గాంధీజీ ప్రార్థనా మందిరంలో ఉన్న సమయంలో 1948జనవరి 30 నాథూరాం గాడ్సె గాంధిజిని కాల్చి చంపాడు. ఆనాడు ఆయన స్థాపించిన సబర్మతి ఆశ్రమం, వార్దా ఆశ్రమం ఆయన ఆశయాలకు ప్రతిరూపాలుగా నిలిచాయి. జీవన విధానంలో సత్యం, అహింస, శాంతి ఉత్తమ మార్గాలని ధృఢంగా నమ్మి ఆచరించిన మహనీయుడు గాంధీజీ. జాతిపితగా, మహాత్ముడిగా భారతీయుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచారు. అదే విధంగా ప్రపంచ మేధావుల్లో గాంధీజీ ముందువరుసలో ఉంటారు. గాంధీజీ జన్మదినం సందర్భంగా నేడు దేశమంతటా పండుగ వాతావరణంలో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించుకుంటారు.

# వైద్యులు అంకితభావంతో పనిచేయాలి

**-జిల్లా వైద్యాధికారి మురళీధర్**



మహబూబాబాద్,అక్టోబర్1,(ప్రభాతవార్త): జిల్లా వైద్యాధికారులు అంకితభావంతో పనిచేస్తూ రోగులకు అందుబాటులో ఉండాలని జిల్లా ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ తెలిపారు. మంగళవారం వైద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేస్తూ మెడికల్ క్యాంపులు సమర్థవంతంగా నిర్వహించడం వల్లనే సీజనల్ వ్యాధులను అరికట్టగలిగామని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారులు ప్రతి నెల క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించి అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును సమీక్షించాలన్నారు. ఏ ఉపకేంద్రంలోనైనా ఆరోగ్య కార్యక్రమాల అమలులో వెనుకబడినట్లైతే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మాతా శిశు సంరక్షణ కార్యక్రమ అమలులో గర్భిణీ స్త్రీల నమోదును 100శాతం నమోదు చేయాలని, గర్భిణీ స్త్రీకి రక్తహీనతను గుర్తించిన ఎడల ఐరన్ అండ్ పోలిక్ యాసిడ్ మాత్రలను అందజేయాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు అమలును 100శాతం పూర్తి చేయాలని అసంక్రమిత వ్యాధుల నివారణలో భాగంగా క్షేత్రస్థాయిలో రక్తపోటు, డయాబెటిస్ ఉన్న రోగులను గుర్తించి వారికి పూర్తి చికిత్సను అందించాలని అన్నారు. కీటకజనిత వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, ఎక్కడైనా నమోదైనట్లైతే సంబంధించిన పూర్తిచికిత్సను అందించి నివారణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. క్షయవ్యాధి నియంత్రణలో భాగంగా రెండు వారాలకు పైన దగ్గుతో బాధపడుతున్న వ్యక్తులకు తెమడ పరీక్షలు చేయించి పాజిటివ్‌గా నిర్ధారణ అయితే వారికి పూర్తి చికిత్స అందించాలని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రవణ్‌కుమార్, ప్రసాద్, కెవి రాజు, గీత, సబ్‌యూనిట్ ఆఫీసర్లు రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ తోటలో నల్లకొమ్ము నివారణ చర్యలు

**-జిల్లా ఉద్యాన,పట్టుపరిశ్రమ అధికారి మరియన్న**

మహబూబాబాద్,అక్టోబర్1,(ప్రభాతవార్త): ఆయిల్‌ఫామ్ తోట సాగులో నల్లకొమ్ము పురుగు నివారణ చర్యలను జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న రైతులకు వివరించారు. మగళవారం జిల్లాలోని తొర్రూరు, దంతాలపల్లి, నర్సింహులపేట, నెల్లికుదురు, మహబూబాబాద్‌లోని పలు గ్రామాల్లో పర్యటించి ఆయిల్‌ఫామ్ సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఆయిల్‌ఫామ్ తోటలకు నల్లకొమ్ము పురుగు(రైనోసిరస్ బీటిల్) ఆశించే అవకాశం ఉందని రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నల్లకొమ్ము పురుగు నుండి ఎప్పటికప్పుడు మొక్కలను కాపాడుకుంటూ 20గ్రాముల ఫోరేట్ గుళికలను మొవ్వలో పెట్టాలని, లింగాకర్షక బుట్టలను ఉపయోగించాలన్నారు. జీవ నియంత్రణ పద్ధతులను పాటించి నల్లకొమ్ము పురుగును నివారించుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట జే.శాంతిప్రియదర్శిని, రావకొండ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం విజయఢంకా మోగించాలి

**-సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆకుల రాజు**

కురవి,అక్టోబర్1,(ప్రభాతవార్త):



త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం పార్టీ విజయఢంకా మోగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆకుల రాజు అన్నారు. మంగళవారం సిపిఎం మహాసభ ప్రారంభం సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు ఆమెడ నాగయ్య అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆకుల రాజు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వారికి దారాదత్తం చేస్తున్నారని దీనికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. అనంతరం గ్రామ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కురవి గ్రామ నూతన కార్యదర్శిగా కట్ల కృష్ణయ్య, లింగ్యతండా కార్యదర్శిగా లావుడియా హరిలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మలెడి కోటయ్య, నల్లపు సుధాకర్, కృష్ణయ్య, కిషన్‌నాయక్, జ్యోతిబసు, గంధసిరి శ్రీనివాస్, అచ్చాలి తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ వార్త
మహబూబాబాద్, మరిపెడ, కురవి, గార్ల



## గాదె రుక్మారెడ్డి స్కూల్లో బతుకమ్మ సంబరాలు

మహబూబాబాద్ టౌన్,అక్టోబర్1,(ప్రభాతవార్త):



పట్టణంలోని స్థానిక గాదె రుక్మారెడ్డి మెమోరియల్ స్కూల్లో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భూక్య ఉమామురళినాయక్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ అస్థిత్వానికి, సాంప్రదాయానికి ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందన్నారు. దేశంలో పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అని ఈ పర్వదినం తెలంగాణ చరిత్రను చాటిచెబుతుందన్నారు. అనంతరం చిన్నారులు వివిధ రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో అలరించారు. విద్యార్ధినిలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## మహాసభను విజయవంతం చేయాలి

మరిపెడ,అక్టోబర్1,(ప్రభాతవార్త):



పిడిఎస్‌యు 50వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏరాపనఉట చేస్తున్న మహాసభను జయప్రదం చేయాలని పిడిఎస్‌యు తొర్రూరు డివిజన్ కార్యదర్శి గొడిశాల మనోజ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో సంఘం నాయకులతో కలసి సంబందిత గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాసభలకు మేధావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జార్జిరెడ్డి ఆశయ సాధనకై కృషిచేయాలని తెలిపారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పిడిఎస్‌యు ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శ్రావ్య, రమ్య, స్రవంతి, రవళి, సౌమ్య, నిర్మల, ప్రణవి, నవీన్, అరుణ్, వెంకట్, అరవింద్, శశి, వినీల్ తదితరులు పాల్గొన్నారు.

## బలపాల పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

కురవి,అక్టోబర్1,(ప్రభాతవార్త):



మండలంలోని బలపాల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తేలుకుంట్ల సునిత ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ నృత్యాలు చేస్తూ బతుకమ్మ పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మమత, జ్యోతి, వినోద్‌కుమార్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించాలి

తొర్రూరు,అక్టోంబర్ 01,ప్రభాతవార్త

కీటక జనిత వ్యాధుల నివారణ పైన ప్రజలలో అవగాహన కల్పించాలని అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో మహబూబాబాద్ జిల్లాను అగ్రభాగంలో నిలపాలని డిఎంహెచ్ఓ డాక్టర్ గుండాల మురళీధర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశా దే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. అంతేకాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గత నెలలో జరిగిన అబార్షన్లపై సమీక్షించి క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు,ఆరోగ్య కార్యకర్తలు మొదటికాన్పులో ఆడపిల్లలు ఉండి రెండోసారి గర్భం దాల్చిన వారిపై నిఘా ఉంచాలని వారికి సూచించారు.జిల్లాలో స్త్రీ



పురుషుల నిష్పత్తి రోజురోజుకు తగ్గుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.లింగ నిర్ధారణ చేయించుకున్నట్లు సమాచారం ఉన్నట్లయితే వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కానీ టోల్ ఫ్రీ నెంబర్ లైన 109,104 అదేవిధంగా 100 డయల్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. అసంక్రమిత వ్యాధులైన బిపి షుగర్ క్యాన్సర్ లాంటివి 30 సంవత్సరాల పై బడిన వారందరినీ స్క్రీనింగ్ చేయాలని వ్యాధి గ్రస్తులను ముందస్తుగా గుర్తించి ప్రజలలో అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. వైద్యాధికారి డాక్టర్ జ్యలిత,డాక్టర్ మానస, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, రవీందర్ రావు, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ కె.వి రాజు, పురుషోత్తం,హెల్త్ ఎడ్యుకేటర్స్ డిపి ఎంఒ వనాకర్ రెడ్డి,వెంకన్న వైద్యా దికారులు ఎంఎల్ హెచ్పి,లు సూపర్వైజర్లు స్టాఫ్ ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పార్కింగ్ స్థలం లేక పాఠకులు ఇబ్బందులు

తొర్రూరు,అక్టోబర్ 01,ప్రభాతవార్త



పట్టణ కేంద్రంలోని స్థానిక శాఖ గ్రంథాలయానికి ప్రతిరోజు వస్తున్న పాఠకులు పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు.మంగళవారం స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద పాఠకులు సంయుక్తంగా మాట్లాడుతూ తమ ద్విచక్ర వాహనాలను గ్రంథాలయం ముందు పెట్టుకోవడానికి వీలు లేకుండా తొర్రూరు ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసిన బైకులను గ్రంథాలయం ముందు పెట్టడంతో తమ ద్విచక్ర వాహనాలను పెట్టుకోవడానికి ఇబ్బంది అవుతుందని అన్నారు.ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యంతో సీజ్ చేసిన వాహనాలను వేలం వేయకుండా గ్రంథాలయం గేటు ముందు నెలల తరబడి ఉంటున్నాయన్నారు. అంతేకాకుండా నిత్యం వందలాది మంది పోలీస్ స్టేషన్కి వెళ్లే దారిలోనే బైకులను పార్క్ చేసి ఉన్న స్థానిక పోలీస్ వారు కూడా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు.ఖాళీ లేక ద్విచక్ర వాహనాలను పక్కన పార్క్ చేస్తే పోలీస్ శాఖ వారు అట్టి వాహనాలకు ఫైన్ వేయడం వలన గ్రంథాలయానికి రాలేకపోతున్నామని తెలిపారు .ప్రతిరోజు విద్యార్థులు యువకులు రిటైర్ట్ ఉద్యోగులు,ప్రజలు గ్రంథాలయానికి వస్తుంటారని కావున పోలీసు,ఎక్సైజ్ అధికారులు వెంటనే ద్విచక్ర వాహనాలను తొలగించాలని వారు కోరారు. భూక్య శంకర్ లైబ్రేరియన్,పాఠకులు దేవేందర్, పురుషోత్తం, సందీప్,వెంకన్న,గౌతం,దాసరి మోహన్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను ప్రభుత్వ సలహాదారు వేం పరామర్శా

ఇనుగుర్తి,అక్టోబర్ 1, ప్రభాతవార్త

మండల కేంద్రానికి చెందిన కాంగ్రేస్ నాయకులు గుజ్జునూరి బాబురావు సతీమణి రామతార మృతిచెందగా విషయం తెలుసుకున్న రాష్ట్రప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్రెడ్డి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు.అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి అన్ని విదాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్కమిటీ చైర్మెన్ గంటా సంజీవరెడ్డి,వద్దిరాజు కిషన్,బైరు అశోక్,గంజి రాజేందర్రెడ్డి,చిన్నాల కట్టయ్య,దార్ల రాంమ్మూర్తి,సూర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఉదయ్చందర్ మృతి బాధాకరం

**-నివాళులు అర్పించిన వేం నరేందర్రెడ్డి**

మహబూబాబాద్,అక్టోబర్1,ప్రభాతవార్త:



కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్చందర్ అకాల మృతి చాలా బాధాకరం అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయ్ చందర్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోస కల్పించారు. కాగా ఆయనకు బార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. వేం నరేందర్రెడ్డి వెంట తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్రెడ్డి, నరేటి కొమురయ్య, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

## రైతులకు నాణ్యమైన ఎరువులు సరఫరా చేయాలి

మహబూబాబాద్,అక్టోబర్1,ప్రభాతవార్త:



రైతులకు నాణ్యమైన ఎరువులను సరఫరా చేయాలని మహబూబాబాద్ ఎడిఎ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక పిఎసిఎస్ సొసైటి, ఎరువుల గోడౌన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల లైసెన్స్ 0 ఫారం ఈపాస్ మిషన్లో ఉన్న సరుకుల వివరాలు, గోడౌన్లో నిల్వ ఉన్న యూరియా స్టాక్ను తనిఖీ చేశారు. ఎవో తిరుపతి రెడ్డితో కలిసి మాట్లాడుతూ రైతులకు విక్రయించిన ఎరువులకు సంబంధించిన బిల్లులను విధిగా ఇవ్వాలని, ఆధార్తో మాత్రమే ఎరువులు సరఫరా చేయాలన్నారు. మండలంలో యూరియా కొరత లేదని రైతులు అధిక ధరలకు ఎరువులు కొనవద్దని ఆధార్తో సొసైటికి వెళ్లే ఎరువులు లభిస్తాయన్నారు. భూమి లేనివారు ఆధార్తో సొసైటికి వెళ్లి ఎరువులు కొనుగోలు చేసి బయట విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

## ఉదయ్చందర్ మృతి పార్టీకి తీరని లోటు

**-నివాళులు అర్పించిన శంతన్రామరాజు**

మహబూబాబాద్ నెహ్రూసెంటర్,అక్టోబర్1,ప్రభాతవార్త:



కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్చందర్ మృతి పార్టీకి తీరని లోటని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు. మంగళవారం ఉదయ్చందర్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయ్ చందర్ గుండెపోటుతో హఠాన్మరణం తనను తీవ్రంగా కలచివేసిందని, బిసి నేతగా బడుగుబలహీన వర్గాలకు వారు చేసిన సేవలు మరువలేమన్నారు. ఆయన జీవితం అందరికి స్ఫూర్తిదాయకం అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసినట్లు తెలిపారు.

# తొర్రూరు వార్త

## పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు

నెల్లికుదురు,అక్టోబర్ 1, ప్రభాతవార్త



మండలంలోని వివిధ పాఠశాలల్లో నేడు బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మంగళవారం పాఠశాలలకు చివరి పాఠశాల పని దినోత్సవం అనంతరం సెలవులు వస్తుండటంతో పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను డిజే చప్పుల్లతో బతుకమ్మ పాటలు,డ్యాన్సులు ఆటపాటలతో ఘనంగా నిర్వహించారు.మండలంలోని మేచరాజుపల్లి ఉన్నత పాఠశాల్లో ఎచ్ఎం మంగతాయి ఆధ్వర్యంలో రంగురంగుల పూలతో విద్యార్థినిలతో పేర్చిన బతుకమ్మలతో విద్యార్థులు,మహిళా ఉపాధ్యాయులు సంబురంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించగా,పాఠశాల విద్యార్థుల తల్లితండ్రులు ఆకట్టుకొగా ఆసక్తిగా సంబురాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు శశికుమార్, చాంద్, స్వామి, కరుణాకర్, జనితా ,మధుకర్, షఫీ,రమేష్,చంద్రయ్య,రాజు,పాష.కట్టమల్లు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాల సందర్శన

నెల్లికుదురు,అక్టోబర్ 1, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని బాలికల కస్తూర్బా గురుకుల పాఠశాలతోపాటు మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి మండల పరిషత్ పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి,జిల్లా ఉద్యానవన,పట్టుపరిశ్రమ శాఖ అధికారి జిగురు మరియన్న ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.తనిఖీలో బాగంగా విద్యార్థుల కల్పిస్తున్న వసతులను,ఆహారాన్ని,పరిసరాలను పరిశీలించి పలు సూచనలు సలహాలు అందచేశారు.విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఉత్తీర్ణతలో మండలాన్ని మొదటిస్థానంలో నిలుపాలని సూచించారు.

## సూర్యాస్తమయంలో తెలంగాణ ముఖచిత్రం

చిన్నగూడూరు,అక్టోబర్1, ప్రభాతవార్త

సూర్యాస్తమయం సమయంలో మంగళవారం విచిత్ర రూపం దర్శనమిచ్చింది. అది చూడడానికి అచ్చంగా తెలంగాణ భౌతిక స్వరూపాన్ని పోలిఉంది. ఈ దృశ్యాన్ని చూసిన చిన్నగూడూరు గ్రామస్తులు ఆశ్చర్యానికి లోనై ఆనందం వ్యక్తం చేశారు. పలువురు తమ సెల్ఫోన్లలో ఈ చిత్రాన్ని బంధించారు. నేటి నుండి ప్రారంభమవుతున్న తెలంగాణ బతుకమ్మ పండుగ పచ్చని ప్రకృతికి ఒకరోజు ముందే ఇలా ప్రతిబింబించడం తెలంగాణ పర్వదినానికి ప్రతిబింబం. తెలంగాణ అమరుల త్యాగం ఇప్పటికైనా విశ్వవిపణిలో ఓ గుర్తింపు.



# డ్రగ్స్ నిర్మూలనకు యువత ముందుకు రావాలి

*కేసముద్రం, అక్టోబర్ 1, ప్రభాతవార్త*

ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం ఎక్కువగా అయినందున వాటి నిర్మూలనకు ప్రజలను చైతన్యవంతం చేసేందుకు యువత ముందుకు రావాలని మహబూబాబాద్ రూరల్ సిఐ సర్వయ్య కోరారు. కేసముద్రం జూనియర్ కళాశాలలో మంగళవారం మానవ న్యాయ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన వారికి ఆయన చేతుల మీదుగా బహుమతులు అందజేసారు. మెమెంటోలు, ప్రశంసా పత్రాలు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, మద్యపానం వంటి దురలవాట్లకు యుకత ఆకర్షితులై తమ జీవితాలను పాడుచేసుకుంటున్నారన్నారు. యువత సన్మార్గంలో పయనించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో నేషనల్



హ్యూమన్‌రైట్స్ జాతీయ అధ్యక్షుడు మంగళంపల్లి హుసేన్, ప్రిన్సిపాల్ అజీజ్‌బేగ్, ఎన్‌ఎస్‌ఎస్ పిఓ మధు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, విమెన్‌సెల్ సభ్యురాలు వాణి, మడిపెద్ది సంధ్య, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ విష్ణువర్థన్, మహేందర్‌రెడ్డి, నరేష్, విక్రమ్‌రావు పాల్గొన్నారు.

## పాడి గేదేల పెంపకంపై అవగాహన

*గూడూరు, అక్టోబర్ 1, ప్రభాతవార్త*

మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు కోళ్లు, పాడిగేదేల పెంపకంపై అవగాహన కలిగించారు. ఈమేరకు పట్టణంలోని చంద్రుగూడెం ప్రాంతంలో ఉన్న ఉదయశ్రీ మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళల ఆర్థిక స్వావలంబన కొరకు సెర్ప్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా కుటుంబాలకు ఉపాధినిచ్చే పాడి గేదేల పెంపకం, కోళ్ల పరిశ్రమ నిర్వహణ, మదర్ యూనిట్ కార్యక్రమాలపైన పలు సూచనలు ఇస్తూ పొదుపు సంఘాల



మహిళలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఆర్‌ఎం మధు, ఎపిఎం రవీందర్, పశువైద్యాధికారి రాము, సిసిలు పాల్గొన్నారు.

## పదవీ విరమణ చేసిన విద్యుత్ ఉద్యోగికి వీడ్కోలు

*గూడూరు, అక్టోబర్ 1, ప్రభాతవార్త*



విద్యుత్‌శాఖలో ఎఎల్‌ఎంగా గూడూరులో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన వీర రాఘవులుకు ఆ శాఖ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈమేరకు మంగళవారం గూడూరులో నిర్వహించిన కార్యక్రమంలో రాఘవులు దంపతులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తన సర్వీస్‌లో ఆయన విద్యుత్ వినాయోగ దారులకు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో గూడూరు, అయోధ్యాపురం సెక్షన్ల ఎఇలు ప్రణీత్, అమ్ములు, సబ్ ఇంజనీర్లు ప్రవీణ్, శ్రీనివాస్, యూనియన్ నాయకులు రవికుమార్, రవీందర్, సబ్‌డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్డెమ్మ నిమజ్జనోత్సవం

*గూడూరు, అక్టోబర్ 1, ప్రభాతవార్త*



బతుకమ్మ ప్రధాన ఉత్సవాలకు ముందు వారం రోజుల పాటు నిర్వహించిన బొడ్డెమ్మ వేడుకల ముగింపు సందర్భంగా మంగళవారం రాత్రి నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. బొడ్డెమ్మ వేడుకలను గూడ ూరులోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయం, శివాలయం, ఎస్సీకాలనీ, చంద్రుగూడెం ప్రాంతంలో తొమ్మిదిరోజుల పాటు ప్రతి నిత్యం తీరొక్క పూలతో బొడ్డెమ్మలను పేర్చి ఈ వేడుకలను నిర్వహించారు. వేడుకల ముగింపు సందర్భంగా మంగళవారం రాత్రి అందంగా అలంకరించిన వాహనాల్లో బొడ్డెమ్మలను పట్టణంలో ఊరేగించి పట్టణ శివారులోని పాకాలవాగులో నిమజ్జనం చేసారు. ఉరేగింపుల సందర్భంగా చిన్న పిల్లలతో సహా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కోలాటాలు, నృత్యాలు చేసారు. ఈ ఊరేగింపు వేడుకలు పట్టణ వాసులను ఆకట్టుకున్నాయి.

## వివేకవర్థినిలో బతుకమ్మ వేడుకలు

*కేసముద్రం, అక్టోబర్ 1, ప్రభాతవార్త*



మండలంలోని శ్రీవివేకవర్థిని పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. రెగ్యులర్ యూనిఫామ్స్‌కు బదులుగా సాంప్రదాయ దుస్తులు ధరించి వచ్చిన విద్యార్థినులు తీరొక్క పూలతో పేర్చి తెచ్చిన బతుకమ్మలను ప్రదర్శించారు. వీధుల్లో కోలాటాలు వేస్తూ బతుకమ్మలను ఊరేగించారు. చివరగా రావణాసురుడి కటౌట్‌ను ఏర్పాటు చేసి బాణాసంచాతో కాల్చివేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్, ప్రిన్సిపాల్ చిర్ర నరేష్, నవీన్‌కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి నరేందర్‌రెడ్డి పరామర్శ

*కేసముద్రం, అక్టోబర్ 1, ప్రభాతవార్త*



మండలంలోని అర్పనపల్లి గ్రామానికి చెందిన కెంచ మొగిలి భార్య రాజమణి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, మాజీ పిసిసి సభ్యుడు దస్రునాయక్ తదితరులు ఉన్నారు.

# గూడూరు వార్త

గూడూరు, కొత్తగూడ, గంగారం, కేసముద్రం

## రోడ్డు ప్రమాదంలో గాయాలు

*గూడూరు, అక్టోబర్ 1, ప్రభాతవార్త*

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన జరిగింది. బ్రాహ్మణపల్లి శివారు హేముతండాకు చెందిన గుగులోతు పంతులు బ్రాహ్మణపల్లిలోని ముత్యాలమ్మగుడి సమీపంలో జాతీయ రహదారిని క్రాస్ చేస్తున్న సమయంలో గూడూరువైపు వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఆయన తలకు తీవ్ర గాయలైనట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే పంతులును గూడూరు సిహెచ్‌సికి తరలించి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం నర్సంపేటకు తరలించారు. ద్విచక్రవాహనదారులకు కూడా స్వల్పగాయలైనట్లు తెలిసింది.

## ఎమ్.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ పనులను గ్రామ సభలు నిర్వహించి ఎంపిక చేయాలి

**కార్యదర్శులకు అవగాహన కల్పించిన ఎంపిడిఓ ఆంజనేయులు**

*పరకాల,ప్రభాతవార్త:*



పరకాల మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిదిలోని పంచాయతీ కార్యదర్శులు,ఫీల్ట్ అసిస్టెంట్‌లతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో భాగస్వామ్య ప్రణాళిక పద్దతిలో ఉపాది హామీ పనులు ఎంపిక,లేబర్ బడ్జెట్ తయారుచేయుటకు గాను అవగాహన కల్పించారు.మండలంలోని పది గ్రామపంచాయతీలలో రాబోవు ఆర్ధిక సంవత్సరంలో లెబర్ బడ్జెట్ అంచనా తయారు చేయాలని ఆదేశించారు.ఆక్టోబర్ 2న అన్ని గ్రామాలలో లేబర్ బడ్జెట్ కొరకు ప్లానింగ్ ప్రాసెస్‌లో భాగంగా గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గ్రామపంచాయతీలలో లేబర్ బడ్జెట్‌లో పనులు ఎంపిక చేసి గ్రామ పంచాయతీ తీర్మాణాలు చేయాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఇమ్మడి భాస్కర్,ఏపిఓ ఇందిర.ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వయోవృద్దుల చట్టాల అమలుకు అన్ని శాఖలు సిద్ధం

*పరకాల,ప్రభాతవార్త:*

వయోవృద్దులు తమ వారసులు,కుటుంబ సభ్యుల ద్వారా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని,వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తల్లిదండ్రులు వయోవృద్దుల సంక్షేమ చట్టం 2007 వచ్చిందని అట్టి చట్టాన్ని వయోవృద్దులు సద్వినియోగం చేసుకోవాలని పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి కె.నారాయణ ఎ వయోవృద్దుల దినం సందర్భంగా అక్టోబర్1 న మంగళవారం పరకాల కాలేజీ గ్రౌండ్‌లోని పెన్షనర్స్ బిల్డింగ్‌లు తల్లిదండ్రుల వయె ావృద్దుల సంక్షేమ చట్టం 2007పై అవగాహన సదస్సు జరిగింది.వయోవృద్దుల సంక్షేమ సంఘం పరకాల అద్యక్షులు రేపాల నరసింహ రాములు అద్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ఆర్డీవో ముఖ్య అతిదిగా హాజరయి ప్రసంగించారు.సామాజిక సాంస్కృతిక ఆర్దిక మార్పుల దృష్ట్యా వృద్దులైన తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను జిల్లా కలెక్టర్ స్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ చట్టాన్ని అమలుపరుస్తుందన్నారు.పరకాల ఏరియా హస్పిటల్ సూపరెండెంట్ డా.గౌతమ్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సేవల విషయంలో ప్రభుత్వ వైధ్యాధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించగలమన్నారు డా.సిరికొండ శ్రీనివాసచారి,ఉపాద్యక్షులు పోరండ్ల కైలాసం,సంపత్,ఐసిడిఎస్ హబ్ కో ఆర్డినేటర్ కళ్యాణి తదితరులు పాల్గొని ప్రసంగించారు.తొలుత వందేమాతరం ప్రార్ధన గీతం పిదప సంఘం ప్రచార కార్యదర్శి సుంకర రామన్న అతిదులకు స్వాగతం పలకగా ట్రెజరర్ ఎడ్ల సుదాకర్ వందన సమర్పణ చేశారు.80 మంది వయోవృద్దులు పాల్గొన్న ఈ సమావేశంలో 80 సంవత్సరాలు పైబడిన ఇద్దరు వయోవృద్దులైన పావుశెట్టి వైకుంఠం,చందుపట్ల జంగారెడ్డిలను శాలువాలతో సత్కరించడం జరిగింది.

# పిల్లలు తల్లిదండ్రులకు ప్రేమ ఆప్యాయతలను పంచాలి



జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా

**జనగామ టౌన్, అక్టోబరు 1 ప్రభాతవార్త :**

పిల్లలు తల్లిదండ్రులకు ప్రేమ, ఆప్యాయతలను పంచాలని, వారిని సరిగా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా తెలిపారు. జిల్లాలోని శామీర్‌పేటలోని పసరమడ్ల రోడ్డులోగల రుద్రమదేవి వృద్ధాశ్రమంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించగా, రుద్రమదేవి ఓల్డ్ ఏజ్ హోం ఫౌండర్ సుగుణమ్మ ముఖ్య అతిథికి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో వృద్ధాశ్రమం నడుస్తుందని, ఈ ఆశ్రమం 100 నుంచి 130పడకలు ఉన్న ఈ ఆశ్రమంలో 15నుంచి 30మంది వరకు వృద్ధులు ఉంటున్నార న్నారు. ఆశ్రమ వృద్ధులందరూ చాలా చక్కగా సాంస్కృతిక కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారని, ఈసందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియచేవారు. వయోవృద్ధులకు వయసు అనేది ఉండదని, వయసుతో సంబంధం లేకుండా నచ్చినట్లు జీవించే హక్కు వారికి ఉందని, పిల్లలు తల్లిదండ్రులకు ప్రేమ, ఆప్యాయతలను పంచాలని, వారిని సరిగా చూసుకోవాలన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007 ప్రకారం వయోవృద్ధుల ఆరోగ్యం వారి బాగోగులను వారసులు తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన పెంచాలని, అలాగే మండల ఐసీడీఎస్ సమావేశాల్లో ఈ చట్టంపట్ల అవగాహన కల్పించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తిని రాసిచ్చాక సరిగా చూసుకోని పక్షంలో ఆస్తిని తిరిగి పొందుటకు ఈ యాక్టు ద్వారా ఆర్డీవోకు అప్పీల్ చేసుకోవచ్చునన్నారు. అలాగే జిల్లా, రాష్ట్రస్థాయిలో కూడా అప్పీల్ చేసుకోవచ్చని, ఇందుకు మూడంచెల సిస్టమ్ ఉందని, ఎవరైనా ఇబ్బందులకు గురైతే అప్పీల్ చేయాలని, ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ యాక్టు అనేది ఎంతో మంచి యాక్ట్ అని, ప్రతి చిన్నవిషయానికి కూడా భయపడాల్సిన అవసరం లేదన్నారు. వయసు అనేది నంబర్ మాత్రమేనని, మీ సామర్థ్యాలతో మరింతగా ముందుకు వెళ్లాలని తెలిపారు. అనంతరం డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ 1990 నుంచి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఇది 34వ వయోవృద్ధుల దినోత్సవమని, పిల్లలు పెద్దలను పోషించాలని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని, పోలీస్ యంత్రాంగం తప్పకుండా పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తి రాసిచ్చేప్పుడు చాలా జాగ్రత్త వహించాలని, ఆశ్రమంలోని వృద్ధులు ఆరోగ్యంగా ఉండాలని, ప్రతీరోజు నడక చేయాలని, యాక్టివ్‌గా ఉండాలన్నారు. అనంతరం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ప్రతిజ్ఞ చేసి ఆశ్రమంలోని వృద్ధులను, జిల్లా వయోవృద్ధుల కమిట సభ్యులను సన్మానించారు. గతనెల 25నుంచి ఈనెల 1వ తేదీ వరకునిర్వహించిన ఐడీఓపీ వీక్ కార్యక్రమంలో భాగంగా ఆశ్రమంలోని వృద్ధులకు ఆటపోటీలు ఏర్పాటుచేయగా విజేతలకు బహుమతులు అందచేశారు. అలాగే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీడబ్ల్యుఓ జయంతి, జడ్పీ సీఈవో సరిత, డీఎంహెచ్ఓ రవీందర్‌గౌడ్, డీఆర్‌డీఏ వసంత, జిల్లా వయోవృద్ధుల కమిటీ సభ్యులు కన్నాపరుశ రాములు, కేథరిన్, హేమలత, మర్రి జనార్దన్‌రెడ్డి, తెలంగాణ ఆల్‌రిటైరెడ్ల పెన్షన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజయ్య, కార్యదర్శి రామస్వామి, సీడీపీవోలు ఫ్లోరెన్స్, రమాదేవి, వృద్ధాశ్రమం నిర్వాహకులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**రఘునాథపల్లి, అక్టోబరు 1 ప్రభాతవార్త :**

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లి మండలకేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మీ, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా మండలానికి సంబంధించిన 79మంది లబ్ధిదారులకు 79లక్షల 9వేల 164రూపాయల విలువగల చెక్కులను, అలాగే 13మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు 4లక్షల 38వేల విలువగల చెక్కులను అందచేశారు. ఈసందర్భంగా విద్యుత్ శాఖ ద్వారా ప్రమాదవశాత్తు మరణించి వారి ఐదు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున 25లక్షల రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధే కాంగ్రెస్‌పార్టీ లక్ష్యమని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. రేపటి నుంచి రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పెన్షన్ల కోసం ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నిజమైన అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా పేద ప్రజల సంక్షేమానికి ఆటంకం కలగవద్దనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ ఎండి.మోహ్సిన్, ఎంపీడీవో శ్రీనివాస్, విద్యుత్‌శాఖ ఏఈ రాహుల్, డీటీ శంకర్ ఆర్ఐలు శ్రీనివాసరావు, శరత్‌చంద్ర, మండల సర్వేయర్ మహేందర్, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మీ, మారజోడు రాంబాబు, నామాల బుచ్చయ్య, దేవేందర్‌రెడ్డి, లోనెశ్రవణ్‌కుమార్, వివిధ గ్రామాల నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# కొండా.. కేటీఆర్ మధ్య వార్

సోషల్ మీడియా వేదికగా బీసీ

మహిళా మంత్రి సురేఖకు అవమానం

గతంలో సైతం తాటతీస్తా అని

అనుచిత వాఖ్యలు చేసిన కేటీఆర్

కేటీఆర్‌ది అగ్రవర్ణ అహంకారమా..?

బీఆర్ఎస్‌పై మండిపడుతున్న బీసీ, చేనేత సంఘాలు

తెలంగాణలో హీటెక్కిన రాజకీయం

**హన్మకొండజిల్లాబ్యూరో‌- ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ అటవీ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖపై పింకు పార్టీ సోషల్ మీడియా వేదికగా ట్రోలింగ్ వ్యవహారం కాస్తా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రాజకీయం హీటెక్కింది. మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి కేటీఆర్ ఇరు పార్టీల మధ్య వార్ నడుస్తోంది. కాగా గతంలో కూడా కేటీఆర్ మంత్రి కొండా సురేఖపై తాటతీస్తా అనే అనుచిత వాఖ్యలు సైతం చేయడంతో మాజీ మంత్రి కేటీఆర్‌పై తెలంగాణ రాష్ట్రంలోని బీసీ సంఘాలు మండిపడ్డ విషయం విధితమే. తరుచు బీసీ మహిళా మంత్రిపై మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వాఖ్యలు చేయడం పరిపాటిగా మారిందని, తెలంగాణ రాష్ట్రంలోని చేనేత, బీసీ కుల సంఘాలు, కేటీఆర్ వ్యవహారంపై బగ్గుమంటున్నాయి. ఇటీవలనే మెదక్ జిల్లా ఇంచార్జిగా ఉన్న మంత్రి కొండా సురేఖ మెదక్ జిల్లాలో పర్యటించిన సందర్భంగా ఎంపి రఘునందరావు, గౌరవంగా మంత్రి కొండా సురేఖను నూలు పోగుల దండాతో సన్మానించగా అట్టి ఫోటోను మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యలో పింక్ పార్టీ సోషల్ మీడియా అట్టి ఫోటోను ట్రోలింగ్ చేయడం దీంతో మంత్రి కొండా సురేఖ అభిమానులు ఓరుగల్లు జిల్లా నుండి హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయాన్ని ముట్టడించడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కాగా మనస్థాపానికి కొండా సురేఖ విలేఖరుల సమావేశంలో కంటతడి పెట్టడం రాష్ట్రంలోని అందరి హృదయాలను కలిచివేశాయి. కాగా తాను బీసీ మహిళా మంత్రి అయినందునే తనపై మాజీ మంత్రి కేటీఆర్ గులాబీ లీడర్లు కుట్రపన్ని సోషల్‌మీడియాను ఉపయోగించుకొని అవమాన పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీంతో తెలంగాణ రాష్ట్రంలోనే సుపరిచితులైన కొండా సురేఖ అభిమానులు తమ సామాజిక వర్గానికి చెందిన చేనేత సంఘాల నేతలు పలు బీసీ కుల సంఘాల నాయకులు ఈ ట్రోలింగ్ వ్యవహారంపై రాష్ట్ర వ్యాప్తంగా కేటీఆర్‌పై ధ్వజమెత్తుతున్నారు.

దీంతో ఒక్కసారిగా రాజకీయం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హీటెక్కింది. ఓరుగల్లు ఉమ్మడి జిల్లాలో సైతం సోషల్ మీడియా ట్రోలింగ్ వ్యవహారం చర్చనీయాంశమైంది. గత బీఆర్ఎస్ పాలనలో సైతం బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కొండా దంపతులు, కేటీఆర్ మధ్య సొంత పార్టీలోనే కోల్డ్‌వార్ జరిగిన విషయం. అప్పట్లో జిల్లాలో చర్చనీయాంశమైంది. కాగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో మళ్లి సొంత గూటికి చేరడం వరంగల్ తూర్పు కాంగ్రెస్ పార్టీని గెలిచి ప్రస్తుతం రెండు శాఖలకు మంత్రిగా సీనియర్ రాజకీయ మహిళా నేతగా ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలోనే సుపరిచితులుగా ఉన్న మంత్రి కొండా సురేఖను గులాబి పార్టీ టార్గెట్ చేసిందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. వరంగల్ ఉమ్మడి జిల్లాలో హస్తం పార్టీలో వర్గ విభేదాలు ఉన్న నేపథ్యంలో సొంత పార్టీ వారు ఎవరైనా బీఆర్ఎస్ పార్టీతో అంతర్గతంగా చేతులు కలిపి కొండా సురేఖను టార్గెట్ చేశారా..? అనే వార్తలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఇటీవలనే మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్సీ బస్వరాజుపై బహిరంగంగానే వార్నింగ్ ఇవ్వడం తెలిసిందే. కాగా హస్తం సొంత పార్టీలోనే ఇమడలేకపోతున్న కొండా దంపతులకు ప్రతిపక్ష పార్టీ అయినా బీఆర్ఎస్ నుండి సోషల్ మీడియా వేదికగా ట్రోలింగ్ రావడం కొండా అభిమానులకు మింగుడు పడటం లేదు. మహిళా మంత్రిపై చేసిన వాఖ్యలు వెనక్కి తీసుకొని కేటీఆర్ క్షమాపణ చెప్పాలని పిసిసితో పాటు మంత్రులు, మంత్రులు, బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ముందు ముందు ఏం జరుగుతుందో వేచి చూడాలి.

# రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

**ఏటూర్‌నాగారం, ప్రభాతవార్త:**

ఏటూర్‌నాగారం మండల కేంద్రానికి చెందిన పైడాకుల రాజేష్, జాడి రాధికలు అండర్ -17 రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ పర్వతాల కుమార స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లాలోని పైడిపల్లిలో సెప్టెంబర్ 30న నిర్వహించిన అండర్ -17 స్కూల్ ఆఫ్ గేమ్స్ బాల బాలికల విభాగంలో వీరు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వీరు ఈనెల 3 నుండి 5వ తేదీ వరకు మహబూబ్ నగర్ జిల్లాలో స్కూల్ గేమ్స్ ఆఫ్ తెలంగాణ నిర్వహించే రాష్ట్ర స్థాయి హ్యాండ్ పోటీలలో పాల్గొంటున్నారని తెలిపారు.



విలేకరులు కావలెను
ప్రముఖ తెలుగు జాతీయ దిన పత్రిక వార్త లో
పనిచేయుటకు ఈ కింది సెంటర్‌లో
అనుభవం కలిగిన విలేకరులు కావలెను.
అనుభవం కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత
వరంగల్ : వరంగల్ క్రైమ్, వరంగల్ విద్యా, వైద్యం, ఖిలా వరంగల్, మామునూరు, వర్ధన్నపేట, గీసుగొండ.
హన్మకొండ : హన్మకొండ టౌన్,ఖాజీపేట, దామెర, ధర్మసాగర్, వేలేరు, ఆత్మకూరు.
వార్త
సంప్రదించ వలసిన చిరునామా
జె. వెంకట రత్నం
రీజినల్ మేనేజర్
సెల్ : 8008003364

# మన బతుకమ్మలో సైన్స్

**-నేడు పెత్ర అమావాస్య (పితృ అమావాస్య)**
**-నేటి నుండి ప్రారంభమవుతున్న బతుకమ్మ సంబరాలు**
**-బతుకమ్మ పర్యావరణ పరిరక్షణ పండుగ**
**-బతుకమ్మ పండుగ భారతీయ సంస్కృతికి మణిహారం**

*నల్లబెల్లి, అక్టోబర్ 1, ప్రభాతవార్త*

ప్రతి ఏడు బాద్రపద అమావాస్య నుండి తొమ్మిది రోజుల పాటు మహిళలు భక్తి శ్రద్దలతో తీరొక్క పూలతో కుటుంబ సభ్యులు బందుమిత్రుల సమక్షంలో జరుపుకునే ఏకైక పండుగ బతుకమ్మ పండుగ... బతుకమ్మ పండగ అంటే సంవత్సర కాలంలో మనం పడే కష్టాలు సుఖాలు ఇబ్బందులు మరిచిపోయేందుకు సంతోషం అందరి మధ్య తొమ్మిది రోజుల పాటు జరుపుకునే విధంగా ఈ పండుగకు నాటిపెద్దలు శ్రీకారం చుట్టారు. ఈ బతుకమ్మ పండగలు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలతో పాటు నిగూఢంగా సైన్స్ దాగి ఉంది. అనడానికి ఉదాహరణ పితృ అమావాస్య నుండి సద్దుల బతుకమ్మ వరకు రోజుకు ఒక తీరు మనం తినే నైవేద్య ప్రసాదాలు అదేవిధంగా రోజుకు ఒక్క తీరు గౌరమ్మకు అందించే పూల అమరిక... సమీప చెరువుల్లో బతుకమ్మ నిమజ్జనంలో సైతం సైన్స్ దాగుంది. అనడానికి చక్కని ఉదాహరణ ఈ బతుకమ్మపండుగ.. బతుకమ్మ పండగలో సైన్స్ దాగి ఉంది అని తెలియజేసేందుకు సైన్సు ఉపాధ్యాయుడు ఓదెల చంద్రమౌళితో నల్లబెల్లి ప్రభాతవార్త ముఖాముఖి.. ఈ సందర్భంగా ప్రభాతవార్తతో సైన్స్ ఉపాధ్యాయుడు ఓదెల చంద్రమౌళి మాట్లాడుతూ భారతదేశం అనేది కేవలం భౌగోళిక స్థలమే కాదు. ఒక ఆధ్యాత్మిక సాంస్కృతిక, విజ్ఞాన సమృద్ధికి ప్రతీక. ఈ దేశం ప్రాచీన కాలం నుండి ప్రపంచానికి విజ్ఞానంలో మార్గదర్శకత్వం వహించింది. భారతదేశపు సాంప్రదాయాలు శాస్త్ర విజ్ఞానంతో పాటు మన సంస్కృతి అనేక రంగాలలో ఉన్నతంగా నిలిచాయి. బతుకమ్మ పండుగ నాటి పరిస్థితులు ప్రకృతికి మానవునికి ఉన్న సంబంధాన్ని తెలియజేసేదే ఈ పండుగ నేటి ప్లాస్టిక్ బతుకమ్మ డీజే చప్పుల్లతో విష సంస్కృతిని పాటిస్తున్న యువత బతుకమ్మల ఉపయోగించే పూలు వాటి యొక్క ఔషద గుణాలు, మన సంస్కృతిని పాటిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం ప్రపంచంలో జరిగే ఏ పండుగకి ఏ దేశంలో లేని విశిష్టత మన దేశంలో జరిగే ప్రతి పండుగకి ఉంది. మన అన్ని పండుగలు మానవ సంబంధాలను తెలియజేస్తూ పర్యావరణ పరిరక్షణ కోసమే. ప్రతి పండుగ వెనుక ఎంతో సైన్స్ దాగి ఉంది. భారతదేశం ఒక విజ్ఞాన గని మనం ఈ దేశంలో పుట్టినందుకు ఎంతో ధన్యులం. ఈ రోజు మనం బతుకమ్మ నాటి పరిస్థితులు దాన్లో దాడి ఉన్న సైన్స్ గుర్చి వివరంగా తెలుసుకుం దాం.





బతుకునిచ్చే - బతుకమ్మ అమ్మలగన్న అమ్మ- ఆ దేవి గౌరమ్మ పురాణాలు ప్రస్థావించిన దేవత- బతుకమ్మ కావ్యాలు పట్టించుకోని పవ్వు- తంగేడు పండితులు గేల్ చేసిన సాహిత్యం- జానపదం ఈ మూడింటిని తీసుకెళ్లి మట్టి గంధం పుసిన ముక్కలి పీట మీద సర్వోన్న తంగా కూర్చుండబెట్టింది మన తెలంగాణ. పూలతో ఆ దేవున్ని పూజించమే ప్రపంచానికి తెలుసు కానీ ఆ పూలను పూజించే సంస్కారం ఉన్న జ్ఞానభూమి మనది. మనిషి బతికినంత కాలం నిట్టూరుస్తూ బ్రతకడమే ఈ లోకానికి ఎరుక కాని ఆ బ్రతికేదో సంతోషంగా సంతృప్తిగా పండుగలా బ్రతకడం ఈ బతుకమ్మ పండుగ మనకు నేర్పుతుంది. ప్రకృతి రహస్యాన్ని తెలిపే బతుకమ్మ పండుగ మనదేశంలో జరిగే ప్రతి పండుగ లోక కళ్యాణార్థమే అంటే సమాజ శ్రేయస్సుకే ఈ బతుకమ్మ కూడా ప్రకృతికి మనిషికి ఉన్న అవినాభావ సంబందాన్ని తెలియజేస్తుంది. ప్రకృతి విరుద్దంగా ఏది చేసినా వినాశనం తప్పదు. ఏది చేసిన ఎంత చేసినా అది ప్రకృతి సహకారంతోనే సాధ్యమవుతుంది అది చివరికి ప్రకృతిలోనే కలవాలి అనే గొప్ప సందేశాన్ని మనకు నేర్పుతుంది బతుకమ్మ పండుగ.

**-నేపథ్యం....:** బతుకమ్మ పండుగ బాద్రపద అమావాస్య రోజు ప్రారంభమవుతుంది. ఈ అమావాస్యకే పత్రమావాస్య, పితృ అమావాస్య, మిత్రమాస, పెద్దలమాస, పితృదేవతల తిథులు అని పిలుస్తారు. అన్ని వృత్తుల వారు అన్ని కులాల వారు సామూహికంగా ఒకే రోజు పితృదేవతలకు నైవేధ్యం సమర్పించే పండుగ అందుకే దీన్ని పెద్దల పండుగ అని అంటారు. మన దేశంలో 9 సంకేత్ అంకెకు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు నవరసాలు, నవధాన్యాలు, నవమాసాలు, అలాగే ఈ గౌరీదేవికి నవరాత్రులు, బతుకమ్మ పండుగ అమావాస్యతో ప్రారంభమై అష్టమి ఏదా నవమి రోజున ముగుస్తుంది. ప్రతి రోజు బతుకమ్మను ఒక ప్రత్యేక పేర్లతో అలంకరిస్తూ పేరుసూ ఉంటారు. మొదటి రోజు ఎంగిలిపూలబతుకమ్మ, రెండవ రోజు అటుకుల బతుకమ్మ, మూడోరోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ, ఐదో రోజు అట్ల బతుకమ్మ, ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవ రోజు వెన్నెముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ.

**-బతుకమ్మ నాటి పరిస్థితులు....:** విశాలమైన ప్రపంచంలో పూలదొక ప్రపంచం ప్రకృతిలో మానవ సంబంధాన్ని విడదీయలేనట్లే పూలకి మనిషికి ఉన్న సంబంధా న్ని విడదీయలేము. పూలు వికాసానికి సౌందర్యానికి ఆరాధన ఆత్మీయతకు ప్రతీకలు. ఆనాటి రోజుల్లో అందరు కలిసి పూలు తీసుకొచ్చి బతుకమ్మలను పేర్చి ఆనందంతో సాయంత్రం ఆటపాటలతో వారు చేసిన కష్టాన్ని మరుస్తూ ఆనందంగా ఆత్మీయంగా గడుపుతూ ఉండేవారు. దీని వల్ల ప్రతి వ్యక్తి ఇతరతో కలిసి తన కష్టసుఖాలను పంచుకుంటూ ఉల్లాసంగా ఉండేవారు. ప్రతి రోజు సాయంత్రం చివరగా వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటారు. దీని వల్ల ఒకరు తెచ్చిన తిండి పదార్థాలు అందరికి పంచుతూ పరిహాసాలు వరుసలు మాటలు దేనికదే అన్ని అనుభవించాల్సిందే ఇలా తొమ్మిది రోజులు చేస్తూ ఎంతో ఉత్సాహంగా గడుపుతారు. చివరికి బతుకమ్మను నీటి అలలపై జారవిడిస్తారు. అంటే దీని అర్థం ఎంతటి వారైనా ఎంత సంపాదించినా చివరికి ప్రకృతిలో కలిసి పోవాల్సిందే అని నీతిని బోధిస్తుంది.

**-నేటి బతుకమ్మ ఓ ప్లాస్టిక్ భూతం....:** రోజు రోజు సహజ సంప్రదాయాలు మంట కలుస్తున్నాయి. ఈ రోజు ప్రతి పండుగ కేవలం నామమాత్రంగానే జరుపుతున్నారు. బతుకమ్మ కూడా నేడు ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. ఒక పూలతో బతుకమ్మను పెర్చేది లేదు, ఓ పాటలు లేవు. ఓ జానపద గీతాలు లేవు. ఓ నృత్యాలు లేవు. ఏవో డీజే చప్పుల్లు, పిచ్చి సాహిత్యం, అనారోగ్య కరమైన చిందులు, ఇవి ఈ రోజు బతుకమ్మ ఒకరితో మరొకరు మాట్లాడే సమయం లేదు ఎవరికి డీజే చప్పుడు వారిదే ఎవరి పిచ్చి నృత్యం వారిదే. ఎవరికి పిచ్చి వారికే ఆనందం అన్నట్లు నేటి బతుకమ్మ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. పెరుగుట విరుగుట కొరకే ఉన్నట్లు అభివృద్ధితో అనారోగ్య వాతావరణం తయారవుతుంది. ప్లాస్టిక్ బతుకమ్మలు పర్యావరనాన్ని నాషనం చేస్తున్నాయి. విదేశీ సంస్కృతి వల్ల నేడు ఎన్నో రకాల రోగాలు మొన్న కరోనా నేడు మంకీ ఫాక్స్ రేపు మరొకటి, ఇలా ఎనెన్నో సమాజాన్ని అతలాకులం చేస్తున్నాయి. అందుకే మన సంప్రదాయం మనం పాటించి ఇతరులకు పాటించేలా చేయడం వల్ల ఇలాంటి ప్రకృతి వైపరిత్యాలు జరగవు

**-బతుకమ్మ సైన్స్....:** భారతదేశం విజ్ఞాన శాస్త్రంకు పుట్టినిల్లు ప్రతి సాంప్రదాయం ఒక సైంటిఫిక్ ప్రకారమే జరుగుతుంది. ఉగాధి, వినాయక చవితి, దీపావళి, సంక్రాంతి ఇలా అన్ని పండగలు సైన్స్ ప్రకారమే జరుగుతాయి. ఈ రోజు పర్యావరణం ఈ విధంగా పాడవటంకు కారణం కేవలం విదేశీ సంస్కృతిని పటించడం మన సంస్కృతిపి మరవటం. బతుకమ్మలో ఉపయోగించే ప్రతి పువ్వు ప్రతి ఆకు ఒక ఔషదగాని చూసిన వాసన పిలిచిన నీటిలో కలిపిన అంతట కూడా అద్భుతమైన సర్వరోగ నివారణలా పర్యావరణంకు ఎటువంటి హాని ఉండదు. అంతేకాకుండా మనిషికి వచ్చే సర్వరోగాలకు ఏదో ఒక పువ్వు ఏదో ఒక ఆకు పని చేస్తుంది. దీని వల్ల మన దేశ ఔషదగని గుర్చి భావితరాలకు తెలియజేయవచ్చు. అదేవిధంగా పర్యావరణం పైన పత్రి మనిషికి ఒక గౌరవం పెరుగుతుంది. అంతేకాకుండా దానిలో జరిగే సామూహిక నృత్యాల వల్ల పాటలు పాడటం వల్ల సంఘజీవనం, సహకార స్వభావం అలాగే ప్రకృతిపైన అమితనమైన ప్రేమ గౌరవం అలవాడుతాయి. బతుకమ్మలో ఉపయోగించే కొన్ని పూలు వాటి యొక్క ఉపయోగాలు

**-తంగేడు పువ్వు..:** ఇది మంచి ఆంటీ బ్యాక్టీరియల్ గాను మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచడంగా జ్వరాన్ని తగ్గిస్తుంది. అందుకే దీనిని మన రాష్ట్ర పుష్పంగా ఎన్నుకోబడింది.

**-గునుగు పువ్వు...:** ఇది జ్వరానికి కొన్ని రకాల పురుగులు కుడితే నివారణకు జాండీస్, డయేరియా, క్షయవ్యాది నివారణకు వాడుతారు.

**-బంతిపువ్వు...:** ఇది పర్యావరణాన్ని సమతుల్యాన్ని కాపాడుతుంది. దురదలను తగ్గిస్తుంది.

**-చామంతి పువ్వు..:** ఇది గొంతు సమస్యలకు మంచి ఔషదంగా పనిచేస్తుంది. కంటి చూపును మెరుగుపరుస్తుంది.

**-గుమ్మడి పువ్వు...:** కిడ్నీ సమస్యకు చర్మ రోగ నివారణకు కాళ్ల నొప్పులకి దీన్ని ఉపయోగిస్తారు.

**-గడ్డిపూలు...:** ఇది అస్తమా నివారణకు

-కట్ల పూలు ఇది క్యాన్సర్ చికిత్సలు ఉపయోగిస్తారు.

**-సీతజడపూలు...:** ఇది దగ్గు జ్వరము, క్యాన్సర్లకు వాడుతారు.

**ఏదీ ఏమైనప్పటికీ....:** భారతదేశం ప్రపంచానికి విజ్ఞానాన్ని అందించిన దేశం. ప్రపంచానికి బట్టలు కట్టడం తెలియని రోజుల్లో మన భారతీయులు అగ్గిపెట్టెలో పట్టే చీరను తయారు చేశారు. మన సంస్కృతి, సాంప్రదాయం అన్ని సైన్స్ ప్రకారమే కొన్ని వేల సంవత్సరముల నుండి మనం పర్యావరణాన్ని రక్షిస్తూ గౌరవిస్తూ పూజిస్తూ వస్తున్నాం. కేవలం ఇది మన పండుగల ద్వారానే సాధ్యమవుతుంది. కానీ ఇప్పుడు మన సంస్కృతి సంప్రదాయాలను మరిచి విదేశీ సంస్కకృతి మోజులో పడ్డాం. దీనివల్లనే ఈ రోజు ప్రపంచంలోని అన్ని దేశాల లాగానే మన దేశం కూడా ఎన్నో రోగాలు సమస్యలతో సతమతమవుతుంది. కాబట్టి రండి మన సంస్కృతిని తెలుసుకొని భావితరాలకు మన దేశ గొప్పతనానికి మన దేశ సైన్స్‌ని అందిస్తాం. అదేవిధంగా ఈ భూమిని మరికొన్ని సంవత్సరాలు బ్రతికేలాగా చేద్దాం మన సంస్కృతి సైన్స్‌కు మన దేశాన్ని పుట్టినిల్లు చేద్దాం. అందుకే కలిసికట్టుగా ముందడుగు వేద్దాం. పర్యావరణ పరిరక్షణఖు పాటుపడుదాం.

## కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ నియమాలు పాటించని అధికారులు

**- దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన**

*నల్లబెల్లి, అక్టోబర్ 1, ప్రభాతవార్త*

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వచ్చ భారత్ పేరుతో పారిశుద్య కార్యక్రమాలను ఎప్పుటికప్పుడు చేపట్టాలని అధికారులకు సూచించినప్పటికి మండల అభివృద్ధి కార్యాలయంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండి దుర్వాసనకు దారి తీయడంతో ఇది గమణించిన దళిత సంఘాల నాయకులు ఆ చెత్త ప్రదేశంలో కూర్చొని నిరసన తెలిపిన సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం ఎంపిడివో కార్యాలయంలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు బొట్ల



నరేష్, బట్టు సాంబయ్యలు మాట్లాడుతూ మండలాభివృద్ధి కార్యాలయం, మండలంలోని అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలిచి స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాల్సింది పోయి కార్యాలయం ప్రాంగణంలోనే ఎక్కడ చెత్త అక్కడే అన్నట్లుగా ఉండేవిధంగా ఉండటం బాదాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా సంబంధిత అధికారులే కార్యాలయం ఆవరణంలో నిర్లక్ష్యం వహించి చెత్త వేయడం ఏమిటని వారు సూటి ప్రశ్న వేశారు. ఇలాంటి కార్యక్రమాలు కనిపిస్తే మండలంలోని ఏ గ్రామంలోనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం ఏవిధంగా విజయవంతం అవుతుందని వారు దుయ్యబట్టారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ సంఘటనపై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ఎస్ఏ సోషల్ జిల్లా 5వ ర్యాంకర్‌గా రెడ్లవాడ వాసి బండి శ్రీనివాస్

*నెక్కొండ, అక్టోబర్ 1, ప్రభాతవార్త*

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడ గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్ డీఎస్సి సోషల్ స్కూల్ అసిస్టెంట్లో జిల్లా స్థాయిలో ఐదవ ర్యాంకు సాధించాడు. చిన్నతనంలో తల్లిని కోల్పోయిన శ్రీనివాస్ చందుపట్ల ముందునుండి చురుకుగా ఉండేవాడు. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఎకనామిక్స్‌లో పీజీ పూర్తి చేసిన శ్రీనివాస్ ప్రస్తుతం మణుగూరులోని ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాడు. జూనియర్ లెక్చరర్ పోస్టులో సైతం సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వెళ్లి ఉద్యోగం కోసం చూస్తున్నాడు. సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో జిల్లా స్థాయి ర్యాంక్ సాధించి ఉద్యోగం సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎంబీబీఎస్ సీట్లు సాధించిన బాలికలు అభినందించిన మండల ప్రజలు

నల్లబెల్లి, అక్టోబర్ 1, ప్రభాతవార్త




ఇటీవల ఎంసెట్ కౌన్సిలింగ్‌లో నల్లబెల్లి మండలం లోని బాలికలు ఎంబిబిఎస్ సీట్లు సాధించి మండల ప్రజల మెప్పును పొందారు. మండల కేంద్రానికి చెందిన కల్లెం పాపిరెడ్డి- గీత దంపతుల కూతురు హిమశివానిరెడ్డి మహాత్మగాంధీ జ్యోతిరావుపూలే ఊర్సు గుట్ట కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించి ఇటీవల జరిగిన ఎంసెట్ ఫలితాల్లో 720 మార్కులకు గాను 559 మార్కులు సాధించి ఓపెన్ కేటగిరిలో ఎంబిబిఎస్ విద్యార్థత సాధించింది. ఈ నేపథ్యంలో మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన ఇంబడి కరుణాకర్- స్వప్న దంపతుల కూతురు సుహని ఇటీవల జరిగిన ఎంసెట్ పరీక్షల్లో కౌన్సిలింగ్‌లో భాగంగా 720 మార్కులకు గాను 645 మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించడంతో అటు బంధుమిత్రులు, ఇటు మండల ప్రజలు వారిని అభినందించారు. బాలికను సమాజంలో పురుషుల కంటే అన్ని రంగాలలో రాణించి ముందుకు సాగుతుండటం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## ఆశాలకు జాబ్ చార్టు ప్రకారమే విధులను అప్పగించాలి

నర్సంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త



ఆశా వర్కర్లకి తగ్గ పారితోషకమని చెప్పి పనులు చేపించుకుంటూ వారితో పారితోషికం లేనటువంటి అనేక పనులు చెబుతున్నారని ఇలాంటి పనులు చెప్పకూడదు అని ఆశ వర్కర్స్ యూనియన్ బీఆర్‌టియు అనుబంధ సంఘం బాంజిపేట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకురాలు రమ, మండల అధ్యక్షురాలు పామా మాట్లాడుతూ జాబ్ చార్టు ప్రకారం పనులు చెప్పాలని అన్నారు. పారితోషకం లేని పనులు చెబితే వాటికి ప్రత్యేక పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్ణిమ, మంజుల, సంధ్య, శోభ, సరోజన, రేఖ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో....:ఆశా కార్యకర్తలకు జాబ్ చార్టులో పేర్కొన్న విధంగా విధులను అప్పగించాలని కోరుతూ మండలంలోని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్ ఆర్డర్‌లో ఉన్న పనులను మాత్రమే మేము చేయలని మాకు జాబ్ చార్టు ఇవ్వటం జరిగింది. కావున జాబ్ చార్టులో ఉన్న పనులు మాత్రమే మాతో చేయించాలని అదనంగా వేరే పనులు చేయాలని చెప్పినచో ఆ పనులకి సంబంధించి గైడ్‌లైన్స్, ఆ పనులకి సంబంధించిన ప్రత్యేక పారితోషికం ఇస్తేనే మేము చేస్తామని లేనిచో ఆ పనుల విషయంలో మమ్మల్ని ఒత్తిడి చేయొద్దని బీఆర్‌టియు అనుబంధ ఆశా యూనియన్ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కే. లలిత, ఏ.అనిత, ఎం.శ్రీలత, పీ.జ్యోతి, ఎం.జయ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు చేయూత తంగళ్ళపల్లి రమేష్ భరోసా

ప్రభాతవార్త ఎల్కతుర్తి:

ఎల్కతుర్తి మండలం పెంచికలపేట గ్రామంలో ఇటీవల మరణించిన మైస కొమురయ్య కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగడ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా పొన్నం యువసేన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తంగళ్ళపల్లి రమేష్ మాట్లాడుతూ.. మైస కొమురయ్య మృదువు శీలీ నైపుణ్యత స్వభావం కలవాడని ఆయన కొనియాడారు. అనంతరం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించినట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. మృతుని కుమారులు మైస చిరంజీవి మైస శ్రీనివాస్‌లను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెంచికలపేట కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ముప్పు శీను, సాముల మల్లారెడ్డి, దాట్ల ప్రవీణ్, బోనగాని కరుణాకర్, కాళ్ల శీను, తాళ్లపెల్లి సంపత్, దాట్ల ప్రవీణ్, దాట్ల వీరయ్య, కళ్యాణ్, మైసా శ్రీకాంత్, సూరార గ్రామం మాజీ వార్డు మెంబర్ చెల్లూరు వేణు, మండల సోషల్ మీడియా అధ్యక్షులు చిలుముల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ మేరీస్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబురాలు

హసన్ పర్తి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:



హసన్ పర్తి మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ, దసరా సంబురాలను విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. పదవ తరగతి, 9వ తరగతి విద్యార్థినీలు వివిధ రకాల పూలను సేకరించి, రంగురంగులతో బతుకమ్మలను స్వయంగా పేర్చారు. చిన్న పిల్లలు సైతం రంగురంగుల దుస్తులను ధరించి కోలాటాలతో పాఠశాలలో పండుగ వాతావరణం సృష్టించారు. చిన్న పిల్లలను అందంగా అలంకరించి వారి తల్లులు సైతం వేడుకల్లో పాల్గొనడం జరిగింది. రెండు గంటల పాటు బతుకమ్మ పాటలతో విద్యార్థులు తెలంగాణ సాంప్రదాయ, సంస్కృతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల



ప్రధానోపాధ్యాయుడు పాకాల తిరుమలేశ్వర్ రెడ్డి బతుకమ్మ సంబరాలను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ మహిళలకు ఎంతో గౌరవ ప్రతిష్టలను తీసుకొచ్చే బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులపాటు సంతోషాలతో జరుపుకొని ఆనందాలను పంచుకోవాలని సూచించారు. అనంతరం జమ్మి చెట్టుకు పూజలు చేసి, రావణాసుధ దహన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం కల్పనా రెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, గంజి బద్రి నారాయణరెడ్డి, ఎలుక రాజు సదానందం, పాఠశాల బృందం విజయరాణి, అంజద్, రవి నాయర్, భయ్యా సదానందం, ప్రత్యూష, విజిత, అనురాధ, సంధ్యారాణి, రజని, కీర్తన, స్వప్న, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## ద్వేషించకుండా వయోవృద్ధుల సంక్షేమానికి సహకరించాలి



చెన్నారావుపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త

ద్వేషించకుండా వయోవృద్ధుల సంక్షేమానికి సహకరించాలని మలివయసులో ఉన్న వారిని ద్వేషించకుండా వారి సంక్షేమం కోసం సహకరించాలని తహసీల్దార్ ఫణికుమార్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం చెన్నారావుపేట జాగృతి విద్యానికేతన్ నందు వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం ఘనంగా జరిగింది. అతిథులుగా పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ పెద్దలు ఇంటికి మామిడి తోరణాలు లాంటి వారని పెద్దలు ఉన్న ఇల్లు శుభగృహమని అన్నారు. పెద్దలను రక్షించుటలో ప్రభుత్వపరంగా సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీవాణి, ఎస్ఐ రాకేష్‌రెడ్డి, సంఘ అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్యలు మాట్లాడుతూ సంఘం ఏర్పడి ఆరు నెలలు అయిందని దీనిలో సభ్యులు 120మంది ఉన్నారని అందులో 50 మందికి ఐడి కార్డులు అందించామన్నారు. కాగా సిద్ధార్థ విద్యాలయాల వ్యవస్థాపకులు కందిగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వృద్ధుల సంఘానికి తన సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని ఈ సంఘానికి ఒక వేదికను ఏర్పరుచుటకు తన సొంత ఖర్చులతో గదిని నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సభ్యులు వరగంటి మల్లయ్య, పత్తి సంజీవరెడ్డి, ముత్యం సాంబయ్య, గట్ల కృష్ణ, కంది నారాయణరెడ్డి, తోట ఆనందం, పరకాల కొమురయ్య, దొనికల వీరయ్య, సాదు మధుసూదన్‌రెడ్డి, కోరె కట్టయ్య, తాళ్లపల్లి కొమ్మాలు, ఆడెపు సత్తయ్య, సిద్ద కుమారస్వామిలు పాల్గొన్నారు.

## మాలలు ఐక్యతను చాటుకోవాలి

హసన్ పర్తి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:



మాలల హక్కులు కొనసాగాలంటే వారంతా ఏకతాటి పైకి వచ్చి ఐక్యతను చాటుకోవలసిన అవసరము ఉందని రిటైర్డ్ డీఎస్పీ దామర నరసయ్య పేర్కొన్నారు. మంగళవారం హసన్ పర్తి మండల కేంద్రంలోని విజయ గార్డెన్‌లో జరిగిన మాలల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 20న జరిగే ఉమ్మడి వరంగల్ జిల్లా మాలల ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని మాల కుల బాంధవ్యాయులందరూ విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో ఉన్న మాలలు తమ ఐక్యతను చాటుకోవలసిన అవసరం ఉందని గుర్తు చేశారు. హసన్ పర్తి మండల మాల సంఘం అధ్యక్షుడు పోతరాజు ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దావారవి, రిటైర్డ్ హెచ్ఎం, పోతురాజు రాజేందర్, సోషల్ మీడియా ఇన్చార్జి దండి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ తండ్రి సాంబయ్య, రిటైర్డ్ టీచర్ పాపయ్య, పోతరాజు మల్లికార్జున్, చుక్క ప్రభాకర్, పప్పుల కుమారస్వామి, సురేందర్, బిక్షపతి, రమేష్, గరిగె అనిల్, రాజు, కనకం మనోహర్, పోతరాజు మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల విధులపై ఆకట్టుకున్న డాక్యుమెంటరీ

భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :



భద్రాచలం గ్రామ పంచాయతీల పరిధిలో రోజు పలు సవాళ్ల నడుమ విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యలు, వారి సాధక బాధలపై సోమవారం భద్రాచలం ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శనలు ఇచ్చారు. ఐటీసీ వావ్ (ఈ -శ్రీ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనను నిర్వహకులు (ఐటీసీ వావ్) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పారిశుద్ధ్య కార్మికులు రోజు వారి ఇంటింటికి వెళ్ళి తడిపొడి చెత్త సేకరణ, ఆటోలు, ట్రాక్టర్‌లో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించే విధానం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలకు పంచాయతీ సిబ్బంది మధ్య పలు చోట్ల వాగ్వివాదం జరగడం, అవి కాస్త అధికారుల వద్దకు చేరడం, అధికారులు ఇరువురికి సర్ది చెప్పడం, గ్రామపంచాయతీ సిబ్బంది పట్ల ఉన్న చిన్న చూపు ఇలా తదితర అంశాలపైవిద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు పలువురు అబ్బురపరిచాయి. విద్యార్థులు ప్రదర్శించిన వాటిలో ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థినికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, డా.స్పందన, ఐటీసీ వావ్ సంస్థ ప్రోగ్రాం కో.ఆర్డినేటర్ రమ్య, ఫీల్డ్ కో.ఆర్డినేటర్లు సౌజన్య, రాజేశ్వరి, గ్రామపంచాయతీ సిబ్బంది చంద్రశేఖర్, సూపర్‌వైజర్లు, ఆటో డ్రైవర్లు, హెల్పర్లు, సీఆర్పీలు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనులు గుర్తింపు, ప్రణాళికలు తయారు చేయాలి

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2025 - 2026 ఆర్థిక సంవత్సరానికి ల్యాబర్ బడ్జెట్ తయారీ, పనుల గుర్తింపు ప్రణాళికల తయారీ నిర్వహించాలని దుమ్ముగూడెం మండల ఎంపీడీవో ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు దుమ్ముగూడెం మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రజలందరి భాగస్వామ్యంతో 2025 - 2026 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి పనులు గుర్తింపు ప్రణాళికలుతయారు చేయాలని, అందుకు షెడ్యూల్ ఖరారు చేయడం జరిగిందని, ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ ప్రత్యేక అధికారులు ఆధ్వర్యంలో ప్రజల సమన్వయంతో సహజ వనరుల కమిటీ మేట్లు, కూలీలు, రైతుల సహకారంతో కూలీల బడ్జెట్ అంచనా పనులు గుర్తింపు గ్రామసభ ఆమోదంతో పనుల మంజూరు, ప్రతిపాదనలతో సమర్పించుటకు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఆయన ఒక ప్రకటనలో సిబ్బందికి తెలిపారు.